
'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 238

శనివారం 19-11-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆగని వాన.. జరగని ఆట

వర్షం కారణంగా భారత్, న్యూజిలాండ్ తొలి టి20 మ్యాచ్ రద్దయ్యింది -15లో



మరో పదేళ్లు పదవీకాలం


పీఎస్‌బీల్లోని సీఈవోల గరిష్ట పదవీ కాలాన్ని 10 ఏళ్లు పెంచిన కేంద్రం -15లో



ఉగ్రవాదానికి మద్దతా?

కొన్ని దేశాలు ఉగ్రవాదానికి నారు పెట్టి నీరు పోస్తున్నాయని పాక్, చైనాలపై ప్రధాని మోదీ పరోక్షంగా విరుచుకుపడ్డారు.

వివరాలు 6లో



బైడెన్ కుటుంబంపై విచారణ

అమెరికా ప్రతినిధుల సభలో ఆధిక్యాన్ని సాధించిన రిపబ్లికన్లు బైడెన్ కుటుంబంపై విచారణకు ప్రాధాన్యమిస్తామని ప్రకటించారు.

వివరాలు 6లో



భారత్‌తో త్వరలో ఎఫ్‌టీఏ

భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకొనేందుకు కృత నిశ్చయంతో ఉన్నామని యూకే ప్రధాని రిషి సునాక్ చెప్పారు.

వివరాలు 6లో



గంజాయి తాగి శ్రద్ధ హత్య

డ్రగ్స్‌కు బానిసైన తాను గంజాయి తాగిన మత్తులో శ్రద్ధని హత్య చేసినట్టుగా నిందితుడు అఫ్తాబ్ పోలీసులకు తెలిపాడు.

వివరాలు 6లో

ఏది నిజం?

రైతుకు 'మద్దతు'లో

పోలిక ఉందా?

- చంద్రబాబు ఐదేళ్లలో పంటల కొనుగోళ్లకు పెట్టిన ఖర్చు రూ.3,322 కోట్లు
- ఈ ప్రభుత్వం మూడున్నరేళ్లలో చేసిన ఖర్చు రూ.7,157 కోట్లు
- ఒక్క ధాన్యం చూసుకున్నా బాబు ఐదేళ్లలో సేకరించింది రూ.43,134 కోట్లు
- ఈ ప్రభుత్వం మూడు సీజన్ల లోనే ఏకంగా రూ.48,793 కోట్ల విలువైన కొనుగోళ్లు
- రెండు ప్రభుత్వాల మధ్యా పోలికే లేకున్నా... రామోజీ తప్పుడు రాతలు
- దేశంలోనే తొలిసారిగా 6 పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించిన రాష్ట్రం
- కొన్ని పంటలను మాత్రమే కొంటున్న కేంద్రం; దీంతో రాష్ట్రం ముందడుగు
- అప్పట్లోనే ఈ ఆరింటికీ రాష్ట్రం ఉదారంగా ధరల నిర్ణయం
- అంతకన్నా తక్కువకు పడిపోకూడదన్న ఉద్దేశంతోనే కనీస మద్దతు ధరలు
- కానీ వాటిని పెంచటం లేదంటూ 'ఈనాడు' సన్నాయి నొక్కులు

4లో

సకల వసతులు

రూ.3,364 కోట్లతో సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో నాడు-నేడు

ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- రాష్ట్రంలో మూడు దశల్లో మొత్తం 3,013 చోట్ల పనులు చేపట్టాలి
- జనవరి నుంచి మొదటి దశ పనులు ప్రారంభం
- మౌలిక సదుపాయాలతో పాటు ఆధునిక కిచెన్ ఏర్పాటు
- 759 మంది సంక్షేమ అధికారులు, 80 మంది కేర్ టేకర్లు, గిరిజన గురుకులాల్లో 171 మంది వెల్ఫేర్ అధికారుల పోస్టులు భర్తీ చేయండి
- హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫిర్యాదులకు ఒక నంబర్ ఉంచాలి



"హాస్టళ్లలో ఇప్పుడున్న పరిస్థితులు పూర్తిగా మారాలి. పిల్లలు చదువుకోవడానికి మంచి వాతావరణం కల్పించాల్సిన బాధ్యత మనపై ఉంది. హాస్టళ్లలోకి వెళ్లగానే జైల్లోకి వెళ్లామనే భావన వారికి కలగకూడదు. చదువులు కొనలేని కుటుంబాల వారే పిల్లలను హాస్టళ్లకు పంపిస్తారు. అందువల్ల అలాంటి పిల్లలు బాగా చదువుకుని, బాగా ఎదగడానికి హాస్టళ్లు వేదిక కావాలి. మన పిల్లలనే హాస్టళ్లలో ఉంచితే ఎలాంటి వసతులు, వాతావరణం ఉండాలను కుంటామో సంక్షేమ హాస్టళ్లన్నింటినీ అలా తీర్చిదిద్దాలి."

- సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని హాస్టళ్ల రూపురేఖలు మార్చి, అత్యుత్తమ విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా రూ.3,364 కోట్లతో 3,013 సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల ఆధునీకరణకు నాడు-నేడు కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ నాడు-నేడు పనులు, అనంతర నిర్వహణపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ, సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలపై శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. హాస్టళ్లలో మంచి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు కిచెన్‌లు సైతం ఆధునీకరించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలన్నారు. హాస్టళ్లలో ఇప్పుడున్న పరిస్థితులు పూర్తిగా మారాలని, సమాజంలో అట్టడుగున ఉన్న వారు చదువుకోవడానికి తగిన పరిస్థితులు కల్పించాలని చెప్పారు. బంకర్ బెడ్స్, తదితర అన్ని సౌకర్యాలు నాణ్యతతో ఉండేలా చర్యలు తీసుకోవాలని, భవనాలను పరిగణనలోకి తీసుకుని వాటి డిజైన్లను

మిగతా 2వ పేజీలో ▶

మీకు చెప్ప చూపించాలి.. కానీ.. నాకు సభ్యత ఉంది



- కర్నూలు పర్యటనలో ఊగిపోయిన ప్రతిపక్ష నేత చంద్రబాబు
- 'న్యాయ రాజధాని' కోసం నినదిస్తూ ఎక్కడికక్కడ అడ్డుకున్న స్థానికులు
- ఒకే రాజధాని.. అంటూ అడుగడుగునా వారిని కవ్వించిన టీడీపీ బాస్
- తన వారిచేత కూడా 'ఒకే రాజధాని' అనిపిస్తూ ఆద్యంతం రెచ్చగొట్టిన తీరు
- అడ్డుకున్న న్యాయవాదులు, విద్యార్థులపైకి టీడీపీ కార్యకర్తలను ఉసిగొల్పిన నేత
- దద్దమ్మ, పనికిమాలిన రౌడీ సీఎం అంటూ అసభ్య పదజాలంతో తిట్ల దండకం
- కర్నూలు ఎస్పీ, పోలీసులపై పరుష పదజాలంతో దూషణ

7లో



దూసుకెళ్లిన ప్రైవేట్ రాకెట్

తొలి ప్రయోగం విజయవంతం

శ్రీహరికోట నుంచి ప్రారంభ్ (విక్రమ్-ఎస్)ను ప్రయోగించిన ఇస్రో.. అంతరిక్ష ప్రయోగాల్లో

సరికొత్త చరిత్రకు భారత్ శ్రీకారం

వాతావరణ అధ్యయనం కోసం ప్రయోగం

ప్రైవేటు సంస్థలకు, స్టార్టప్స్‌కు ఇస్రో ప్రోత్సాహం

శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందన

2లో

ఉల్లంఘనలపై ఉక్రోషం



- చిట్టీల సొమ్ము మళ్లించి మార్గదర్శి ఎదురుదాడి
- సొంత అవసరాలకు చందాదారుల సొమ్ము వాడుకోవడం తప్పు కాదా?
- చట్ట ఉల్లంఘనలను ప్రభుత్వ ఏజెన్సీలు అంగీకరిస్తాయా?
- తప్పులు జరిగితే గుర్తించడం తప్పెలా అవుతుంది
- తనిఖీ బృందాలకు సహాయ నిరాకరణ

8లో

తెలీదు.. గుర్తు లేదు

- సీఐడీ విచారణలో ఇదే 'నారాయణ' మంత్రం
- ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణంపై దాటవేత వైఖరి
- హైదరాబాద్‌లోని ఆయన ఇంటి వద్ద విచారణ
- ఇన్నర్ రింగ్ రోడ్డుకు ఇటూ అటూ బాబు బినామీల భూములే.. అలైన్‌మెంట్ ముసుగులో భూ దోపిడీ.. కీలక ఆధారాలతో కేసు నమోదు

2లో



నారాయణ ఇంటి వద్ద సీఐడీ సిబ్బంది

దక్షిణ కోస్తా వైపు వాయుగుండం!

రేపటి నుంచి దక్షిణ కోస్తా, సీమలకు వానలు

ఆగ్నేయ బంగాళాఖాతం, దాని పరిసరాల్లో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోంది. ఈ అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ రానున్న 24 గంటల్లో దక్షిణ బంగాళాఖాతంలోని మధ్య ప్రాంతంలో వాయుగుండంగా బలపడనుంది. దీని ప్రభావంతో ఈ నెల 20 నుంచి 22 వరకు దక్షిణ కోస్తా, రాయలసీమల్లో కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది.

2లో



రూ.1,400 కోట్లతో 'పశ్చిమ'కు తాగునీరు

- 21న పథకానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శంకుస్థాపన
- ఆక్వా కాలుష్యం, ఉప్పు నీటి సమస్యతో ఎద్దడి
- 10 నియోజక వర్గాలలో 26 మండలాలకు ఊరట
- గోదావరి నుంచి ఏటా 1.374 టీఎంసీల వినియోగం
- తొమ్మిది ఉమ్మడి జిల్లాలో వాటర్ గ్రిడ్ అమలు
- ఉద్దానం, పులివెందుల, డోన్‌లో ఇప్పటికే మొదలైన పనులు
- మరో 5 జిల్లాలకు టెండర్లు పూర్తి

2లో



సుకన్య నౌక వద్ద సిబ్బంది

కృష్ణపట్నానికి 'ఐఎన్ఎస్ సుకన్య'

ముత్తుకూరు: అదాని కృష్ణపట్నం పోర్టులో ఇండియన్ నేవీ డే సందర్భంగా భారత నౌకాదళానికి చెందిన 'ఐఎన్ఎస్ సుకన్య' అనే యుద్ధ నౌక పోర్టులో 1వ నంబర్ బెర్తు వద్ద శుక్రవారం లంగరు వేసింది. 101 మీటర్ల పొడవు, 39 కిలోమీటర్ల వేగం కలిగిన ఈ నౌక సముద్రంలో శత్రువుల నుంచి ఎటువంటి సవాళ్లనైనా ఎదుర్కొని, దీటుగా సమాధానం ఇవ్వగల సామర్థ్యం కలిగినది. ఆగస్టు 31, 1989న ఈ నౌక బాధ్యతలు చేపట్టింది. నిరంతరం గస్తీ తిరిగే యుద్ధ నౌకలో ఆయుధ సంపత్తి, సౌకర్యాలు, ఏర్పాట్లు, సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సుమారు 8,000 మంది సందర్శకులు ఈ యుద్ధ నౌకను తిలకించారని అధికారులు అంచనా వేశారు.



సుకన్య యుద్ధనౌక సందర్శనకు బారులు తీరిన విద్యార్థులు

డోలీలకు చెక్ పెట్టేలా 'గిరి రక్షక్'

గిరిపుత్రుల ఆరోగ్య రక్షణకు 123 బైక్ అంబులెన్స్‌లు

సాక్షి, అమరావతి: మారుమూల అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులకు సుస్తీ చేస్తే దుప్పట్లతో డోలీ కట్టి కర్రలతో మోసుకుపోవడం.. మంచాలపై పడుకోబెట్టి ఆస్పత్రులకు తరలించే దుస్థితి తప్పనుంది. మారుమూల గిరిజన బిడ్డలకు సైతం తక్షణ వైద్య సహాయం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం 'గిరి రక్షక్' ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతోంది. ఈ ప్రాజెక్ట్ కింద 123 బైక్ అంబులెన్స్‌లను రంగంలోకి దింపుతోంది. ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో 108, 104 అంబులెన్స్‌లతోపాటు 122 ఫీడర్ అంబులెన్స్ (మూడు చక్రాల బైక్)లు వైద్య సేవలు అందిస్తున్నాయి. మూడు చక్రాల ఫీడర్ అంబులెన్స్‌లు సైతం వెళ్లలేని ప్రాంతాలకు చేరుకునేలా బైక్ అబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చే కసరత్తు తుది దశకు చేరుకుంది.



బైక్ అంబులెన్స్

కాలిబాట ఉన్నా సరిపోతుంది

నాలుగు చక్రాల అంబులెన్స్‌లు వెళ్లాలంటే కనీసం 6 అడుగుల దారి, మూడు చక్రాల ఫీడర్ అంబులెన్స్‌లు వెళ్లాలంటే మూడు అడుగుల దారి తప్పనిసరి. అదే బైక్ అంబులెన్స్ అయితే అడుగు, అడుగున్నర మార్గం ఉంటే చాలు. దీంతో ఇది మారుమూల ప్రాంతాల గిరిజనులకు ఉపయోగపడుతుందని గిరిజన సంక్షేమ శాఖలోని వైద్య, ఆరోగ్య విభాగం అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ పర్యవేక్షణలో కాకినాడ జేఎన్‌టీయూ రూపొందించిన బైక్ అంబులెన్స్ మోడల్ తరహాలో కొత్త బైక్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తేనున్నారు. డ్రైవింగ్ సీటు వెనుక ఒక వ్యక్తి సౌకర్యంగా కూర్చునేలా 140 డిగ్రీల కోణంలో వాల్చిన తొట్టి లాంటి సీటు, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేలా ఆర కిలో ఆక్సిజన్ సిలిండర్, సెలైన్ బాటిల్ పెట్టుకునే ఏర్పాటుతోపాటు ప్రాథమిక చికిత్స(ఫస్ట్ ఎయిడ్ కిట్) సామగ్రి ఉండేలా డిజైన్ చేయడం విశేషం.

ఇదండీ సంగతి



నీ పర్సు ఎవడిక్కావాలి!
చలికి చస్తున్నా.. నీ స్వెటర్ ఇచ్చేయ్!!

క్లుప్తంగా

23న మరోసారి అభ్యంతరాలపై విచారణ

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతమైన గుంటూరు జిల్లా తుళ్లూరు, మంగళగిరి మండలాల్లోని మందడం, ఐనవోలు, కృష్ణాయపాలెం, నిడమర్రు, కురగల్లు గ్రామాల పరిధిలో 900.97 ఎకరాల్లో పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్ల కోసం భూ వినియోగం మార్పుపై ప్రభుత్వం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీనిపై ఈ నెల 11 వరకు అభ్యంతరాలను స్వీకరించి.. అర్జీదారులను వ్యక్తిగతంగా సీఆర్‌డీఏ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరవ్వాలని సూచించింది. విచారణకు హాజరవ్వని వారి కోసం 23న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు మరోసారి హియరింగ్ నిర్వహిస్తున్నట్లు సీఆర్‌డీఏ శుక్రవారం ప్రకటనలో తెలిపింది.

మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులకు అవకాశం కల్పించాలని రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ నిర్ణయించింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న మద్యం దుకాణాలు, వాకిన్ స్టోర్స్‌లలో ప్రస్తుతం నగదు చెల్లింపులనే అనుమతిస్తున్నారు. కాగా సోమవారం నుంచి నగదు చెల్లింపులతోపాటు డిజిటల్ చెల్లింపులకూ అవకాశం ఇవ్వనున్నారు. మద్యం దుకాణాలు,వాకిన్ స్టోర్స్‌ల్లో స్వైపింగ్ మెషిన్లతో కార్డు ద్వారానూ, యూపీఐ, క్యూఆర్ కోడ్ తదితర డిజిటల్ చెల్లింపులకు అనుమతిస్తారు. దీన్ని రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి ధ్రువీకరించారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

సాక్షి, అమరావతి: పంచాయతీరాజ్ శాఖలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రేడ్- 3, గ్రేడ్ -4 పంచాయతీ కార్యదర్శులకు సంబంధించి ఏ జిల్లాకు ఆ జిల్లాలో ఆయా కలెక్టర్ల ఆధ్వర్యంలో స్థానిక ఖాళీల మేరకు రిజర్వేషన్, రోస్టర్ పాయింట్ల ప్రకారం సీనియారిటీల జాబితాలు సిద్ధం చేసుకొని పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కోన శశిధర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. గ్రేడ్-1, గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శుల పదోన్నతులు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ స్థాయిలో నిర్ణయం తీసుకునే వీలుగా, జిల్లాల వారీగా ఖాళీలు, సీనియారిటీ జాబితాలను పంపాలంటూ పేర్కొన్నారు.

26న పీఎస్ఎల్‌వీ సీ54 ప్రయోగం

సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సమీపంలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈనెల 26వ తేదీ 11.56 గంటలకు పీఎస్ఎల్‌వీ సీ54ను ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఇస్రో శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ప్రయోగం ద్వారా ఈఓఎస్-06 ఉపగ్రహంతో పాటు మరో ఆరు ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపనున్నారు. ఇందులో ముఖ్యంగా ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్‌ను రోదసీలోకి పంపుతారు. ఒక విదేశీ, ఐదు స్వదేశీ ఉపగ్రహాలను పంపనున్నారు. ఈ ప్రయోగాన్ని వీక్షించాలనుకునే వారు ఈనెల 20న ఉదయం 10 గంటల నుంచి www.lvg.shar.gov.in వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలని షార్ అధికారులు కోరారు. ఇలా నమోదు చేసుకున్న వారికి శ్రీహరికోటలోని లాంచ్ వ్యూ గ్యాలరీ నుంచి ప్రయోగాన్ని వీక్షించే అవకాశాన్ని కల్పిస్తారు.

గంగమ్మ కంటే కృష్ణమ్మ మిన్న

సాక్షి, అమరావతి: కృష్ణానది పరీవాహక ప్రాంతం (బేసిన్)లో ఉన్న జలాశయాల నీటి నిల్వ సామర్థ్యం 1,788.72 టీఎంసీలు. గంగా బేసిన్‌లో నిర్మాణం పూర్తయిన జలాశయాల నీటినిల్వ సామర్థ్యం 1,719.01 టీఎంసీలే. అంటే.. గంగా బేసిన్ కంటే కృష్ణా బేసిన్‌లోని జలాశయాల నీటినిల్వ సామర్థ్యం 69.71 టీఎంసీలు అధికం. కృష్ణా బేసిన్‌లో ఏపీ, తెలంగాణల ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నీటినిల్వ సామర్థ్యమే 527.85 టీఎంసీలు కావడం గమనార్హం. దేశంలో అతి పెద్ద నది అయిన గంగా బేసిన్ కంటే కృష్ణా బేసిన్ జలాశయాల నీటినిల్వ సామర్థ్యంలో అగ్రస్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా అన్ని నదుల బేసిన్‌లలో నిర్మాణం పూర్తయిన జలాశయాల నీటినిల్వ సామర్థ్యంపై కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అధ్యయనం చేసింది. అన్ని నదుల బేసిన్‌లలో రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యం 9,104.55 టీఎంసీలని సీడబ్ల్యూసీ తేల్చింది. దేశంలో అన్ని బేసిన్‌లలోని రిజర్వాయర్ల నీటి సామర్థ్యంలో కృష్ణా బేసిన్ 19.65%తో తొలిస్థానంలో నిలిచింది.

మెరైన్ మత్స్య ఉత్పత్తుల్లో ఏపీకి ఐదు అవార్డులు

కైకలూరు: నేషనల్ ఫిషరీష్ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌ఎఫ్‌డీబీ) ఏటా నవంబర్ 21న ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అందించే అవార్డుల్లో ఏపీకి 5 విభాగాల్లో చోటు దక్కింది. ఏ, బీ కేటగిరీలుగా ఎంపిక చేసిన జాబితాను ఎన్‌ఎఫ్‌డీబీ శుక్రవారం ప్రకటించింది. ఏపీలో ఉత్తమ మెరైన్ జిల్లాగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఉత్తమ మెరైన్ చేపల రైతుగా ఏలూరు జిల్లా మట్టగుంటకి చెందిన తిరుమాని నాగరాజు, ఉత్తమ హేచరీగా కాకినాడ జిల్లాకు చెందిన సప్తగిరి హేచరీస్, ఉత్తమ ల్యాబ్‌గా తూర్పు గోదావరి జిల్లా రెడ్డి డ్రగ్స్.. ల్యాబ్‌కు చెందిన నరేష్‌కుమార్, ఉత్తమ ఆర్టెమియా టెక్నాలజీ ఇన్నొవేషన్‌గా కవితారెడ్డికి అవార్డులు దక్కాయి.

మున్సిపల్ కార్పొరేషన్ల రాబడి స్వల్పమే

- ఢిల్లీ, మహారాష్ట్రల్లో మినహా మిగతా రాష్ట్రాల్లో చాలా తక్కువ
- రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఒక శాతం కూడా ఏ రాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ల రాబడి లేదు
- దేశంలోని వివిధ కార్పొరేషన్ల సగటు ఆదాయాలతో పోలిస్తే ఏపీలో చాలా తక్కువ
- దేశ జీడీపీలో కార్పొరేషన్ల సగటు రాబడి 0.72 శాతమైతే ఏపీ జీఎస్‌డీపీలో అది 0.38 శాతమే
- అదే ఢిల్లీలో 2.75 శాతం.. మహారాష్ట్రలో 2.12 శాతం ఆదాయం
- ఏపీలో కార్పొరేషన్ల సొంత రాబడి రూ.2,906.83 కోట్లు.. రెవెన్యూ వ్యయం రూ.2,954.08 కోట్లు
- వివిధ రాష్ట్రాల మున్సిపల్ కార్పొరేషన్ల రాబడులు, వ్యయాలపై ఆర్‌బీఐ నివేదిక



సాక్షి, అమరావతి : దేశంలో ఢిల్లీ, మహారాష్ట్రల్లోని మున్సిపల్ కార్పొరేషన్ల మినహా మిగతా రాష్ట్రాల్లోని కార్పొరేషన్ల రెవెన్యూ రాబడి చాలా తక్కువగా ఉందని రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నివేదిక వెల్లడించింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఒక శాతం కూడా మిగతా రాష్ట్రాల కార్పొరేషన్ల రెవెన్యూ రాబడిలేదని పేర్కొంది. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ల రెవెన్యూ రాబడి ఆ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 2.75 శాతం ఉండగా మహారాష్ట్రలోని మున్సిపల్ కార్పొరేషన్ల రెవెన్యూ రాబడి ఆ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 2.12 శాతం ఉందని తెలిపింది. దేశంలోని వివిధ రాష్ట్రాల మున్సిపల్ కార్పొరేషన్ల మొత్తం రెవెన్యూ రాబడులు, అందులో కార్పొరేషన్ల సొంత రాబడులు, వ్యయాలకు సంబంధించి ఆర్‌బీఐ అధ్యయనం చేసి నివేదిక విడుదల చేసింది. ఇందులో పేర్కొన్న ముఖ్యాంశాలు ఏమిటంటే..

- పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా పట్టణ ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడానికి కార్పొరేషన్లు సొంత రాబడులను పెంచుకోవడంతో పాటు వివిధ మార్గాల్లో నిధులను సమీకరించుకోవాలి.
- దేశంలోని మున్సిపల్ కార్పొరేషన్ల సగటు ఆదాయాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో చాలా తక్కువ రాబడి ఉంది.
- దేశ జీడీపీలో కార్పొరేషన్ల సగటు రాబడి 0.72 శాతం ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో అది రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 0.38 శాతమే ఉంది.
- మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్ రాష్ట్రాల్లో మున్సిపల్ కార్పొరేషన్ల మొత్తం రెవెన్యూ రాబడులు, సొంత రెవెన్యూ రాబడులు అత్యధికంగా ఉండగా మిగతా రాష్ట్రాల్లోని మున్సిపల్ కార్పొరేషన్ల మొత్తం రెవెన్యూ రాబడులు, సొంత రెవెన్యూ రాబడులు అత్యంత తక్కువగా ఉన్నాయి.
- ఆంధ్రప్రదేశ్‌లో 2018–19 ఆర్థిక ఏడాదిలో మున్సిపల్‌కార్పొరేషన్ల రెవెన్యూ రాబడులు ఎంత ఉన్నాయో 2019–20 ఆర్థిక ఏడాదిలో కూడా అంతే ఉన్నాయి.
- ఏపీలో మున్సిపల్ కార్పొరేషన్ల సొంత రెవెన్యూ రాబడులు 2018–19 ఆర్థిక ఏడాదిలో రూ.2,906.83 కోట్లు ఉండగా.. రెవెన్యూ వ్యయం రూ.2,692.52 కోట్లు ఉంది.
- అదే 2019–20లో ఏపీలో మున్సిపల్ కార్పొరేషన్ల సొంత రెవెన్యూ రాబడులు రూ.2,906.83 కోట్లు ఉండగా రెవెన్యూ వ్యయం రూ.2,954.08 కోట్లు ఉంది.
- అలాగే, ఏపీలో మున్సిపల్ కార్పొరేషన్ల ఉద్యోగుల వేతనాలు, భత్యాలు, పెన్షన్ల వ్యయం 2018–19లో రూ.822.49 కోట్లు కాగా.. 2019–20లో రూ.878.83 కోట్లకు పెరిగింది.
- ఏపీలో మున్సిపల్ కార్పొరేషన్ల ఆపరేషన్, నిర్వహణ వ్యయం 2018–19లో రూ.1,143.86 కోట్లు వ్యయం కాగా.. 2019–20లో రూ.1,254.16 కోట్లు.
- ఏపీలో మున్సిపల్ కార్పొరేషన్లలో అడ్మినిస్ట్రేటివ్ వ్యయం 2018–19లో రూ.238.59 కోట్లు కాగా.. 2019–20లో రూ.247.75 కోట్లకు పెరిగింది.
- ఏపీలో మున్సిపల్ కార్పొరేషన్లలో మూలధన వ్యయం 2018–19లో రూ.4,419.12 కోట్లు ఉండగా ఇది జీఎస్‌డీపీలో 0.51 శాతంగా ఉంది.
- 2019–20లో మూలధన వ్యయం రూ.5,788.75 కోట్లు ఉండగా ఇది జీఎస్‌డీపీలో 0.60 శాతంగా ఉంది.

2019-20లో దేశంలోని పలు రాష్ట్రాల్లోని మున్సిపల్ కార్పొరేషన్ల మొత్తం రెవెన్యూ రాబడులు ఇలా.. (రూ.కోట్లలో)

రాష్ట్రం	రెవెన్యూ రాబడి	జీఎస్‌డీపీ శాతం
మహారాష్ట్ర	57,863.25	2.12
ఢిల్లీ	21,801.72	2.75
గుజరాత్	11,570.04	0.72
తమిళనాడు	6,791.89	0.38
తెలంగాణ	4,203.24	0.44
ఆంధ్రప్రదేశ్	3,672.70	0.38

2019-20లో ఆయా రాష్ట్రాల్లోని కార్పొరేషన్ల సొంత రెవెన్యూ రాబడి, రెవెన్యూ వ్యయం.. (రూ.కోట్లలో)

రాష్ట్రం	రాబడి	వ్యయం
మహారాష్ట్ర	42,524.11	39,310.60
ఢిల్లీ	14,641.55	21,464.66
గుజరాత్	7,505.47	9,934.08
తమిళనాడు	4,539.82	7,672.00
తెలంగాణ	3,138.71	3,155.03
ఆంధ్రప్రదేశ్	2,906.83	2,954.08

రూ.1,400 కోట్లతో 'పశ్చిమ'కు తాగునీరు

- 21న పథకానికి సీఎం జగన్ శంకుస్థాపన
- ఆక్వా కాలుష్యం, ఉప్పు నీటి సమస్యతో ఎద్దడి
- 10 నియోజక వర్గాలలో 26 మండలాలకు ఊరట
- గోదావరి నుంచి ఏటా 1.374 టీఎంసీల వినియోగం
- తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో వాటర్ గ్రిడ్ అమలు
- ఉద్దానం, పులివెందుల, డోన్‌లో ఇప్పటికే మొదలైన పనులు
- మరో ఐదు జిల్లాలకు టెండర్లు పూర్తి..



సాక్షి, అమరావతి: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆక్వా కల్చర్‌తో ఏర్పడిన నీటి కాలుష్యంతో పాటు తీర ప్రాంతంలో ఉప్పునీటి సాంద్రత కారణంగా నెలకొన్న తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించేందుకు వాటర్ గ్రిడ్ పథకంలో భాగంగా రూ.1,400 కోట్లతో సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ప్రభుత్వం చేపడుతోంది. ఇందుకు సంబంధించిన పనులకు సీఎం వైఎస్ జగన్ ఈ నెల 21న శంకుస్థాపన చేయనున్నారు. నిడదవోలు, తణుకు, ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం, ఉండి, ఉంగుటూరు, దెందులూరు (కొంత భాగం), తాడేపల్లిగూడెం (కొంత భాగం) పరిధిలోని 26 మండలాల ప్రజలకు పథకం ద్వారా ఏడాది పొడవునా తాగునీటిని సరఫరా చేసే అవకాశం ఉంటుంది. మొత్తం 1,178 గ్రామీణ నివాసిత ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ మంచినీటి కొళాయిని ఏర్పాటు చేసి రోజూ సగటున ప్రతి వ్యక్తికి 55 లీటర్ల సురక్షిత తాగునీటి సరఫరా చేస్తామని గ్రామీణ నీటి సరఫరా శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు వెల్లడించారు.

సమీపంలోని నదుల నుంచి..

గ్రామీణ ప్రాంతాల్లో చాలా చోట్ల ఇప్పటికే రక్షిత మంచినీటి పథకాలున్నా సరఫరా చేయడానికి నీరు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. వాటర్ గ్రిడ్ ద్వారా ఏడాది పొడవునా తాగునీటి సరఫరా జరిగేలా సమీప నదులతో ప్రత్యేక పైపులైన్ల ద్వారా అనుసంధానిస్తున్నారు. సీఎం ప్రారంభించనున్న రూ.1,400 కోట్ల తాగునీటి పథకానికి కూడా గోదావరి నుంచి ఏటా 1.374 టీఎంసీల నీటిని వినియోగిస్తారు. 30 నెలల వ్యవధిలో దీన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

రూ.10,131 కోట్ల పనులు..

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి వాటర్ గ్రిడ్ ద్వారా తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో రూ.10,131 కోట్లతో సమగ్ర రక్షిత మంచినీటి పథకాలను ప్రభుత్వం చేపట్టింది. దశాబ్దాలుగా కిడ్నీ సమస్యలతో బాధ పడుతున్న శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం ప్రాంతంలో రూ.700 కోట్లతో సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని అధికారంలోకి రాగానే సీఎం జగన్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పనులు 80 శాతం పూర్తయినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెల్లడించారు. వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలో రూ.480 కోట్లతో చేపట్టిన వాటర్ గ్రిడ్ పనులు ఇప్పటికే 34 శాతానికిపైగా జరిగాయి. కర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గ పరిధిలో రూ.279 కోట్లతో చేపట్టిన వాటర్ గ్రిడ్ పనులు 25 శాతానికి పైగా పూర్తయ్యాయి.

మిగతా చోట్ల త్వరలోనే ప్రారంభం..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రూ.1,650 కోట్లతో, ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంలో రూ.1,290 కోట్లతో, ఉమ్మడి గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతంలో రూ. 1,200 కోట్లతోనూ, ఉమ్మడి కృష్ణా జిల్లా సముద్ర తీర ప్రాంతంలో రూ.750 కోట్లతో, ఉమ్మడి చిత్తూరు జిల్లా పశ్చిమ ప్రాంతంలో రూ.2,370 కోట్లతో వాటర్ గ్రిడ్ ద్వారా శాశ్వత రక్షిత మంచినీటి పథకాలకు ప్రభుత్వం ఇప్పటికే టెండర్లు ప్రక్రియ పూర్తి చేసింది. ఈ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెల్లడించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో ఏపీ ముందంజ

- సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ అద్భుతం
- డీబీటీతో ప్రజలకు ఆర్థిక లబ్ధి, జీవన ప్రమాణాలు మెరుగు
- ఐఐపీఏ డైరెక్టర్ జనరల్ సురేంద్రనాథ్ త్రిపాఠి



అధికారులతో మాట్లాడుతున్న ఐఐపీఏ డైరెక్టర్ జనరల్ సురేంద్రనాథ్ త్రిపాఠి, జేసీ కేఎస్ విశ్వనాథన్

సాక్షి, విశాఖపట్నం: మిగిలిన రాష్ట్రాలతో పోల్చిచూస్తే కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ ముందు వరసలో ఉందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపీఏ) డైరెక్టర్ జనరల్ సురేంద్రనాథ్ త్రిపాఠి స్పష్టం చేశారు. అడ్వాన్స్‌డ్ ప్రొఫెషనల్ ప్రోగ్రాం ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఏపీపీపీఏ) 48వ విజిట్‌లో భాగంగా 38 మంది సభ్యుల ఐఐపీఏ బృందం రెండో రోజు విశాఖలో పర్యటించింది. ఇందులో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, సంబంధిత శాఖల అధికారులతో సురేంద్రనాథ్ త్రిపాఠి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను అందరి కంటే ఎక్కువగా ఏపీ సద్వినియోగం చేసుకుంటున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ, గ్రామ, వార్డు వలంటీర్లు ద్వారా గ్రామస్థాయిలో పనితీరు అద్భుతంగా ఉందని ప్రశంసించారు. రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల సేవలు సరికొత్త సేవా విప్లవానికి నాంది పలికినట్లుగా ఉన్నాయన్నారు. స్వయం సహాయక బృందాలు, అంగన్‌వాడీ వ్యవస్థలు బాగా పనిచేస్తున్నాయని కితాబిచ్చారు. డీబీటీ ద్వారా ప్రజలకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చడం వల్ల.. ఏపీ ప్రజల జీవన స్థితిగతులు, ప్రమాణాలు మెరుగుపడేందుకు ఎంతగానో దోహదపడుతున్నాయని తమ క్షేత్ర స్థాయి పర్యటనలో వెల్లడైందని డీజీ త్రిపాఠి వివరించారు. స్వచ్ఛత విషయంలో విశాఖ నగరం ఎంతో అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ప్రోగ్రామ్ డైరెక్టర్ డా.వీఎన్ అలోక్, ఐఐపీఏ అడిషనల్ డైరెక్టర్ కుసుమ్‌లతతో పాటు త్రివిధ దళ ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సకల వసతులు



సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

మూడు దశల్లో పనులు

- మూడు దశల్లో హాస్టళ్ల ఆధునీకరణ పూర్తి చేయాలి. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు, హాస్టళ్లు అన్నీ కలిపి మొత్తంగా 3,013 చోట్ల రూ. 3,364 కోట్లతో నాడు–నేడు పనులు చేపట్టాలి. మొదటి దశలో మొత్తం సుమారు 1,366 చోట్ల పనులు చేపట్టాలి. దశాబ్దాలుగా వెనకబాటుకు గురైన కర్నూలు పశ్చిమ ప్రాంతంలోని హాస్టళ్లన్నింటినీ తొలి విడతలోనే బాగు చేయాలి. తొలి విడత పనులు జనవరి నుంచి ప్రారంభించి, ఏడాదిలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.
- హాస్టళ్లలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పాటు, కిచెన్లను కూడా ఆధునీకరించే పనులు చేపట్టాలి. కిచెన్‌కు అవసరమైన దాదాపు 10 రకాల వస్తువులను కొనుగోలు చేయాలి. హాస్టళ్ల పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు స్పష్టంగా కన్పించాలి. పిల్లలకు ఇవ్వాల్సిన వస్తువులను సకాలంలో నాణ్యమైన వాటిని అందించాలి. హాస్టళ్ల పర్యవేక్షణ పద్ధతిని సమూలంగా మార్చాలి. మండలాల వారీగా పర్యవేక్షణ ఉండాలి.

అంగన్‌వాడీల్లో ఫ్లేవర్డ్ మిల్క్

- అంగన్‌వాడీలలో సూపర్‌వైజర్ల పోస్టులను భర్తీ చేసినట్టు అధికారులు సీఎం జగన్‌కు తెలిపారు. గత సమీక్షలో సీఎం ఇచ్చిన ఆదేశాల అమలు ప్రగతిని వివరించారు. అంగన్‌వాడీలలో పాల సరఫరాపై నిరంతర పర్యవేక్షణతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు.
- అక్టోబర్‌లో నూరు శాతం పాల సరఫరా జరిగింది. డిసెంబర్ 1 నుంచి ఫ్లేవర్డ్ మిల్క్‌ను అంగన్‌వాడీల్లో సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నాం' అని వివరించారు.
- మూడు నెలల్లోగా రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్లేవర్డ్ మిల్క్‌ను సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉష శ్రీచరణ్, సీఎస్ సమీర్ శర్మ, బీసీ సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులు జి.జయలక్ష్మి, ముద్దాడ రవి చంద్ర, ఆర్థిక శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, ఏపీ డీడీసీఎఫ్ ఎండీ ఎ.బాబు, మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ, మైనారిటీ వెల్ఫేర్ డైరెక్టర్లు ఎ.సిరి, జాహ్నవి, జీసీ కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

వెల్ఫేర్ అధికారులు, కేర్ టేకర్ల పోస్టులు భర్తీ చేయండి

- హాస్టళ్లలో ఉండాల్సిన సిబ్బంది కచ్చితంగా ఉండాలి. ఖాళీగా ఉన్న 759 మంది సంక్షేమ అధికారులు, 80 మంది కేర్ టేకర్ల పోస్టులను భర్తీ చేయాలి. గిరిజన సంక్షేమ గురుకులాల్లో 171 మంది హాస్టల్ వెల్ఫేర్ అధికారుల నియామకానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో క్లాస్-4 ఉద్యోగుల నియామకంపై దృష్టి పెట్టాలి. ప్రతి హాస్టల్‌ను పరిశీలించి, కల్పించాల్సిన సౌకర్యాలు, ఉండాల్సిన సిబ్బంది తదితర అంశాలపై ముందుగా సమాచారాన్ని తెప్పించుకోవాలి.
- హాస్టళ్ల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయడానికి ప్రతి హాస్టల్లో ఒక నంబర్ ఉంచాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా ఫిర్యాదులు స్వీకరించడానికి ఒక నంబర్ ఉంచాలి. అంగన్‌వాడీలలో నాడు–నేడు పనులు, అనంతర నిర్వహణపై సమగ్ర కార్యాచరణ ఉండాలి. టాయిలెట్ల నిర్వహణ, పరిశుభ్రతకు పెద్దపీట వేయాలి. ఇందుకోసం సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలి.

దూసుకెళ్లిన ప్రైవేట్ రాకెట్



రాకెట్ నమూనాతో కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ తదితరులు

సూళ్లూరుపేట/న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. మొట్టమొదటి ప్రైవేటు రాకెట్.. ప్రారంభ్ (విక్రమ్–ఎస్)ను శుక్రవారం ఉదయం 11.30 గంటలకు విజయవంతంగా నింగిలోకి ప్రయోగించింది. ఇప్పటిదాకా ప్రైవేటు ఉపగ్రహాలను మాత్రమే ఇస్రో ప్రయోగిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తొలిసారి ప్రైవేటు రాకెట్‌ను సైతం ప్రయోగించి రికార్డు సృష్టించింది. ఇందుకు కేవలం 4.50 నిమిషాల సమయం మాత్రమే తీసుకుంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) ప్రయోగానికి వేదికగా నిలిచింది. ప్రారంభ్ (విక్రమ్–ఎస్)ను హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ రూపొందించింది. స్టార్టప్ కంపెనీలు.. స్పేస్ కిడ్ ఇండియా, ఎన్ స్పేస్‌టెక్, అర్మేనియా బజూమ్ క్యూ స్పేస్ రీసెర్చ్ ల్యాబ్‌కు చెందిన మూడు పేలోడ్‌లను ఈ బుల్లి రాకెట్ అంతరిక్షంలోకి మోసుకెళ్లింది. భవిష్యత్తులో ఉపగ్రహాలను ప్రయోగించేందుకు.. వాతావరణ అధ్యయనం కోసం ఈ పేలోడ్లను ప్రయోగించారు. భూమి నుంచి సుమారు 89.5 కిలోమీటర్ల ఎత్తులో సబ్–ఆర్బిటల్‌లోకి విజయవంతంగా వెళ్లిన రాకెట్ తిరిగి శ్రీహరికోట సముద్రతీరానికి 135 కిలోమీటర్ల దూరంలో సముద్రంలో పడిపోయింది. అయితే రాకెట్ పైకి వెళ్లిన సమయంలో అందులో ఉన్న పేలోడ్స్ వాతావరణంలో ఉన్న తేమ ఇతర వివరాల సమాచారాన్ని అందించాయి.

ఇదొక చారిత్రక ఘట్టం: ప్రధాని మోదీ

ప్రయోగం విజయవంతంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇదొక చారిత్రక ఘట్టమని అభివర్ణించారు. అంతరిక్ష రంగ సంస్కరణలను సద్వినియోగం చేసుకున్న మన యువత అపార ప్రతిభకు ఇది నిదర్శనమని కొనియాడారు.

- ప్రయోగ సమయంలో రాకెట్ బరువు: 545 కిలోలు
- రాకెట్ పొడవు: 6 మీటర్లు
- రాకెట్ వెడల్పు: 0.375 మీటర్లు
- భూమి నుంచి ఎత్తు: 89.5 కిలోమీటర్లు
- రాకెట్ ప్రయోగం పూర్తి చేసిన సమయం: 4.50 నిమిషాలు

'స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన రాకెట్ విక్రమ్–ఎస్‌ను శ్రీహరికోట నుంచి అంతరిక్షంలోకి ప్రయోగించడం చారిత్రక ఘట్టం. ప్రైవేట్ రంగంలో దేశ అంతరిక్ష పరిశ్రమ ప్రయాణంలో ఇదొక కీలక మైలురాయి. ఈ ఘనతను చేరుకున్నందుకు ఇస్రో, ఇన్‌స్పేస్ ఇండ్‌కు అభినందనలు' అని ప్రధాని ట్వీట్ చేశారు. కాగా విక్రమ్–ఎస్ రాకెట్ ప్రయోగాన్ని వీక్షించడానికి కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ శ్రీహరికోట విచ్చేశారు. ప్రయోగం విజయవంతమైన తర్వాత ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థలకు భాగస్వామ్యం కల్పిస్తున్నారని కొనియాడారు. స్టార్టప్ కంపెనీలకు ఈ ప్రయోగం గొప్ప మైలురాయి అని ప్రశంసించారు. స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులు పవన్ కుమార్ చందన, నాగభరత్ డాకాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, ఇన్‌స్పేస్ ఇండ్ చైర్మన్ డాక్టర్ పవన్‌కుమార్ గోయెంకా తదితరులు పాల్గొన్నారు.

తెలీదు.. గుర్తు లేదు

- సీఐడీ విచారణలో ఇదే 'నారాయణ' మంత్రం
- ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణంపై దాటవేత వైఖరి
- హైదరాబాద్‌లోని ఆయన ఇంటి వద్ద విచారణ



హైదరాబాద్‌లో నారాయణ ఉంటున్న అపార్ట్‌మెంట్

సాక్షి, అమరావతి/హైదరాబాద్: టీడీపీ హయాంలో అమరావతిలో భూ కుంభకోణాల కేసులో మాజీ మంత్రి, టీడీపీ నేత పి.నారాయణను సీఐడీ అధికారులు హైదరాబాద్‌లో శుక్రవారం విచారించారు. అమరావతిలో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారులో టీడీపీ ప్రభుత్వ పెద్దలు భారీ కుంభకోణానికి పాల్పడ్డారని సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏ–1గా చంద్రబాబు, ఏ–2గా నారాయణలతో పాటు మొత్తం 14 మందిపై కొన్ని నెలల క్రితం సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో నారాయణను ఆయన నివాసంలో విచారించేలా న్యాయస్థానం ఇటీవల అనుమతిచ్చింది. దాంతో సీఐడీ అధికారుల బృందం హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఓ గేటెడ్ కమ్యూనిటీలోని ఆయన నివాసంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారించింది. కాగా, సీఐడీ విచారణకు నారాయణ ఏమాత్రం సహకరించలేదని సమాచారం. సీఐడీ అధికారులు ఏం అడిగినా 'తెలియదు.. గుర్తు లేదు' అంటూ సమాధానం దాటవేసేందుకు యత్నించారని తెలిసింది. ఈ కేసులో నారాయణను మరికొన్నిసార్లు విచారించాలని సీఐడీ భావిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఈ కేసులో నారాయణకు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని సీఐడీ అధికారులు దాఖలు చేసిన పిటీషన్ న్యాయస్థానంలో విచారణలో ఉంది.

ఇటూ అటూ బాబు బినామీలే

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రాజధాని అమరావతిలో టీడీపీ పెద్దలు యథేచ్ఛగా సాగించిన భూ దోపిడీలో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కూడా ప్రధానమైంది. అప్పటి సీఎం చంద్రబాబు, పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ.. అమరావతి మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ డిజైన్ల ముసుగులో భారీగా భూ దోపిడీకి పాల్పడ్డారన్నది సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. ఇన్నర్ రింగ్ రోడ్డు డిజైన్‌ను ముందుగానే మాస్టర్ ప్లాన్‌లో చేర్చిన విషయాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం గోప్యంగా ఉంచింది. ఆ రోడ్డు అలైన్‌మెంట్‌ను డిజైన్ చేసేందుకు ఎస్టీయూపీ అనే కన్సల్టెన్సీని నియమించినట్టు కథ నడిపించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు ఎలా నిర్మించనున్నారో ముందుగానే తెలిసిన చంద్రబాబు, నారాయణలు తమ కుటుంబ సంస్థలు హెరిటేజ్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లతోపాటు తమ బినామీ లింగమనేని రమేష్ సంస్థల పేరిట భారీగా భూములు కొన్నారు. ముందుగానే ఖరారు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్డు డ్రాఫ్ట్ ప్లాన్‌ను చంద్రబాబు నేతృత్వంలో నిర్వహించిన సమీక్షలో ఆమోదించారు. ప్రభుత్వ రహస్యాలను కాపాడుతామని చేసిన పదవీ స్వీకార ప్రమాణానికి విరుద్ధంగా వ్యవహరించి, వారి బినామీలకు అక్రమంగా భారీ ప్రయోజనం కలిగించారు. దాంతో సామాన్యులు తీవ్రంగా నష్టపోయారు. సీఐడీ అధికారులు మంగళగిరి, పెదకాకాని, తాడికొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లను పరిశీలించగా ఈ విషయం స్పష్టమైంది. సీఆర్‌డీఏ ఫైళ్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ల వివరాలు, ఇతర ఆధారాలను సీఐడీ విభాగం సేకరించి కేసు నమోదు చేసింది.

దక్షిణ కోస్తా వైపు వాయుగుండం!

- రేపటి నుంచి దక్షిణ కోస్తా, సీమలకు వానలు
- అక్కడక్కడ భారీ వర్షాలకు అవకాశం
- తీరం వెంబడి ఈదురుగాలులు



సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతం, దాని పరిసరాల్లో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. ఈ అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ రానున్న 24 గంటల్లో దక్షిణ బంగాళాఖాతంలోని మధ్య ప్రాంతంలో వాయుగుండంగా బలపడనుంది. అనంతరం అది అదే దిశలో 3 రోజులు ఉత్తర తమిళనాడు–పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్రల వైపు పయనిస్తుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శుక్రవారం తెలిపింది. దీని ప్రభావంతో ఈ నెల 20 నుంచి 22 వరకు దక్షిణ కోస్తా, రాయలసీమల్లో కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, 21, 22 తేదీల్లో అక్కడక్కడ భారీ వర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొంది. అదే సమయంలో తీరం వెంబడి గంటకు 40–45, గరిష్టంగా 55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లవద్దని సూచించింది. రానున్న రెండు రోజులు ఉత్తర కోస్తాలో వాతావరణం పొడిగా ఉంటుందని పేర్కొంది.

బాలుర వసతి గృహంలో లైబ్రరీ ప్రారంభం



లైబ్రరీని ప్రారంభిస్తున్న మంత్రి మేరుగ

ఆరిలోవ (విశాఖ తూర్పు): రూరల్ మండల కార్యాలయం సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో రమాభాయి అంబేడ్కర్ వెల్ఫేర్ ట్రస్ట్ ఏర్పాటుచేసిన గ్రంథాలయం, వాటర్ ఫిల్టర్‌ను సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జున శుక్రవారం ప్రారంభించారు. మంత్రి ఇక్కడి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం.. హాస్టల్‌లో కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న భోజనం, వసతి తదితర వాటి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల, 9వ వార్డు కార్పొరేటర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి బాబా జయంత్యుత్సవాలు ప్రారంభం

- భారీగా హాజరైన భక్తులు
- కనులపండువగా వేణుగోపాలస్వామి రథోత్సవం



వేణుగోపాలస్వామి రథోత్సవంలో భక్తులు

సాక్షి, పుట్టపర్తి: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 97వ జయంత్యుత్సవాలు పుట్టపర్తిలో శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8.20గంటలకు నిర్వహించిన వేణుగోపాలస్వామి రథోత్సవం కనులపండువగా సాగింది. పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ సత్యసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు ఆధ్వర్యంలో అన్నదానం, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శ్రీసత్యసాయి పేరు మీదుగా పుట్టపర్తి కేంద్రంగా జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారి జరుగుతున్న వేడుకలు కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. శ్రీ సత్యసాయి బాబా జయంతి ఉత్సవాల్లో ఈ నెల 23న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొంటారని ఆర్‌జే రత్నాకర్‌రాజు తెలిపారు.

పచ్చపత్రిక కథనాలపై ఆగ్రహం

రథోత్సవం అనంతరం ఆర్‌జే రత్నాకర్ మీడియాతో మాట్లాడుతూ ఓ పచ్చపత్రికలో రెండు రోజుల కిందట ప్రచురితమైన 'అయ్యో.. బాబా' కథనంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సుమారు పాతికేళ్లుగా పోరాటం చేసినా.. జిల్లా సాధించుకోలేకపోయామని, కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత అడిగిన వెంటనే పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ప్రకటించారని ప్రశంసించారు. ప్రభుత్వ కార్యాలయాల కోసం ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారమే భవనాలు ఇచ్చామని, అంతేకానీ శాశ్వతంగా కాదని స్పష్టం చేశారు. దీనిపై ఎల్లో మీడియా పూర్తి అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. కనీస అవగాహన లేకుండా పచ్చపత్రిక కథనాలు రాయడం సమంజసం కాదన్నారు. ఆధ్యాత్మిక కేంద్రానికి రాజకీయం అంటకట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

డిసెంబర్ 4న శాప్ చెస్ లీగ్ పోటీలు

- రిజిస్ట్రేషన్‌లకు 2వ తేదీ వరకు గడువు

సాక్షి, అమరావతి: ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) తొలిసారిగా చెస్ లీగ్ టోర్నీకి శ్రీకారం చుట్టింది. అండర్ 7, 9, 11, 13, 15 బాలబాలికల విభాగాల్లో డిసెంబర్ 4న పోటీలను నిర్వహించనుంది. శ్రీకాకుళం, విజయనగరం, కాకినాడ, విజయవాడ, నంద్యాల, నెల్లూరు, తిరుపతి డీఎస్‌ఏ స్టేడియాల్లో వేదికలు ఖరారు చేసింది. క్రీడాకారులు డిసెంబర్ 2లోగా apchess.org (or) SAAP websiteలో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి. తొలి 3 స్థానాల్లో నిలిచిన వారికి శాప్ బహుమతులను అందజేయనుంది. ఆంధ్రా చెస్ అసోసియేషన్‌తో కలిసి నిర్వహిస్తోన్న ఈ టోర్నీలో ప్రభుత్వ పాఠశాలల క్రీడాకారులకు రూ.100, ఇతరులకు రూ.200 ఎంట్రీ ఫీజుగా నిర్ణయించింది. ఆంధ్రా చెస్ అసోసియేషన్‌లో నమోదై 1,500 ర్యాంకింగ్ లోపు ఉన్న వారు పోటీలకు అర్హులు. ఎంపిక చేసిన ప్రదేశాల్లో క్రీడాకారులు ఎక్కడి నుంచి అయినా పోటీల్లో పాల్గొనవచ్చు. ఈ లీగ్ ప్రదర్శన ఆధారంగా ఆయా ప్రాంతాల నుంచి 10 మంది క్రీడాకారులను (బాలబాలికలు) శాప్ కోచింగ్ క్యాంప్‌నకు ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ అందించనుంది. శాప్ లీగ్ టోర్నీల కోసం ప్రత్యేక స్పోర్ట్స్ క్యాలెండర్‌ను రూపొందించింది. లీగ్‌లో పాల్గొనే క్రీడాకారులు తమ వివరాలను శాప్ రూపొందించిన గూగుల్ ప్లే స్టోర్‌యాప్‌లో నమోదు చేసుకోవాలి.

మాప్-అప్ రౌండ్ కౌన్సెలింగ్‌కు ఆప్షన్‌ల నమోదు ప్రారంభం

- నేటి సాయంత్రం ఆరు గంటల వరకు అవకాశం

సాక్షి, అమరావతి: పీజీ మెడికల్, డెంటల్ కోర్సుల్లో 2022-23 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ వైద్య కళాశాలల్లో యాజమాన్య కోటా సీట్ల భర్తీలో భాగంగా మాప్-అప్ రౌండ్ కౌన్సెలింగ్‌కు వెబ్ ఆప్షన్‌ల నమోదు కోసం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో శుక్రవారం సాయంత్రం ఆరు నుంచి శనివారం సాయంత్రం ఆరు గంటల వరకు ఆప్షన్‌ల నమోదుకు అవకాశం కల్పించింది. గతంలో యాజమాన్య కోటా, కన్వీనర్ కోటా సీట్ల భర్తీ కోసం నిర్వహించిన కౌన్సెలింగ్‌లలో సీట్లు కేటాయించిన, సీట్లు కేటాయించినా జాయిన్ కాని విద్యార్థులు మాప్-అప్ రౌండ్ కౌన్సెలింగ్‌కు అనర్హులు. ఈ కౌన్సెలింగ్‌లో సీటు పొందిన విద్యార్థులు తప్పనిసరిగా కళాశాలల్లో చేరాల్సిందేనని, అడ్మిషన్ విత్‌డ్రా చేయడానికి వీలు లేదని యూనివర్సిటీ స్పష్టంచేసింది.

పిల్లల్లో అభ్యసన నైపుణ్యాలు పెంపొందించాలి

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్



కరదీపికలు ఆవిష్కరిస్తున్న సురేష్‌కుమార్

సాక్షి,అమరావతి/పటమట (విజయవాడ తూర్పు): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల విద్యార్థుల్లో అభ్య సన నైపుణ్యాలను పెంపొందించడానికి లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (లిప్) నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్షా పథక సంచాలకుడు ఎస్. సురేష్ కుమార్ తెలిపారు. లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (లిప్)పై శుక్రవారం విజయవాడలోని సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా, యూనిసెఫ్, సీఐపీఎస్, సేవ్ ది చిల్డ్రన్, గ్రామ, వార్డు సచివాలయ శాఖల ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ నిష్ణాతులతో రూపొందించిన తెలుగు, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల ఉపాధ్యాయ కరదీపికలను ఆయన ఆవిష్కరించారు. లిప్ ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో లక్ష్యాలను బట్టి మిగతా జిల్లాల్లో కూడా అమలు పరచాలని సురేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఎస్ఎస్‌ఏ సంచాలకులు బి.శ్రీనివాసరావు, ఏఎస్పీడీ కేవీ శ్రీనివాసులురెడ్డి, సీమ్యాట్ డైరెక్టర్ వీఎన్ మస్తానయ్య, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్ రెడ్డి, సిప్స్ డైరెక్టర్ సి.అచలేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి

శనివారం, నవంబర్, 19

‘డేటా పరిరక్షణ’కు కొత్త రూపు

ఇటు పౌరసమాజ కార్యకర్తలనూ, అటు దిగ్గజ సైబర్ సంస్థలనూ సమానంగా వణికించిన పాత డేటా పరిరక్షణ ముసాయిదా బిల్లు స్థానంలో సరికొత్త ముసాయిదా బిల్లు శుక్రవారం వెలువడింది. పాత బిల్లు ఉపసంహరించుకున్న మూణ్ణెల్లలోపులో దీన్ని తీసుకురావడాన్నిబట్టి డేటా పరిరక్షణ బిల్లు విషయంలో కేంద్రం ఎంత పట్టుదలగా ఉన్నదో వెల్లడవుతోంది. 2019లో రూపొంది పార్లమెంటులో ప్రవేశించిన ముసాయిదా బిల్లుపై అన్నివైపులా తీవ్ర విమర్శలు చెలరేగటంతో దాన్ని ఉపసంహరించక తప్పలేదు. సైబర్ ప్రపంచంలో అడుగడుగునా ప్రమాదాలు పొంచివుంటున్నాయి. పౌరుల వ్యక్తిగత గోప్యత ప్రశ్నార్థకమవుతున్నది. లక్షల కోట్లకు పడగెత్తిన మెటా (ఫేస్‌బుక్), ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్, గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు మొదలుకొని సాధారణ వ్యాపార, వాణిజ్య సంస్థల వరకూ పౌరుల డేటాతో ఆటలాడుకుంటున్నాయి. వారి వ్యక్తిగత గోప్యతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. వీటి దూకుడుకు కళ్లెం వేసేలా ఇప్పటికే చాలా దేశాలు పకడ్బందీ చట్టాలు చేశాయి. ఆ చట్టాలను ఉల్లంఘించిన పక్షంలో భారీ జరిమానాలు విధిస్తున్నాయి. కానీ మన దేశం మాత్రం పుష్కరకాలంగా తాత్సారం చేస్తోంది. చట్టం తెస్తామనటమే తప్ప దాని ఆచూకీ లేదు. అందుకోసం జస్టిస్ బీఎస్ శ్రీకృష్ణ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ 2018లోనే ఒక ముసాయిదా బిల్లును కేంద్రానికి సమర్పించింది. చివరకు మరో ఏడాది కాలం తర్వాత దాని ఆధారంగా కేంద్రం ఒక ముసాయిదా బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. అయితే తమ బిల్లుకూ, కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లుకూ పొంతనలేదని జస్టిస్ శ్రీకృష్ణ పెదవి విరిచారు. పార్లమెంటు లోపలా, వెలుపలా ఆ ముసాయిదాపై విస్తృతంగా చర్చ జరిగిన సందర్భంగా అందులో సమగ్రత గల్లంతయిందని అనేకులు విమర్శించారు. డేటా పరిరక్షణ నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే ఏ చర్యలు తీసుకోవాలో అందులో ప్రతిపాదించారు. కానీ దీన్నుంచి ప్రభుత్వం తనను తాను మినహాయించుకోవటం అన్ని వర్గాలనూ దిగ్భ్రాంతిపరిచింది. అలాగే ఇక్కడ సేకరించే డేటా సరిహద్దులు దాటిపోరాదన్న నిబంధన అందులో ఉంది. ఈ నిబంధన సరికాదని మెటా, ట్విటర్‌వంటివి విమర్శించాయి. చివరకు ఈ విషయంలో అమెరికా ప్రభుత్వం సైతం జోక్యం చేసుకుంది. ఏమైతేనేం...ఆ బిల్లును పార్లమెంటరీ స్థాయీ సంఘానికి పంపాలని కేంద్రం నిర్ణయించింది. ఆ సంఘం బిల్లుకు మొత్తం 81 సవరణలు సూచించింది. ఈ నేపథ్యంలో ఆ బిల్లు ఉపసంహరణే ఉత్తమమని ప్రభుత్వం భావించింది.

చాలా సైబర్ సంస్థలు, ఈ–కామర్స్, డిజిటల్ మార్కెటింగ్ సర్వీసు సంస్థలు వినియోగదారుల డేటాను ఇష్టానుసారం సేకరిస్తున్నాయి. వీటిల్లో చేరాలంటే చాలా వివరాలు సమర్పించుకోవాల్సి వుంటుంది. ఖాతా తెరవాలన్న తొందరలో అత్యధికులు వెనకాముందూ చూడకుండా అడిగిన వివరాలన్నీ అందజేస్తున్నారు. ఈ వ్యక్తిగత డేటాను సంస్థలు దుర్వినియోగం చేస్తున్నాయి. ఆ వివరాలు అసాంఘిక శక్తుల చేతుల్లోకి పోయి పౌరుల బ్యాంకు ఖాతాలు ఖాళీ కావటం, వారి వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు అవాంఛనీయ వ్యక్తుల చేతుల్లో పడటం రివాజైంది. ఇలాంటివి చోటుచేసుకున్నప్పుడు ఆ మాధ్యమాలు తమకు సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నాయి. పకడ్బందీ రక్షణ వ్యవస్థ లేనప్పుడు డేటా సేకరణ ఎందుకు చేస్తున్నారన్న ప్రశ్నకు జవాబు లేదు. ఆ సంగతలా ఉంచి పౌరుల డేటాను ప్రభుత్వం అడిగినప్పుడు ఏం చేయాలన్న ప్రశ్న ఉండనే ఉంది. పాత ముసాయిదాలో భద్రతా సంస్థలకు పూర్తిస్థాయి మినహాయింపునీయటం విమర్శలకు తావిచ్చింది. ప్రస్తుత ముసాయిదాలో సైతం అదే కొనసాగింది. జాతీయ భద్రత కీలకం గనుక అవాంఛనీయ శక్తుల కదలికపై నిఘా వేయటం, వారి కార్యకలాపాలను కనిపెట్టి ఉండటం అవసరం కావొచ్చు. కానీ ఆ మాటున నికార్సయిన అసమ్మతిని అణచాలని చూడటం, ఆ కృషిలో నిమగ్నమయ్యే వ్యక్తులనూ, సంస్థలనూ వేధించటం సరైంది కాదు. ప్రభుత్వాల విధానాలూ, చర్యలూ సరిగాలేవని భావించిన వారు శాంతియుత పద్ధతుల్లో నిరసించటం ప్రజాస్వామిక హక్కు. దీనికి భంగంవాటిల్లని రీతిలో భద్రతా సంస్థలు మెలిగితే ఎవరూ అభ్యంతరపెట్టరు. అందుకు భిన్నంగా వ్యవహరించినప్పుడే సమస్య తలెత్తుతుంది. ఏ అధికారైనా హద్దుమీరిన పక్షంలో ఎలాంటి చర్యలుంటాయో చెప్పాలి.

తాజా ముసాయిదాలో డేటా పరిరక్షణ బోర్డు ఏర్పాటు ప్రతిపాదన భేషైనది. పౌరుల వ్యక్తిగత డేటాను పరిరక్షించటంలో విఫలమైన సంస్థలపై రూ. 250 కోట్ల వరకూ జరిమానా విధించే అధికారం ఈ బోర్డుకుంది. అలాగే డేటా లీకయిందని తెలిసిన వెంటనే ఖాతాదార్లకు ఆ సంగతి చెప్పకపోతే రూ. 200 కోట్లవరకూ జరిమానా విధించొచ్చు. ఉద్దేశించిన ప్రయోజనం నెరవేరాక సేకరించిన డేటాను సంస్థలు పూర్తిగా తొలగించాలన్న నిబంధన, వినియోగదారులు తమ డేటా తొలగించాలని కోరినా, సవరించాలని కోరినా సంస్థలు అంగీకరించాలన్న నిబంధన మంచిదే. తమ డేటా సేకరణ ప్రక్రియ చట్ట నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూసేందుకు సంస్థలు ఆడిటర్‌ను నియమించుకోవాలన్న నిబంధన కూడా మంచిదే. అయితే భారత్‌లో సేకరించిన డేటాను ఇక్కడి సర్వర్లలోనే భద్రపరచాలన్న అంశంలో ప్రభుత్వం రాజీపడింది. అందుకు బదులు ఏయే దేశాల్లో డేటా ఉంచవచ్చునో ప్రభుత్వమే నోటిఫై చేస్తుంది. తనకు అవసరమైనపక్షంలో డేటా తీసుకోవటం సాధ్యపడే దేశాల్లో సర్వర్లు ఉండొచ్చన్నది సర్కారు భావన. మొత్తానికి తాజా ముసాయిదాపై కూడా లోతైన చర్చ జరగాలి. అందుకు పౌరుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణే గీటురాయి కావాలి.

మంచీ చెడు మనలోనే

జ్యోతిర్మయం

మనలోనే రాముడున్నాడు. రావణుడూ మన లోనే ఉన్నాడు. మనలోని సహనం, శాంతం, సహృదయం, కరుణ, సాత్వికత వంటి మంచి గుణాలే రాముడికి ప్రతీకలు. అప్పుడప్పుడూ మనలో పైకి లేచే తామసం, అహం వంటివే రావణుడు. మనలో చెడు ఆలోచనలు, కోరి కలు ప్రజ్వరిల్లుతున్నప్పుడు గ్రహిస్తూ, వాటిని అణచివేస్తూ మంచి గుణాలు పెంపొం దించుకోవటమే ఎవరైనా చేయవలసిన పని. రావణునికి గొప్ప రాజనీతి ఉంది. మహా శివ భక్తుడు. రావణుడు చేసిన శివస్తుతిని మెచ్చుకుని శివుడు అతనికి ఎన్నో వరాలతో పాటు చంద్రహాసమనే ఖడ్గాన్ని ప్రసాదించాడు. రావణుని ధైర్యం నిరుపమానం. అతడు సీతాపహరణం అనే అధర్మానికి పూనుకోకపోతే అతని కీర్తిచంద్రికలు శాశ్వ తంగా నిలిచేవి. అపారమైన శాస్త్ర పరిజ్ఞానం, నైపుణ్యం రావణునికి ఉన్నాయి. ఎంత గొప్ప వ్యక్తి అయినా ధర్మాన్ని పాటించక పోతే మిగతావన్నీ వ్యర్థమే అనటానికి రావణుడు ఉదాహరణ. భగవంతుడిచ్చిన వరాలను, అవకాశాలను దుర్వినియోగం చేస్తే పతనం తప్పదు. ఒక మనిషిలో ఎన్నో మంచి గుణాలు పరోపకారం, నిజాయితీ వంటివి ఉన్నా, ముక్కోపం, తొందరపడి మాట జారటం, ఆత్మ ప్రశంస వంటివి ఉంటే అతనిని మనుషులకు దూరం చేస్తాయి. తను అందరికీ మంచి చేసినా శత్రువులే అవుతున్నారెందుకు అనే విషయాన్ని ఆత్మపరిశీలన చేసుకుంటే తనలోపాన్ని సరిదిద్దుకుని అందరికీ చేరువ కాగలడు. తనలోని దుష్ట లక్షణాలను పరిహా రించటానికి సత్సాంగత్యం అవసరం. తన లోని చెడుగును పరిహరించటమే కాక మనిషి సమాజ శ్రేయస్సుకూ దోహదం చేయాలి.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.దశమి ఉ.6.50 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** ఉత్తర రా.9.46 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.6.11 నుండి 7.40 వరకు, **అమృతఘడియలు:** ప.2.11 నుండి 3.54 వరకు; **రాహుకాలం :** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం :** ప.1.30 నుండి 3.00 వరకు; **సూర్యోదయం** 6.10 ; **సూర్యాస్తమయం** 5.21.

రైతుకు ‘మద్దతు’లో పోలిక ఉందా?

ధరలు పడిపోతే స్థిరీకరించడానికి రూ.3,000 కోట్లతో నిధి


- విత్తనాల విక్రయం నుంచి పంటల కొనుగోళ్ల దాకా అన్నీ ఆర్‌బీకేల ద్వారానే
- అక్కడే కొనుగోళ్లు... నేరుగా రైతుల ఖాతాల్లోకే నగదు జమ
- ఆఖరికి పాడి రైతులకూ మేలు జరగాలని అమూల్‌ను తెచ్చిన ప్రభుత్వం
- ‘జగనన్న పాల వెల్లువ’తో లీటరుకు రూ.20 వరకూ రైతుకు అదనపు ఆదాయం
- ఇన్ని చేస్తున్నా ప్రభుత్వ పనితీరులో రంధ్రాన్వేషణకే ప్రాధాన్యమిస్తున్న రామోజీ
- చంద్రబాబు గ్రాఫ్‌ను పెంచాలనే యావలో అసత్యాలకే పెద్దపీట

కట్టలు తెంచుకున్న కోపం చంద్రబాబు నాయుడి మాటల్లో కనిపిస్తే... అక్షరాలకందని ఆక్రోశం ‘ఈనాడు’ రాతల్లో!!. ఏమైంది వీళ్లకి? ప్రతిరోజూ వీళ్లు పడుతున్న తంటాలు తెలుగుదేశం ‘గ్రాఫ్’ను పెంచుతాయని ఎవ్వరికీ నమ్మకం లేదు గానీ... ఈ ప్రయత్నంలో వీళ్లకి విచక్షణ మాత్రం చచ్చిపోయింది. ‘40 ఇయర్స్ ఇండస్ట్రీ’ అనరాని మాటలంటుంటే... ‘48 ఇయర్స్ ఇండస్ట్రీ’ రాయకూడదాని కథనాలు రాస్తోంది. శుక్రవారం కర్నూలు జిల్లాలో చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు గానీ... ‘మద్దతు ఒట్టిదే’ అంటూ ‘ఈనాడు’ పతాక శీర్షికల్లో అచ్చేసిన కథనం గానీ ఇలాంటివే. రామోజీ కథనంలో నిజమెంతో చూద్దాం...



రైతులకు బాసటగా నిలవాలనే ఉద్దేశంతో... వారి పంటలను దారుణమైన పరిస్థితుల్లో కూడా తక్కువకు అమ్ముకోరాదన్న ఉద్దేశంతో దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని పంటలకు కనీస మద్దతు ధరలను ప్రకటించింది. సహజంగా మద్దతు ధరలు ప్రకటించేది కేంద్రమే. కాకుంటే చాలా పంటలను కేంద్రం కొనుగోలు చేయదు. అలాంటి పంటలు వేసే రైతులకూ గిట్టుబాటు ఉండాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మూడున్నరేళ్ల కిందట ఇతర పంటలకు ఉదారంగా గిట్టుబాటు ధరలు ప్రకటించింది. అంతకన్నా ఎక్కువ ధరలుంటే రైతులు మార్కెట్లోనే విక్రయించుకుంటారు. ఎలాంటి ఇబ్బందీ ఉండదు. కానీ అనుకోని విపత్కర పరిస్థితులు తలెత్తి కొన్ని ప్రత్యేక పంటలకు గనక మార్కెట్లో ధర పడిపోతే... వారిని ఆదుకోవటానికి రాష్ట్రం ప్రకటించిన కనీస మద్దతు ధర ఉంటుంది. కాబట్టి బయట ఎవ్వరూ అంతకన్నా తక్కువకు రైతు నుంచి కొనే సాహసం చేయలేరు. ఆ ఉద్దేశంతో పెట్టిన ధరకు కూడా వక్రభాష్యం చెప్పటం ‘ఈనాడు’కే చెల్లింది.

సరే! ఇక్కడ కొన్ని వాస్తవాలు చూద్దాం. 2014 నుంచి 2019 వరకూ ఐదేళ్ల చంద్రబాబు పాలనలో వివిధ పంటల కొనుగోలు కోసం చేసిన ఖర్చు కేవలం రూ.3,322 కోట్లు. మరి గడిచిన మూడున్నరేళ్లలో ఈ ప్రభుత్వం వివిధ పంటల కొనుగోలు కోసం ఎంత వెచ్చించిందో తెలుసా? అక్షరాలా ఏడువేల నూటయాభై ఏడు కోట్లు. అంటే... రెట్టింపు కన్నా అధికం!!.. పోనీ ధాన్యం రైతులకైనా చంద్రబాబు మేలు చేశాడా అంటే... అదీ లేదు. ఐదేళ్లలో ధాన్యం కొనుగోలు కోసం చంద్రబాబు ప్రభుత్వం వెచ్చించిన మొత్తం రూ. 43,134 కోట్లయితే... ఈ మూడేళ్లలోనే వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 48,793 కోట్లు వెచ్చించింది. ఈ ఏడాది ధాన్యం సేకరణ ఇంకా పూర్తిగా ఆరంభం కాలేదు కాబట్టి... మూడేళ్లగానే పరిగణించాలి. అంటే సగటున చంద్రబాబు ప్రభుత్వం ఏడాదికి రూ.8,600 కోట్లు ధాన్యం సేకరణకు వెచ్చిస్తే... ఈ ప్రభుత్వం సగటున ఏడాదికి రూ.16,200 కోట్లు వెచ్చించింది. కాకపోతే... ఈ వాస్తవాలను ‘ఈనాడు’ ఏనాడూ చెప్పదు. ఎందుకంటే ఇవి చెబితే చంద్రబాబును, ‘ఈనాడు’ను ఛీకొట్టని వారు ఇక మిగలరు కనక. అదీ కథ.



రూ. 3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి...

ముందెన్నడూ లేని విధంగా తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం రూ.3,000 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసింది. కొన్ని నిర్దేశిత పంటలకు గనక ధర పడిపోతే... ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ నిధి సాయంతో వాటిని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తుంది. పొగాకుతో సహా ప్రధాన వ్యవసాయ వాణిజ్య పంటలైన జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, మొక్కజొన్న, కందులు, పెసలు, మినుములు, వేరుశనగ, పత్తి, పసుపు, ఉల్లి, టమాటా తదితర పంటలకు మార్కెట్ జోక్యంతో కనీస మద్దతు ధరలు దక్కేలా చేసింది. ఇప్పటికీ కేంద్రం మద్దతు ధరలు ప్రకటించని మిర్చి, పసుపు, ఉల్లి, చిరుధాన్యాలు, అరటి, చీనీ పంటలకు దేశంలో కనీస మద్దతు ధర ప్రకటించిన ప్రభుత్వమేదైనా ఉందీ అంటే... అది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే కదా రామోజీరావు గారూ? ఇలాంటి మంచి విషయాలు మీ పత్రికలో ఎన్నడూ ప్రస్తావించరెందుకు? రైతులను చేయిపట్టి నడిపించేలా ప్రభుత్వం తీసుకున్న చర్యలు బాబు హయాంలో కనీసం ఆలోచనల్లో కూడా లేవన్నది నిజం కాదా? రైతుకు విత్తనాలు, పురుగు మందులు అందించే దగ్గర నుంచి... వారి నుంచి పంట కొనుగోలు చేసేందుకు కూడా వీలుగా గ్రామ స్థాయిలో ఏకంగా 10,778 ఆర్బీకేలను ఏర్పాటయ్యాయి. పైపెచ్చు ఆర్బీకేల ద్వారానే కొనుగోలు చేయటం... రైతుల నుంచి మాత్రమే కొనేలా ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ తీసుకోవటం... కొనుగోళ్లలో చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యమివ్వటం... నాణ్యతకు పెద్దపీట... నేరుగా రైతు ఖాతాల్లోకే నగదు జమ అనే పంచ సూత్రాలూ నిక్కచ్చిగా అమలవుతున్నాయి. దీన్నిబట్టి ఈ మూడున్నరేళ్లలో ఎంత విప్లవాత్మక మార్పులొచ్చాయో వేరే చెప్పాల్సిన పనిలేదు.

కనీస మద్దతు ధరకన్నా మార్కెట్ ధర బాగుంది...

ప్రభుత్వం తీసుకున్న పలు చర్యల ఫలితంగా ప్రస్తుతం ఎమ్మెస్పీ ధరల కంటే మిరప, పత్తి, పసుపు, వేరుశనగ, మినుము, మొక్కజొన్న పంటలకు మిన్నగా మార్కెట్‌లో ధర పలుకుతోంది. దీంతో వాటిని కొనుగోలు చేయాల్సిన అవసరం పెద్దగా ఉండటం లేదు. ఈ మూడేళ్లలో ధరలు పడిపోయినపుడు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.139.90 కోట్ల విలువైన పొగాకుతో పాటు రూ.1789 కోట్ల విలువైన పత్తిని సైతం రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ రకమైన భరోసా ఇవ్వటంతో మార్కెట్లో ధరలు స్థిరపడ్డాయి. విశేషమేంటంటే ధరల స్థిరీకరణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు కానీ, మార్కెట్ జోక్యంతో చేసిన కొనుగోళ్లు కానీ ఎన్నడూ రామోజీకి కనిపించలేదు. మార్కెట్లో ధర బాగున్నాయనే విషయాన్ని చెప్పకుండా... ‘మద్దతు ఒట్టిదే’ అంటూ అర్ధసత్యాల కథనానికి ఒడిగట్టారు. పెట్టుబడి పెరిగిందని వాదిస్తున్న రామోజీ... అదే సమయంలో రైతుకు ఏటా రూ.13,500 చొప్పున ఇస్తున్న పెట్టుబడి సాయాన్నీ ప్రస్తావించలేదు. మూడేళ్ల కిందట రాష్ట్రమే కొన్ని పంటలకు ధరలు నిర్ణయించినపుడు దేశంలో ఏ రాష్ట్రం చేయని పని చేశారంటూ ప్రశంసించనూ లేదు. పైపెచ్చు అప్పట్లో ఒకరకంగా అవి ఎక్కువ ధరలే. రైతుల్ని ఆదుకోవటానికి ఉదారంగా వ్యవహరించారంటూ ఒక్క అక్షరమూ రాయలేదు. ఇప్పుడు మాత్రం ఆ ధరలను కేంద్రం మాదిరిగా పెంచటం లేదంటూ వాపోతున్నారు రామోజీ! అదే ఈ రాష్ట్ర దౌర్భాగ్యం!!.

టీడీపీ ఐదేళ్లలో కొనుగోలు చేసిన ఇతర పంట ఉత్పత్తుల వివరాలు

పంట	క్వాంటిటీ(టన్నుల్లో)	విలువ (రూ.కోట్లలో)	రైతులు
సజ్జలు	157.35	0.27	102
శనగలు	1,07,901.84	460	60,296
నల్లబెల్లం	2,061.44	3.85	671
మినుములు	1,05,145.95	571.07	66,176
పెసలు	18,522.08	118.47	11,311
జొన్నలు	34,904.50	53.40	2,825
కొర్రలు	1,215.75	2.19	557
ఉల్లి	4,930.79	6.38	759
మొక్కజొన్న	3,18,861.95	427.10	3,1044
రాగులు	12	0.03	31
కందులు	2,58,845	1374.16	1,74,317
పసుపు	48,540	305.22	28,563
మొత్తం	9,01,099	3,322	3,76,652

41 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన ఇతర పంట ఉత్పత్తుల వివరాలు

పంట	క్వాంటిటీ(టన్నుల్లో)	విలువ (రూ.కోట్లలో)	రైతులు
సజ్జలు	24,822	65.16	12,981
అరటి	12,050	8	1,060
శనగలు(ఎన్ఎఫ్)	1,304	8.25	435
శనగలు	3,37,812	1481.64	83,413
పత్తి	3,21,582	1789	83,409
పెసలు	3,011.9	22.80	1,707
వేరుశనగ	22,653	125.85	16,239
జొన్నలు	2,40,069.4	647.84	40,224
కొర్రలు	22.55	0.07	13
మొక్కజొన్న	9,13,253.9	2020.52	1,40,972
ఉల్లి	9,025	64.04	126
రాగులు	223.05	0.84	337
కందులు	61,376.83	371.35	49,345
బత్తాయి	4,109	5	436
పొగాకు	12,933	139.19	29,290
టమాటా	3,202.61	2.05	25,142
పసుపు	52,456.82	405.11	27,004
మొత్తం	20,18,130	7157.21	4,27,228

ధాన్యం కొనుగోలు వివరాలు

టీడీపీ ఐదేళ్లలో...

సంవత్సరం	రైతులు(లక్షల్లో)	లక్షల టన్నుల్లో	విలువ (రూ.కోట్లలో)
2014-15	2.78	40.62	5583.03
2015-16	1.04	64.72	9238.41
2016-17	2.99	55.57	8261.40
2017-18	5.09	59.72	9352.26
2018-19	2.68	44.46	10,698.97
మొత్తం	14.58	265.09	43,134.07

మూడేళ్లలో...

సంవత్సరం	రైతులు(లక్షల్లో)	లక్షల టన్నుల్లో	విలువ (రూ.కోట్లలో)
2019 మే తర్వాత (రబీ సీజన్‌లో)	3.13	27.53	4838.03
2019-20	6.62	82.57	15,037.12
2020-21	6.31	84.56	15,841.41
2021-22	8.09	60	12,954.39
2022-23	0.10	0.60	122.92
మొత్తం	24.25	261.86	48,793.87

(ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో)

జగనన్న పాలవెల్లువతో రూ.2354.22 కోట్ల లబ్ధి



పాడి–పంట అనే పదాలను విడదీసి చూడలేమన్నది నిరూపిస్తూ... వ్యవసాయానికి కనీస మద్దతు ధరలు ప్రకటించటమే కాక పాడి రైతుల కోసమూ ‘పాల వెల్లువ’ను ప్రారంభించింది ప్రభుత్వం. ‘జగనన్న పాల వెల్లువ’ 2020 డిసెంబర్ 2న ఆరంభమై... ప్రస్తుతం 16 జిల్లాల్లో నడుస్తోంది. 27,277 మంది రైతులతో మొదలైన ఈ ఉద్యమంలో ఇపుడు ఏకంగా 2,47,458 మంది భాగస్వాములయ్యారు. 100 గ్రామాలతో ప్రారంభమై ఇపుడు 2,856 గ్రామాలకు విస్తరించింది. పథకం ప్రారంభించినప్పుడు లీటర్‌కు గరిష్ఠంగా గేదె పాలకు రూ.71.47, ఆవు పాలకు రూ.34.20 చొప్పున చెల్లించిన అమూల్ సంస్థ... గత 22 నెలల్లో నాలుగుసార్లు సేకరణ ధరలు పెంచింది. ప్రస్తుతం గేదె పాలకు లీటర్‌కు రూ.84.15లు, ఆవుపాలకు రూ.40.73 చొప్పున చెల్లిస్తోంది. రోజూ సగటున 1.50 లక్షల లీటర్ల పాలు సేకరిస్తోంది. అమూల్ రాకతో పోటీ పెరిగింది. ప్రయివేటు డెయిరీలు సైతం సేకరణ ధరలను పెంచాల్సి వచ్చింది. ఫలితంగా వాటికి పాలు పోస్తున్న రైతులకు రూ.2354.22 కోట్ల మేర లబ్ధి పొందారు. అదీ ప్రభుత్వమంటే. లీటర్‌పై రూ.4 అదనంగా లబ్ధి చేకూర్చేలా కృషి చేస్తామని పాదయాత్రలో హామీ ఇచ్చారు జగన్. దానికి తగ్గట్టే రంగంలోకి అమూల్‌ను తెచ్చారు. కానీ ఇచ్చిన హామీ కంటే మిన్నగా ఇపుడు లీటర్‌కు గేదె పాలకు రూ.15 నుంచి రూ.20 వరకు, ఆవుపాలకు రూ.10లకు పైబడి అదనంగా లబ్ధి కలుగుతోంది రైతులకు. ఈ రాష్ట్ర ప్రజల దురదృష్టమేంటంటే బాబుకు కొమ్ము కాయటమే పనిగా పెట్టుకున్న ‘ఈనాడు’ గానీ... దాని సోదరసోదరీమణులైన మీడియా సంస్థలు గానీ ఈ నిజాలను ఎప్పుడూ చెప్పవు. ఉన్నవీ లేనివీ రాస్తూ ఎంతకూ ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచాలన్నదే వాటి ఎజెండా. ఆ ఎజెండాకిపుడు నూకలు చెల్లుతున్నాయన్నది మాత్రం పచ్చి నిజం.

సామాజిక న్యాయానికి బీసీ జనగణన

సందర్భం



జూలూరు గౌరీశంకర్

భారత సమాజం కులాల దొంతర అన్న సంగతి తెలిసిందే. ఈ దొంత రలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురై ఏమాత్రం అభివృద్ధికి నోచుకోని ఆదిమ తెగలవారూ, అసలు మనుషులుగా గౌరవం పొందని హిందూ సామాజిక బహిష్కృత ఎస్సీలూ అట్టడు గున ఉంటే... అటు ఓసీలలా గౌరవా నికి నోచుకోనివారూ, ఇటు ఎస్సీల్లా మరీ తక్కువ చూపుకు గురికాని బీసీలు మధ్యస్తరంలో ఉన్నారు. దేశ జనాభాలో వీళ్లశాతం సగం కన్నా ఎక్కువే. వీరంతా సంప్రదాయ వృత్తులను అనుసరిస్తూ దేశ సంపద సృష్టిలో ప్రధాన పాత్ర వహిస్తున్నారు. విద్య, ఉద్యోగ తదితర రంగాల్లో అణగారిన, వెనుక బడిన వర్గాలకు ప్రభుత్వాలు రిజర్వేషన్ కల్పించినా... జనాభా దామాషా ప్రకారం ఆయా కులాల వారికి అందడం లేదనేది ఒక ప్రగాఢమైన విశ్వాసం రిజర్వేషన్ పొందుతున్న వర్గాల్లో ఉంది. మరీ ముఖ్యంగా బీసీల్లో ఈ అభిప్రాయం ఉంది. తాము దేశ జనాభాలో ఎంతమందిమి ఉన్నామో తెలిస్తే... ఆ నిష్పత్తిలో రిజర్వేషన్లు పొందవచ్చని వారు భావిస్తున్నారు. అందుకే బీసీ జన గణన జరగాలని వారు కోరుకుంటున్నారు. ఇప్పటికే చాలా సార్లు ఈ డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం ముందు పెట్టినా అది పట్టించుకోవడం లేదు. దీంతో అనేక రాష్ట్రాల్లో బీసీ జనాభాను లెక్కించాలనీ, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలనీ కోరుతూ ఉద్యమాలు రగులుకుంటున్నాయి.

బీసీ జనగణన చేయమని అడిగితే పట్టించుకోని కేంద్ర ప్రభుత్వంపై దీర్ఘకాలిక ఉద్యమం చేయక తప్పని స్థితి వచ్చింది. ఈ ఉద్యమం దేశ చరిత్రలోనే మరో శాంతియుత బీసీల హక్కుల సాధన జాతీయ ఉద్యమంగా కొనసాగాలి. అది ఏ విధంగా అంటే 14 ఏళ్లు శాంతియుతంగా కొనసాగిన మలిదశ తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమ నమూనాలో కొనసాగాలి. వ్యవసాయరంగాన్ని రక్షించుకోవడానికి ఇటీవల జరిగిన శాంతి యుత రైతాంగ ఉద్యమ రూపం ధరించాలి. రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం భావించి ముస్లింలకు 12 శాతం, గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు ఉండాలని ప్రతిపాదిస్తూ రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఆ తీర్మానం పంపి ఇప్పటికి సరిగ్గా ఆరేళ్లు అవుతోంది. కేంద్రం ఇప్పటికీ పెదవి విప్పటం లేదు. ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ నేతృత్వంలోని బిహార్ ప్రభుత్వం బీసీ జనగణన చేయాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదింపచేసుకుని కేంద్రానికి పంపింది. హేమంత్ సొరేన్ నేతృత్వంలోని జార్ఖండ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 60 శాతం నుంచి 77 శాతానికి రిజర్వేషన్లు పెంచాలనే చట్టసవరణ బిల్లును అసెంబ్లీ ఆమోదించింది. రిజర్వేషన్ల పెంపుకోసం రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో మార్పులు చేయాలని కేసీఆర్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. తమిళనాడు తరహాలో తెలంగా ణకు కూడా రిజర్వేషన్లు ఇవ్వాలని ఆయన కేంద్రాన్ని కోరారు. ఇలా రిజర్వేషన్ల శాతం పెరిగినప్పుడే జనాభా దామాషా ప్రకారం ఎవరి వాటా వారికి దక్కుతుంది.

రాజ్యాంగంలోని 340 ఆర్టికల్‌ను అనుసరించి భారత దేశంలో ప్రప్రథమంగా 1953 జనవరిలో కాకా కాలేల్కర్ నేతృత్వంలో వెనుకబడిన తరగతుల కమిషన్‌ను నియ మించడం జరిగింది. ఇది 1955లో తన నివేదికను సమ ర్పిస్తూ దేశంలో 2399 కులాలను వెనుకబడిన కులాలుగా అందులో 837 కులాలను అత్యంత వెనుకబడిన కులాలుగా గుర్తించి కొన్ని సిఫార్సులు చేసింది. అయితే ప్రభుత్వం ఈ కమిషన్ చేసిన సిఫార్సులను తిరస్కరించింది.

కేంద్ర ప్రభుత్వం 1979లో బి.పి. మండల్ నేతృత్వంలో రెండవ బీసీ కమిషన్‌ను ఏర్పాటుచేయడం జరిగింది. ఈ కమిషన్ బీసీల జనాభాను 52 శాతంగా లెక్కకట్టి వీరికి విద్యా ఉద్యోగ రంగాల్లో 27 శాతం రిజర్వేషన్లను కల్పించాలని 1980లో నివేదిక సమర్పించింది. అయితే, ఈ సిఫారసులు 1992 నుండి మాత్రమే అమలులోకి వచ్చాయి. 2017 అక్టోబర్‌లో జస్టిస్ రోహిణి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఒక కమిషన్‌ను నియమించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వ ఓబీసీ జాబితాను వర్గీకరించడం ఈ కమిషన్ ముఖ్య విధి. ఇప్పటికి ఈ కమిషన్ గడువును 13 సార్లు పొడిగించడం జరిగింది. ఇంత వరకు ఈ కమిషన్ తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించలేదు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత బి.ఎస్. రాములు నేతృత్వంలో నియమించబడ్డ తొలి తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఏప్రిల్ 2017లో ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పిస్తూ, బీసీ–ఇ గ్రూప్‌లో ఉన్న ముస్లింలలోని కొన్ని వెనుకబడిన వర్గాలకు అందించబడుతున్న రిజర్వే షన్లను 4 శాతం నుండి 10 శాతానికి పెంచాలని సిఫారసు చేయడం జరిగింది. ఈ సిఫారసులను ప్రభుత్వం అంగీకరిస్తూనే, సుధీర్ కమిషన్, ఇతర నివేదికలను అనుసరించి వీరికి రిజర్వేషన్లను పన్నెండు శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకోవడం జరిగింది. 2019లో ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ మరో నివేదిక సమర్పిస్తూ... సంచార, అర్ధ సంచార జాతులకు చెందిన 17 కులాలను తెలంగాణ రాష్ట్ర బీసీ జాబితాలో చేర్చాలని సిఫారసు చేయడం జరిగింది. ఈ సిఫారసులను కేసీఆర్ క్యాబినెట్ యధాతథంగా ఆమోదించి అమలుచేయడం జరిగింది.

2011లో జరిగిన సామాజిక ఆర్థిక కులగణన వివరాలు ఉన్నాయని చెప్పిన కేంద్రం ఆ వివరాలు ఎందుకో బైట పెట్టకుండా దాటవేసింది. దేశంలో సగానికి పైగా జనాభా వున్న బీసీల విషయంలో కేంద్రం లెక్కలేనితనం చూపడం దారుణమైనది. దేశంలో బీసీలు ఎంతమంది ఉన్నారు? వీళ్ల ఆర్థిక స్థితిగతులేమిటి? వీరి చదువులు ఎలా వున్నాయి? వీరి ఉద్యోగ అవకాశాలేమిటి? వీరింకా దారిద్ర్య రేఖకు దిగువన ఉండటానికి కారణాలు ఏమిటి? బీసీలలో ఇంకా సంచార జాతులుగా వున్న వారి దీనస్థితికి విముక్తి ఎప్పుడు? ఈ సమా చారం లేకుండా దేశాభివృద్ధికి వ్యూహాలు రచించడం కష్టం. అందుకే బీసీ జనగణన అత్యంతావశ్యం.

– వ్యాసకర్త చైర్మన్,
తెలంగాణ సాహిత్య అకాడమీ

విశాఖలో ఐటీ సమ్మిట్

- జనవరిలో ఐటీ హబ్ వేదికగా రెండ్రోజులపాటు నిర్వహణ
- వెబ్‌సైట్, పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి అమర్‌నాథ్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: భవిష్యత్ ఐటీ హబ్‌గా మారుతున్న విశాఖపట్నంలో వచ్చే ఏడాది జనవరిలో ఐటీ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏపీ ఐటీ అసోసియేషన్ (ఐటాప్), ఏపీఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఏపీఐఎస్, ఎస్‌టీపీఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇన్ఫినిటీ వైజాగ్–2023 ఐటీ సమ్మిట్ పోస్టర్, వెబ్‌సైట్‌ని మంత్రి అమర్‌నాథ్ శుక్రవారం నగరంలో ఆవిష్కరించారు. జనవరి 20, 21 తేదీల్లో స్థానిక మారియట్ హోటల్‌లో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. తొలి రోజున ఎస్‌టీపీఐ ద్వారా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ, స్టార్టప్‌లతో పాటు ఐటీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని, రెండో రోజున బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం)తో పాటు ఐటీ రంగంలో వస్తున్న మార్పులు, ప్రభుత్వ ప్రోత్సాహం తదితర అంశాలపై ప్రపంచ దేశాలకు చెందిన ప్రముఖులు, ఐటీ రంగ నిపుణులు చర్చిస్తారని వివరించారు. ఐటాప్ అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మెట్లెక్కిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ



సాక్షి, అమరావతి: ఏపీ గిడ్డంగుల సంస్థ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఆన్‌లైన్ బాట పట్టింది. గిడ్డంగులను రైతులకు మరింత అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివిధాలుగా చేయూత అందిస్తున్నారు. ఫలితంగా గిడ్డంగుల సంస్థ కార్యకలాపాలు విస్తరించి లాభాల బాట పట్టింది. ఇదే సందర్భంలో సీఎం ఆదేశాల మేరకు సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకొచ్చే లక్ష్యంతో ఈ సంస్థలో ఆన్‌లైన్ సేవలను ఆరంభించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఏపీ వేర్ హౌసింగ్ ఆన్‌లైన్ సర్వీస్ (ఏపీడబ్ల్యూఎస్ఓ) పోర్టల్‌ను తీసుకొచ్చారు. తద్వారా సిబ్బందిపై పని ఒత్తిడి తగ్గడంతో పాటు రైతులకు సత్వర సేవలు అందుబాటులోకి వచ్చాయి. అవసరమైన రైతులు తమకు అవసరమైన గిడ్డంగులను ఆన్‌లైన్‌లోనే బుక్ చేసుకుని ఆన్‌లైన్ ద్వారానే చెల్లింపులు చేసే అవకాశం కలిగింది.

పని తగ్గింది.. పారదర్శకత పెరిగింది

లావాదేవీలన్నీ డిజిటలైజేషన్ చేయడంతో తక్కువ సమయంలో రోజువారీ కార్యకలాపాలన్నీ ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా అప్‌డేట్ చేస్తున్నారు. క్షణాల్లో అవసరమైన రిపోర్ట్స్‌ను జనరేట్ చేస్తున్నారు. మాన్యువల్‌గా చేసే సమయంలో కొన్నిసార్లు తప్పులు దొర్లేవి. ఇవి రోజువారీ కార్యకలాపాలకు ప్రతిబంధకంగా మారేవి. ప్రస్తుతం కార్యకలాపాలన్నీ డిజిటలైజేషన్ చేయడం వల్ల తప్పులకు ఆస్కారం లేకుండా ఆటోమేటిక్‌గా అప్‌డేట్ చేస్తున్నారు. ఒకవేళ ఎవరైనా సిబ్బంది పొరపాటుగా నమోదు చేస్తే పైఅధికారులకు అలర్ట్ వచ్చేలా ఏర్పాటు చేశారు.

స్టేట్ డేటా సెంటర్‌లో భద్రం

గతంలో రిజిస్టర్లు, రిపోర్టులను మాన్యువల్‌గా భద్రపర్చడం వల్ల ఇబ్బందులు తలెత్తేవి. రికార్డులు చెదలు పట్టి పాడైపోవడంతో కావాల్సిన సమాచారం దొరక్క ఇబ్బందులు తలెత్తేవి. ప్రస్తుతం ఆన్‌లైన్ సర్వీస్ పోర్టల్ ద్వారా రిజిస్టర్లు, నివేదికలను డిజిటలైజ్ చేయడంతో ఆటోమేటిక్‌గా అప్‌డేట్ అవుతున్నాయి. వాటిని స్టేట్ డేటా సెంటర్‌లో భద్రపర్చడం వల్ల ఇబ్బందులు తలెత్తాయి. ఇన్సూరెన్స్, లైసెన్స్ రెన్యువల్స్, విద్యుత్, టెలిఫోన్, ఇంటర్నెట్ బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం వలన గతంలో సంస్థ ఆర్థికంగా నష్టపోయిన సందర్భాలు ఉండేవి. ప్రస్తుతం ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా సంబంధిత అధికారులకు ఆటోమేటిక్ సిస్టమ్ అలర్ట్స్ వచ్చే ఏర్పాటు చేశారు. దీంతో సకాలంలో స్పందించేందుకు వీలు కలుగనుంది.

నాణ్యమైన సేవలే లక్ష్యంగా..



నాణ్యమైన సేవలందించడమే లక్ష్యంగా ఆన్‌లైన్ సర్వీస్‌లను అందుబాటులోకి తీసుకొచ్చాం. పోర్టల్ నిర్వహణ ద్వారా పని ఒత్తిడి తగ్గుతోంది. ఆర్థిక భారం కూడా తగ్గుతుంది. సమాచారంలో కచ్చితత్వం పెరిగింది. సమాచార భద్రతకు ఢోకా లేదు. పారదర్శకత పెరగడంతోపాటు సిబ్బందిలో జవాబుదారీతనం పెరుగుతోంది.
– శ్రీకంఠనాథరెడ్డి, ఎండీ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ

లాభాల బాటలో

నాలుగు వేల టన్నుల సామర్థ్యంతో 1958లో ఏర్పాటైన రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు 2018–19 నాటికి 5.92 లక్షల టన్నుల సామర్థ్యం గల గోడౌన్స్ ఉండేవి. గడచిన మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ కృషి ఫలితంగా కొత్తగా 2.44 లక్షల టన్నుల సామర్థ్యం కల్గిన గోడౌన్స్ అందుబాటులోకి వచ్చాయి. గిడ్డంగుల సంస్థకు ప్రస్తుతం 69 సొంత గిడ్డంగులు ఉండగా.. 6.39 లక్షల టన్నుల సామర్థ్యం గల మరో 58 ప్రైవేట్ గోడౌన్లను కూడా నిర్వహిస్తోంది. మొత్తంగా 14.75 లక్షల టన్నుల సామర్థ్యం గల గోడౌన్లను నిర్వహిస్తూ 2021–22లో రికార్డు స్థాయిలో రూ.305 కోట్ల ఆదాయాన్ని గిడ్డంగుల సంస్థ ఆర్జించింది. ఖర్చులు, పన్నులు పోగా రూ.33.13 కోట్ల నికర లాభాలను సంస్థ ఆర్జించింది. కాగా, ప్రస్తుతం మరో 69,600 టన్నుల నిల్వ సామర్థ్యం గల గోడౌన్స్ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి.

డ్రై ఫ్రెష్ హైజినిక్ టాయిలెట్స్ ప్రారంభం


నెల్లిపాకలో డ్రై ఫ్రెష్ హైజినిక్ టాయిలెట్స్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌పీసీఎల్ డీజీఎం భాను ప్రకాష్

ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా): పెట్రోలియమ్, టూరిజం శాఖల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న ప్రపంచ టాయిలెట్స్ డేను పురస్కరించుకుని డ్రై ఫ్రెష్ హైజినిక్ టాయిలెట్స్‌ను కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్‌పూరి, టూరిజం శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, వర్చువల్ విధానంలో శుక్రవారం ప్రారంభించారు. నేషనల్ పార్కు రహదారి వెంట ఉన్న హిందుస్తాన్, భారత్, ఇండియన్ ఆయిల్, పెట్రోల్ బంకుల వద్ద అత్యాధునిక టాయిలెట్స్ నిర్మించారు. ఎటపాక మండల పరిధిలో నెల్లిపాకలో ఉన్న హిందుస్తాన్ పెట్రోలియం బంకువద్ద ఏర్పాటు చేసిన డ్రై ఫ్రెష్ టాయిలెట్స్‌ను హెచ్‌పీసీఎల్ డీజీఎం భాను ప్రకాష్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సేల్స్ అధికారి సతీష్‌కుమార్, డీలర్ విజయశ్రీ, బాచినేని రామకృష్ణ, వీర వెంకయ్య, కిలారి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'నవజీవన్' ప్యాంట్రీ కారులో మంటలు



ప్యాంట్రీ కార్‌లో చెలరేగుతున్న మంటలు

గూడూరు: నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్యాంట్రీ కార్‌లో మంటలు చెలరేగాయి. దీన్ని గుర్తించిన ప్రయాణికులు చైన్ లాగడంతో రైల్వే పోలీసులు, ఫైర్ సిబ్బంది గూడూరు రైల్వే జంక్షన్‌లో రైలును ఆపి, మంటలను అదుపు చేశారు. ఈ కారణంగా రైలు గంట ఆలస్యంగా చెన్నైకి బయలుదేరి వెళ్లింది. రైల్వే ఎస్ఐ కె.కొండపనాయుడు వివరాల మేరకు..అహ్మదాబాద్ నుంచి చెన్నైకి వెళ్లే నవజీవన్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం వేకువజామున 2.38 గంటలకు గూడూరు రైల్వే స్టేషన్ సమీపిస్తుండగా, ప్యాంట్రీ కార్‌లో పొగలు రావడాన్ని ప్రయాణికులు గుర్తించారు. వెంటనే బోగీలోని చైన్ లాగడంతో అప్పటికే రైలు స్టేషన్‌కు చేరుకుంది. దీంతో ప్రయాణికులంతా రైల్లోంచి ప్లాట్‌ఫాంపైకి దిగేశారు. అప్రమత్తమైన రైల్వే పోలీసులు, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అప్పటికే మంటలు పూర్తిగా వ్యాపించడంతో ఫైర్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ప్యాంట్రీ కార్ అద్దాలను పగులగొట్టి, మంటలను అదుపు చేశారు. ప్యాంట్రీ కార్‌లోని గ్యాస్ స్టౌ ఆఫ్ చేయకపోవడంతోనే మంటలు వ్యాపించినట్లుగా భావిస్తున్నారు.

రిటైర్డ్ లోకాయుక్త జస్టిస్ శ్రీనాథ్‌రెడ్డి మృతి



కర్నూలు(సెంట్రల్): రిటైర్డ్ లోకాయుక్త జస్టిస్ శ్రీనాథ్‌రెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతిచెందారు. ఆయన 1990 నుంచి 1995 మధ్యకాలంలో లోకాయుక్తగా పనిచేశారు. జస్టిస్ శ్రీనాథ్‌రెడ్డి 1974 నంచి 1978 వరకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా, 1978 నుంచి 1990 వరకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జిగా పని చేశారు. ఆయన మృతి పట్ల ప్రస్తుత లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తంచేశారు. జస్టిస్ శ్రీనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

యూరప్‌లో ముగిసిన శ్రీవారి కళ్యాణోత్సవాలు



సాక్షి, అమరావతి: ప్రపంచవ్యాప్తంగా హిందూ సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా యూరప్ దేశాల్లో టీటీడీ నిర్వహించిన శ్రీవారి కళ్యాణోత్సవాలు ముగిశాయి. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 13 వరకు 11 నగరాల్లో ఈ కళ్యాణోత్సవాలను నిర్వహించినట్లు ఏపీ ఎన్ఆర్టీఎస్ అధ్యక్షుడు వెంకట్ ఎస్ మేడపాటి శుక్రవారం తెలిపారు. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం జరిగిన ఈ కళ్యాణానికి టీటీడీ అర్చకులు, వేద పండితులు యూరప్‌కు వెళ్లారు. అక్కడ పలు నగరాల్లో నిర్వహించిన కళ్యాణోత్సవానికి భారీగా భక్తులు, ఆయా దేశాల రాయబారులు, ప్రవాస భారతీయులు హాజరైనట్లు చెప్పారు. ప్రతి ఏటా ప్రపంచంలోని పలు దేశాల్లో శ్రీ మలయప్పస్వామి వారి కళ్యాణం నిర్వహించే విధంగా సీఎం జగన్ ప్రోత్సహిస్తున్నారని ఇదే స్ఫూర్తితో మరిన్ని దేశాల్లో కళ్యాణోత్సవాలు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

100 కేజీల గంజాయి పట్టివేత



కంచికచర్ల(నందిగామ): భారీ ఎత్తున గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం జరిగింది. ఎస్ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం కథనం ప్రకారం... తెల్లవారు జామున వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తుండగా రెండు కార్లలో 100 కేజీల గంజాయిని గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుంది. ఒడిశా రాష్ట్రం చిత్రకుంట నుంచి మహారాష్ట్రలోని ముంబయికి తరలిస్తున్నారు. గుంటూరు జిల్లా కొలనుకొండ గ్రామానికి చెందిన ఎ.శివశంకరరెడ్డి, నరసింహారావు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రమేష్ కుమారశర్మ, ఏలూరు పట్టణానికి చెందిన గుంటూరులో నివాసముంటున్న గేదెల సాయి కిరణ్‌లను అరెస్టు చేశారు. రెండు కార్లను సీజ్ చేశారు.

కవికుల గురువు కాళిదాసు పురస్కారాలు ప్రదానం



ఏఎన్‌యూ: కవికుల గురువు కాళిదాసు పురస్కారాలను గుంటూరు హిందూ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్ దీక్షిత్, పొన్నూరు ఎస్‌బీఎస్ఎస్ కళాశాల విశ్రాంత అధ్యాపకులు నిష్టల సుబ్రహ్మణ్యశాస్త్రికి ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో శుక్రవారం ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకురాలు, ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ.. అకాడమీ ఆధ్వర్యంలో పలు కోర్సులకు సంబంధించిన పుస్తకాలతో పాటు, పోటీ పరీక్షలకు దోహదం చేసే పుస్తకాలు కూడా ముద్రిస్తున్నామని చెప్పారు. సంస్కృతంలో ఉన్న కొన్ని గ్రంథాలను తెలుగులోకి అనువదించే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. సంస్కృతం నేర్చుకోవడానికి అవసరమైన పుస్తకాలు, సీడీలను వీడియోల రూపంలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆమె చెప్పారు. తెలుగు, సంస్కృత భాషాభివృద్ధికి కృషిచేసిన కవులు, పండితులకు అకాడమీ ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేయనున్నట్లు లక్ష్మీపార్వతి వెల్లడించారు. కార్యక్రమానికి ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్, ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షులు డాక్టర్ పీవీ విజయబాబు, ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ పాల్గొన్నారు.

రెచ్చిపోయిన గంజాయి స్మగ్లర్

- టాస్క్‌ఫోర్స్ వాహనాన్ని ఇన్నోవాతో ఢీకొట్టి పరారీ


గంజాయి స్మగ్లర్ వాహనం ఢీకొట్టడంతో టైరు ఊడిపోయిన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ వాహనం

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు యత్నించిన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం వాహనాన్ని.. తన ఇన్నోవా వాహనంతో ఓ గంజాయి స్మగ్లర్ బలంగా ఢీకొట్టిన ఘటన తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. కొంతమంది గంజాయిని తరలిస్తున్నారని సమాచారం రావడంతో శుక్రవారం ఉదయం గుత్తులపుట్టు రోడ్డులోని గబ్బంగి తోటల సమీపంలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజు,సీఐ కూర్మారావు, ఇతర సిబ్బంది తమ వాహనాన్ని రోడ్డుకు అడ్డంగా పెట్టి కాపు కాశారు. గంజాయితో వస్తున్న ఇన్నోవా వాహనాన్ని అడ్డగించారు. అయితే వాహనాన్ని నడుపుతున్న గంజాయి స్మగ్లర్ ఆ వాహనంతో టాస్క్‌ఫోర్స్ బృందం వాహనాన్ని వేగంగా వచ్చి బలంగా ఢీకొట్టాడు. దీంతో టాస్క్‌ఫోర్స్ బృందం వాహనం ముందు టైరు ఊడిపోయింది. వాహనంలో ఉన్న అధికారులంతా భయంతో వాహనం నుంచి కిందకు దూకారు. గంజాయి ఉన్న ఇన్నోవా వాహనాన్ని సమీపంలోని తుప్పల్లోకి తీసుకెళ్లి అక్కడ వదిలిపెట్టి స్మగ్లర్ సమీప కొండల్లోకి పరుగు తీశాడు. అతనిని పట్టుకునేందుకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. వాహనంలో 38 కిలోల గంజాయిని గుర్తించామని, ఇన్నోవా కారును సీజ్ చేశామని సీఐ కూర్మారావు తెలిపారు. కాగా, ఘటనలో అధికారులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వేద విద్య, సంస్కృతి పాఠశాలకు 15 ఎకరాలు

విశాఖ శారదా పీఠానికి ప్రభుత్వం బదలాయింపు

సాక్షి, విశాఖపట్నం: వేదాలు, సంస్కృతిని చాటి చెప్పేందుకు నిర్మించనున్న వేద విద్య, సంస్కృతి పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత అందించింది. శారదా పీఠం ఆధ్వర్యంలో నిర్మించనున్న ఈ వేద విద్యాలయానికి భీమిలి మండలం కొత్తవలసలో 15 ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయించిన విషయం విదితమే. దీనికి సంబంధించి సర్వేనంబర్ 102/2లో 7.70 ఎకరాలు, సర్వే నంబర్ 103లో 7.30 ఎకరాలు చొప్పున మొత్తం 15 ఎకరాలను శారదా పీఠానికి బదలాయిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎకరానికి రూ.లక్ష చొప్పున మొత్తం 15 ఎకరాలకు రూ.15 లక్షలు చెల్లించాలని పేర్కొంది.

రూ.2.5 కోట్లతో మావోల కోటలో అభివృద్ధి పనులు

- జామిగూడ– గుంజివాడ వంతెనకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మాధవి ఎమ్మెల్యే పాల్గుణ

పెదబయలు: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మావోయిస్టుల ప్రాబల్య ప్రాంతమైన జామిగూడ–గుంజివాడ గ్రామాల మధ్య గెడ్డపై రూ.2.5 కోట్లతో ప్రభుత్వం వంతెన నిర్మించనుంది. దీనికి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ,ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎంపీ మాట్లాడుతూ మారుమూల గిరి గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం పాలన చేస్తున్నారన్నారు. గతంలో రూ.14 కోట్లతో రూఢకోట నుంచి జామిగూడ మీదుగా రహదారి మంజూరు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ జామిగూడ పంచాయతీ గిరిజనుల రవాణా కష్టాలు ఇన్నాళ్లకు తీరనున్నాయన్నారు. వర్షాకాలం వస్తే జామిగూడ వాగు దాటుతూ ప్రాణాలు కోల్పోయిన ఘటనలు తనను తీవ్రంగా బాధించాయన్నారు. త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇప్పటివరకు ఎంపీ, ఎమ్మెల్యే స్థాయి ప్రజాప్రతినిధి జామిగూడ గ్రామానికి వెళ్లిన దాఖాలాలు లేవు. తొలిసారిగా ఎంపీ మాధవి, ఎమ్మెల్యే పాల్గుణ, ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర జామిగూడకు రావడంతో గిరిజనుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. దశాబ్దాల కల అయిన వంతెన నిర్మాణం సాకారమవుతోన్న నేపథ్యంలో పరిసర గ్రామాల గిరిజనులు ప్రజాప్రతినిధులపై పూలవర్షం కురిపించి సత్కరించారు.

'నవరత్నాలతో బీసీల అభివృద్ధి'

సాక్షి,అమరావతి: సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకాలు ద్వారా బీసీ కులాల జీవన స్థితిగతులు మెరుగుపడి వారి జీవన ప్రమాణ స్థాయి పెరుగుతోందని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్ మారేష్ అన్నారు. ఏపీ బీసీ సంఘం ఆధ్వర్యంలో త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా 'నవరత్నాలతో బీసీల అభివృద్ధి'పేరుతో జిల్లా కేంద్రాల్లో చర్చా వేదికలు, రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. రౌండ్ టేబుల్ సమావేశాల పోస్టర్‌ను శుక్రవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మోరల్ మహీధర్ మాట్లాడుతూ సీఎం జగన్ బీసీలకు చేస్తోన్న సంక్షేమాన్ని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రచారం చేస్తామన్నారు. సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీ రాణి, రాష్ట్ర కన్వీనర్ తన్నీరు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

7 నుంచి పార్లమెంటు శీతాకాల సమావేశాలు

హైదరాబాద్: పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 7 నుంచి 29 వరకు జరుగుతాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి శుక్రవారం వెల్లడించారు. మొత్తం 17 పనిదినాలు ఉంటాయని ఓ ట్వీట్‌లో తెలిపారు. సాధారణంగా శీతాకాల సమావేశాలు నవంబర్ చివరి వారంలో ఆరంభమవుతాయి. అయితే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు డిసెంబర్ 1, 5 తేదీల్లో ఉండటంతో సమావేశాలు ఆలస్యంగా ప్రారంభమవుతున్నాయి.

స్పీకర్ బాధ్యతల నుంచి తప్పుకుంటా



వాషింగ్టన్: అమెరికాలోని కీలకమైన ప్రతినిధుల సభ(హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) స్పీకర్ పదవి నుంచి వైదొలగనున్నట్లు నాన్సీ పెలోసీ ప్రకటించారు. ఇటీవల జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ప్రతిపక్ష రిపబ్లికన్లు స్పష్టమైన మెజారిటీ సాధించారు. ఈ నేపథ్యంలో అధికార డెమోక్రాటిక్ పార్టీకి చెందిన నాన్సీ పెలోసీ ఈ నిర్ణయం తీసుకున్నారు. వచ్చే జనవరిలో బాధ్యతల నుంచి తప్పుకుంటానని గురువారం సభలో చెప్పారు. శాన్‌ఫ్రాన్సిస్కో ప్రతినిధిగా గత 35 ఏళ్ల తన ప్రస్థానాన్ని సభలో కొనసాగిస్తానని స్పష్టం చేశారు. సుమారు 20 ఏళ్ల పాటు డెమోక్రాటిక్ పార్టీకి సారథ్యం వహించిన ఏకైక మహిళా నేతగా, అత్యంత సమర్థురాలిగా పెలోసీ పేరు తెచ్చుకున్నారు. 'ప్రతినిధుల సభ చరిత్రలోనే అత్యంత గౌరవప్రదమైన స్పీకర్ పెలోసీ' అని అధ్యక్షుడు బైడెన్ తెలిపారు.

బైడెన్ కుటుంబంపై విచారణకే ప్రాధాన్యం: రిపబ్లికన్లు

వాషింగ్టన్: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ప్రతినిధుల సభలో ఆధిక్యాన్ని సాధించిన రిపబ్లికన్లు అధ్యక్షుడు జో బైడెన్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. బైడెన్ కుటుంబంపై విచారణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించారు. బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ విదేశీ వ్యాపారాలపై దర్యాప్తును ముమ్మరం చేస్తామని స్పష్టం చేశారు. కుమారుడి వ్యాపారాలను బలోపేతం చేయడంలో అధ్యక్షుడి పాత్ర ఉందని తేలితే తీవ్ర పరిణామాలుంటాయని హౌస్ పర్యవేక్షణ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్న జేమ్స్ కోమర్ హెచ్చరించారు. హంటర్ వ్యాపారాలపై ఇప్పటికే ఎఫ్‌బీఐ దర్యాప్తు నిర్వహిస్తోంది. పన్నుల ఎగవేత, ఆర్థిక మోసాలు చేసినట్టుగా విచారణలో వెల్లడైనట్టుగా తెలుస్తోంది. బైడెన్ ఉపాధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా కుమారుడి వ్యాపారాలను విస్తరించడానికి తన అధికారాలను ఉపయోగించారని ఆరోపణలున్నాయి.

నేను యుద్ధ ఖైదీని



ముంబై: శివసేన–ఉద్ధవ్ ఠాక్రే వర్గం సీనియర్ నాయకుడు సంజయ్ రౌత్ తనను తాను యుద్ధ ఖైదీగా అభివర్ణించుకున్నారు. మేము తమతో యుద్ధం చేస్తున్నామని ప్రభుత్వం భావిస్తోందన్నారు. మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఆయన ప్రత్యేక పీఎంఎల్‌ఏ కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఇటీవలే తిహార్ జైలు నుంచి విడుదలయ్యారు. తాజాగా ఓ మీడియా సంస్థతో మాట్లాడారు. జైలులో ఉన్నప్పుడు 10 కిలోలు బరువు తగ్గానని, తనను 'అండా సెల్'లో ఉంచారని, 15 రోజులదాకా చీకట్లోనే మగ్గిపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. జైలు ప్రాంగణంలో తీవ్రమైన ఫ్లడ్‌లైట్ల కాంతి కారణంగా చూపు తగ్గిపోయిందని చెప్పారు. చదవలేకపోతున్నానని తెలిపారు. వినికిడి శక్తి కూడా తగ్గిందన్నారు. జ్ఞాపకశక్తి సైతం మందగించే పరిస్థితి కనిపిస్తోందన్నారు. నిజానికి అధికార బీజేపీ ఎదుట లొంగిపోతే తనను అరెస్టు చేసేవారు కాదని వ్యాఖ్యానించారు.

బర్త్‌డే పార్టీలో విషాదం.. 21 మంది సజీవదహనం

గాజా: పాలస్తీనాలోని గాజా స్ట్రిప్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఓ భవనంలో సంభవించిన అగ్ని ప్రమాదం పుట్టిన రోజు వేడుకలో పాల్గొన్న ఒకే కుటుంబానికి చెందిన 21 మందిని బలి తీసుకుంది. జమాలియాలోని ఓ భవనం మూడో అంతస్తులో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు చెప్పారు. మహ్మద్ అబూ రయా దంపతులు, వారి అయిదుగురు కొడుకులు, ఒక కూతురు, ఇద్దరు కోడళ్లు, 11 మంది మనవలు, మనవరాళ్లు ఘటనలో ప్రాణాలు కోల్పోయారు.

గుంతలో వ్యాన్ బోల్తా.. 20 మంది మృతి

కరాచీ: పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో సంభవించిన రోడ్డు ప్రమాదంలో 12 మంది చిన్నారులు సహా కనీసం 20 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు. ఖైర్‌పూర్ నుంచి సెహ్వాన్‌లోని సూఫీ దర్గాకు భక్తులతో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి ఇండస్ హైవేపై ఉన్న నీటి గుంతలో పడిపోయింది. ఈ ఘటనలో 8 మంది మహిళలు, ఆరుగురు బాలికలు, ఆరుగురు బాలురు చనిపోయారు. పలువురు గాయాలపాలయ్యారు.

లోయలో పడిన వాహనం.. 11 మంది దుర్మరణం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో ఒక వాహనం లోయలోకి దూసుకుపోవడంతో అందులోని 11 మంది చనిపోయారు. జోషిమఠ్ నుంచి 16 మందితో పల్లాజఖోల్ గ్రామం వైపు బయలుదేరిన టాటా సుమో శుక్రవారం సాయంత్రం ఉర్గాం వద్ద రోడ్డు పక్కనున్న 300 అడుగుల లోతైన లోయలో పడిపోయింది.

ఉగ్రవాదానికి మద్దతు సిగ్గుచేటు

పాకిస్తాన్, చైనాపై ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా ఆగ్రహం

- విదేశాంగ విధానంలో భాగంగా ఉగ్రమూకలకు కొన్ని దేశాల అండదండలు
- ఉగ్రవాదంపై చర్యలు తీసుకొంటే అడ్డుకుంటారా?
- దుష్టశక్తులకు వ్యతిరేకంగా ప్రపంచం ఏకం కావాలి
- కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో 'నో మనీ ఫర్ టెర్రర్' సదస్సు



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాకిస్తాన్, చైనాలపై మరోసారి పరోక్షంగా విరుచుకుపడ్డారు. కొన్ని దేశాలు విదేశాంగ విధానంలో భాగంగా ఉగ్రవాదానికి నారు నీరు పోస్తున్నాయని ధ్వజమెత్తారు. ఉగ్రవాదులపై చర్యలు తీసుకొంటే నిస్సిగ్గుగా అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. శుక్రవారం 'నో మనీ ఫర్ టెర్రర్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ ఆన్ కౌంటర్–టెర్రరిజం ఫైనాన్సింగ్' మూడో సదస్సులో ప్రధాని ప్రసంగించారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో 75కు పైగా జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు చెందిన 450 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ నుంచి ఎవరూ హాజరు కాలేదు. చైనా ప్రతినిధులను ఆహ్వానించినప్పటికీ రాలేదని అధికారులు చెప్పారు. ఉగ్రవాదానికి మద్దతిచ్చే దేశాల నుంచి పరిహారం రాబట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని నరేంద్ర మోదీ ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. ఉగ్రవాదుల పట్ల సానుభూతి సృష్టించేందుకు ప్రయత్నించే సంస్థలను, వ్యక్తులను ఏకాకులను చేయాలని అన్నారు. యుద్ధం లేకపోవడమే శాంతి అని అనుకోరాదని, దొంగచాటుగా జరిగే యుద్ధాలు మరింత ప్రమాదకరం, హింసాత్మకమని పేర్కొన్నారు. కొన్ని దేశాలు ఉగ్రవాదానికి రాజకీయంగా, సిద్ధాంతపరంగా, ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి వ్యవహారాలను ఎంతమాత్రం సహించడానికి వీల్లేదన్నారు. ఉగ్ర భూతానికి బహిరంగంగా, చాటుమాటుగా మద్దతిచ్చే దుష్టశక్తులకు వ్యతిరేకంగా ప్రపంచం మొత్తం ఏకం కావాలని పిలుపునిచ్చారు.

ఉగ్రవాదానికి సరిహద్దులు లేవు

ఉగ్రవాద సంస్థలకు ఎన్నో వనరుల ద్వారా నిధులు అందుతున్నాయని, కొన్ని దేశాలు నేరుగా ఆర్థిక సాయం అందజేస్తున్నాయని ప్రధాని మోదీ దుయ్యబట్టారు. ఉగ్రవాదం వల్ల తలెత్తే పరిణామాల గురించి కొత్తగా చెప్పాల్సిన పనిలేదన్నారు. అయినప్పటికీ కొన్ని వర్గాల్లో ఉగ్రవాదం పట్ల తప్పుడు అభిప్రాయాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. ఉగ్ర దాడి ఎక్కడ జరిగినా కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని తేల్చిచెప్పారు. ముష్కర మూకలపై చర్యలను కొందరు ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని, ఉగ్రవాదానికి అనుకూలంగా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. ప్రపంచానికి ముప్పుగా మారిన ఉగ్రభూతాన్ని అంతం చేసే విషయంలో ఎలాంటి అస్పష్టతకు తావు ఉండొద్దన్నారు. మానవత్వం, స్వేచ్ఛ, నాగరికతపై దాడికి దిగే ఉగ్రవాదానికి సరిహద్దులు లేవని చెప్పారు. ఉమ్మడి కృషితోనే ఉగ్రవాదాన్ని అంతం చేయొచ్చని స్పష్టం చేశారు.

ఒక్క ప్రాణం పోయినా..

భారత్ గత కొన్ని దశాబ్దాలుగా ఉగ్రవాదం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటోందని ప్రధాని నరేంద్ర మోదీ వివరించారు. వేర్వేరు పేర్లతో ఉగ్రవాదం భారత్‌కు నష్టం కలిగించేందుకు కుట్రలు పన్నుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్ర దాడుల్లో ఇప్పటికే వేలాది మంది పౌరులను కోల్పోయామని, అయినప్పటికీ వెనుకంజ వేయకుండా ఉగ్రవాదంపై ధైర్యంగా పోరాడుతున్నామని ఉద్ఘాటించారు. ఇకపై ఒక్క దాడి జరిగినా ఎన్నో దాడులు జరిగినట్లు, ఒక్క ప్రాణం పోయినా ఎన్నో ప్రాణాలు పోయినట్లు భావిస్తామని, ఉగ్రవాద వటవృక్షాన్ని పూర్తిగా పెకిలించేదాకా విశ్రమించే ప్రసక్తే లేదని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులకు మద్దతిచ్చే నెట్‌వర్క్‌లపై, ఆర్థిక వనరులపై కచ్చితంగా దెబ్బకొట్టాలని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

నిధులివ్వడం.. ఉగ్రవాదం కంటే ప్రమాదకరం: అమిత్ షా

ప్రపంచ శాంతి, భద్రతకు ఉగ్రవాదమే అతిపెద్ద ముప్పు అనడంలో ఎలాంటి సందేహం లేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. ఉగ్రవాదం కంటే.. ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చడం అత్యంత ప్రమాదకరమని అన్నారు. 'నో మనీ ఫర్ టెర్రర్' సదస్సులో ఆయన మాట్లాడారు. ఉగ్రవాదులకు ఏయే మార్గాల్లో నిధులు అందుతున్నాయో అంతర్జాతీయ సమాజం అర్థం చేసుకోవాలని, ఆయా మార్గాలను విచ్ఛిన్నం చేసేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. భారత్‌లో ఉగ్రవాద సంస్థలకు నిధులు చేరకుండా అడ్డుకోవడంలో కొన్నేళ్లుగా ప్రభుత్వం సఫలమవుతోందని తెలిపారు. ఉగ్రవాదం ఆధునికతను సంతరించుకుంటోందని, ఇది నిజంగా ఆందోళనకరమైన అంశమని అమిత్ షా పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేయడానికి ప్రపంచదేశాలన్నీ కలిసి ఒకఉమ్మడి వ్యూహాన్ని రూపొందించాలన్నారు.

జనాభా నియంత్రణ మా పని కాదు

తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: దేశంలో నానాటికీ పెరిగిపోతున్న జనాభాను నియంత్రించడానికి 'ఇద్దరు పిల్లల' విధానాన్ని తప్పనిసరి చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. విచారణకు స్వీకరించేందుకు నిరాకరించింది. జనాభా నియంత్రణ అనేది ప్రభుత్వ పరిధిలోని అంశమని జస్టిస్ ఎస్.ఎ.కౌల్, జస్టిస్ ఎ.ఎస్.ఓకాల ధర్మాసనం వెల్లడించింది. జనాభా పెరుగుదల అనేది ఏదో ఒక మంచి రోజున ఆగిపోయే వ్యవహారం కాదని వ్యాఖ్యానించింది. ఇద్దరు పిల్లల విధానాన్ని అమలు చేయాలని కోరుతూ అడ్వొకేట్ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ తొలుత ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు ఈ పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీనిని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దేశంలో జనాభా నియంత్రణ చర్యలను కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తూ మరికొందరు వేసిన పిటిషన్లపై సైతం శుక్రవారం దృష్టి సారించింది. జనాభా నియంత్రణ తమ పని కాదని, దానికంటే చేయాల్సిన ముఖ్యమైన పనులు ఎన్నో ఉన్నాయని పేర్కొంది. జనాభాను అరికట్టడానికి తాము చట్టాన్ని తీసుకురాలేమని ఉద్ఘాటించింది. వ్యాజ్యాలను ఉపసంహరించుకోవాలని పిటిషనర్లకు సూచించింది.

హింసాద్వేషాల వ్యాప్తే బీజేపీ ఎజెండా

కాంగ్రెస్ నేత రాహుల్ మండిపాటు



జోడో యాత్రలో రాహుల్‌తో తుషార్ గాంధీ

షెగావ్(మహారాష్ట్ర): దేశంలో భయం, విద్వేషం, హింసను వ్యాప్తి చేయడమే అధికార బీజేపీ ఎజెండా అని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల నడుమ దేశం అభివృద్ధిలో ముందంజ వేయలేదని అన్నారు. ద్వేషం నుంచి దేశం ఏప్పటికీ లబ్ధి పొందలేదని తేల్చిచెప్పారు. రాహుల్ చేపట్టిన భారత్ జోడో యాత్రకు మహారాష్ట్రలో 12 రోజులు పూర్తయ్యాయి. శుక్రవారం బుల్దానా జిల్లాలోని షెగావ్‌లో సంత్ గజానన్ మహారాజ్ ఆలయాన్ని రాహుల్ దర్శించుకున్నారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. అయితే, స్వాతంత్ర్య సమరయోధుడు సావర్కర్ గురించి ఆయన ప్రస్తావించలేదు. ఛత్రపతి శివాజీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, సాహూ మహారాజ్ వంటి మహామహులు మహారాష్ట్ర గడ్డపై జన్మించారని రాహుల్ అన్నారు. ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని బోధించారని గుర్తుచేశారు. వారి ఆశయాలను జోడో యాత్ర ద్వారా ముందుకు తీసుకెళ్తున్నామని తెలియజేశారు. మహారాష్ట్రలో రైతులు ఆత్మహత్యలపై ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సభలో మహాత్మాగాంధీ ముని మనవడు తుషార్ గాంధీ కూడా పాల్గొన్నారు.

గంజాయి తాగి శ్రద్ధ హత్య



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శ్రద్ధా వాకర్ హత్య కేసులో రోజుకో కొత్త విషయం బయటపడుతోంది. నిందితుడు అఫ్తాబ్ అమీన్ పూనావాలా డ్రగ్స్‌కు బానిసని, శ్రద్ధను శారీరకంగా, మానసికంగా హింస పెట్టేవాడని తేలింది. డ్రగ్స్‌కు బానిసైన అఫ్తాబ్ గంజాయి తాగిన మత్తులో శ్రద్ధని హత్య చేసినట్టుగా పోలీసులకు తెలిపాడు. ఢిల్లీ కోర్టు అయిదు రోజుల రిమాండ్‌కు అఫ్తాబ్‌ను పోలీసులకు అప్పగించడంతో విచారణను ముమ్మరం చేశారు. ఉద్దేశపూర్వకంగా తాను ఈ హత్య చెయ్యలేదని, గంజాయి తాగిన మైకంలో ఉండగా శ్రద్ధ తనతో గొడవకు దిగిందని సహనం కోల్పోయిన తాను ఆమె గొంతు గట్టిగా నులిమేయడంతో ఊపిరి ఆగిపోయినట్టుగా అఫ్తాబ్ చెప్పుకొచ్చాడు. మే 18 రాత్రి 9 నుంచి 10 గంటల మధ్యలో తమ మధ్య ఘర్షణ జరిగిందని, ఆ సమయంలోనే శ్రద్ధ ప్రాణాలు కోల్పోయిందని అఫ్తాబ్ చెప్పినట్టుగా పోలీసు వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ఢిల్లీ కోర్టు అయిదు రోజుల్లోనే అఫ్తాబ్‌కు నార్కో పరీక్షలు పూర్తి చేయాలని, అతనిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించకూడదని ఆదేశాలు జారీ చేసింది.

రెండేళ్ల క్రితం దెబ్బలతో ఆస్పత్రిలో శ్రద్ధ

శ్రద్ధా వాకర్, అఫ్తాబ్ అమీన్ రెండేళ్ల క్రితం ముంబైలో సహజీవనం చేస్తున్న సమయంలో ఆమె గాయాలతో ఆస్పత్రి పాలైందని పోలీసుల విచారణలో తేలింది. ఆమె వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ సంభాషణలు పరిశీలిస్తున్న పోలీసులకు తన కొలీగ్స్, స్నేహితులతో జరిపిన చాట్‌లలో అఫ్తాబ్ తనని బాగా కొట్టాడని, ఒళ్లంతా గాయాలతో ఉందని లేవడానికి కూడా ఓపిక లేదంటూ మెసేజ్‌లు చేసింది.

పోలీసుల విచారణలో వెల్లడించిన అఫ్తాబ్

ఆఫీసులో తన మేనేజర్‌కి ముఖం మీద గాయాలున్న ఫోటోలని పంపింది. మరో ఫ్రెండ్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన చాట్‌లో మెట్లు ఎక్కుతుండగా పడిపోవడంతో ముక్కుకు ఫ్రాక్చర్ అయిందని చెప్పింది. 2020 డిసెంబర్ 3 , 6 తేదీల మధ్య శ్రద్ధ వెన్ను నొప్పి, మెడ నొప్పితో ఆస్పత్రిలో చేరిందని శ్రద్ధ స్నేహితుడు రాహుల్ రాయ్ పోలీసులకు చెప్పాడు. అప్పట్లోనే శ్రద్ధపై అఫ్తాబ్ హత్యాయత్నం చేశాడని, ఆమె వంటినిండా బలమైన దెబ్బలున్నాయని చెప్పాడు. ముంబైకి చెందిన డాక్టర్ ప్రణవ్ కాబ్రాను కూడా 2021 ఫిబ్రవరిలో శ్రద్ధ ఫోన్ ద్వారా కాంటాక్ట్ చేసింది. అఫ్తాబ్ హింసాత్మక ప్రవర్తనతో తాను తీవ్రమైన డిప్రెషన్‌లో ఉన్నట్టుగా చెప్పింది. ఆ డాక్టర్ క్లినిక్‌కు వస్తే ట్రీట్‌మెంట్ ఇస్తానని చెప్పినా కరోనా భయంతో రాలేదని, ఇప్పుడు వార్తలో వారిద్దరి పేర్లు వినగానే తనకు గుర్తుకు వచ్చిందని డాక్టర్ ప్రణవ్ మీడియాకి వెల్లడించారు.

భారత్‌తో సాధ్యమైనంత త్వరగా ఎఫ్‌టీఏ

యూకే ప్రధానమంత్రి రిషి సునాక్ స్పష్టీకరణ



లండన్: భారత్‌తో సాధ్యమైనంత త్వరగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) కుదుర్చేందుకు కృత నిశ్చయంతో ఉన్నామని యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధానమంత్రి రిషి సునాక్ చెప్పారు. ఈ ఒప్పందంపై చర్చలను త్వరలోనే విజయవంతంగా ముగించాలని భావిస్తున్నామని తెలిపారు. రిషి సునాక్ తాజాగా యూకే పార్లమెంట్ దిగువ సభలో మాట్లాడారు. ఇండోనేషియాలో జీ–20 సదస్సు సందర్భంగా భారత ప్రధాని మోదీతో జరిగిన భేటీలో ఎఫ్‌టీఏ పురోగతిపై సమీక్షించానని వెల్లడించారు. భారత్‌తో ఒప్పందాన్ని ఎప్పటిలోగా కుదుర్చుకుంటారో చెప్పాలని ప్రతిపక్ష లేబర్ పార్టీతోపాటు అధికార కన్జర్వేటివ్ ఎంపీలు కోరారు. ఒప్పందంపై ప్రధాని మోదీతో ఇప్పటికే మాట్లాడానని, ఈ విషయంలో భారత్–యూకే మధ్య చర్చలకు సాధ్యమైనంత త్వరగా విజయవంతమైన ముగింపు పలకాలన్నదే తమ ఉద్దేశమని వివరించారు. వాస్తవానికి అక్టోబర్ ఆఖరులోనే ఇరు దేశాల చర్చలు ముగింపు దశకు చేరుకున్నాయని తెలిపారు. కొన్ని అంశాలపై సందేహాలను నివృత్తి చేసుకోవాల్సి ఉందని, పరస్పరం సంతృప్తికరమైన పరిష్కారం కనుక్కొంటామన్నారు. భారత్–యూకే బంధం వాణిజ్యానికి పరిమితమైందని కాదని, అంతకంటే విస్తృతమైనదని సునాక్ తేల్చిచెప్పారు.



శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, ఆయన భార్య కల్పనా దాస్

మోదీ నుంచి మోర్బీ వరకు...

గుజరాత్ ఎన్నికలపై ప్రభావం చూపించే కీలక అంశాలివే..

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో హోరాహోరీ పోరు నెలకొంది. తొలిసారిగా ఎన్నికల్లో ముక్కోణపు పోటీ జరుగుతూ ఉండడంతో ప్రతీ అంశమూ ఎన్నికల చుట్టూనే తిరుగుతోంది. ముఖ్యంగా అధికార బీజేపీ ఎదుర్కోవాల్సిన సవాళ్లు ఆ పార్టీకి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అధిక ధరలు, నిరుద్యోగం దగ్గర్నుంచి ఇటీవల జరిగిన మోర్బీ కేబుల్ వంతెన దుర్ఘటన వరకు ఎన్నో అంశాలు ఈ ఎన్నికలపై ప్రభావాన్ని చూపించనున్నాయి. అవేంటో చూద్దాం..



1 అధికార వ్యతిరేకత

రాష్ట్రంలో 1998 నుంచి అంటే 24 ఏళ్లుగా కొనసాగుతున్న బీజేపీ ప్రభుత్వంపై అధికార వ్యతిరేకత చాలా ఎక్కువగా ఉంది. ప్రభుత్వంపై వివిధ వర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. పెరిగిపోతున్న ధరలు, నిరుద్యోగం, తడిసిమోపెడైన జీవన వ్యయం, నాసిరకమైన రోడ్లు, విద్య, ఆరోగ్య రంగాల్లో నాణ్యతా ప్రమాణాలు పడిపోవడం వంటివన్నీ ఈ సారి ఎన్నికల్లో ఓటర్లపై పడనున్నాయి. రాష్ట్ర ప్రజలు మార్పుని కోరుకుంటున్నారనే విశ్లేషణలు వినబడుతున్నాయి.

2 మోదీ ఇమేజ్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇమేజ్ ఈ ఎన్నికల్లో అత్యంత కీలక అంశం కానుంది. మోదీ రాష్ట్రాన్ని విడిచిపెట్టి ఎనిమిదేళ్లవుతున్నప్పటికీ ప్రజల్లో ఆయనకున్న ఛరిష్మా తగ్గలేదు. 2001 నుంచి 2014 వరకు ఆయన రాష్ట్రాన్ని నడిపించిన తీరు, అంతర్జాతీయంగా మోదీకి ఉన్న పేరు ప్రతిష్టలు గుజరాత్ ఎన్నికలపై ప్రభావాన్ని చూపిస్తాయి. ఈ గుజరాత్ మనం తయారు చేసుకున్నదే అంటూ మోదీ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గుజరాత్ మోడల్‌నే అన్ని రాష్ట్రాల్లోనూ అమలు చేస్తామని చెబుతూ ఉండడం గమనార్హం.

3 బిల్కిస్ బానో దోషుల విడుదల

గుజరాత్ మత ఘర్షణల సమయంలో జరిగిన బిల్కిస్ బానో గ్యాంగ్ రేప్ దోషులను శిక్షా కాలం కంటే ముందుగానే విడిచిపెట్టడం రాష్ట్రంలో కలకలం సృష్టించింది. ముస్లిం వర్గంపై దీని ప్రభావం అత్యధికంగా ఉంది. 6.5 కోట్లున్న గుజరాత్ జనాభాలో ముస్లింలు 11% ఉన్నారు. 25 అసెంబ్లీ స్థానాల్లో వీరు ప్రభావం చూపించగలరు. బిల్కిస్ బానోకి న్యాయం జరగాలని వీరు చేస్తున్న ఆందోళనలు ఎన్నికల్లో ఎలాంటి ప్రభావం చూపిస్తాయన్న చర్చ జరుగుతోంది.

4 కరెంట్ కష్టాలు

దేశంలో కరెంట్ చార్జీలు అత్యంత ఎక్కువగా ఉన్న రాష్ట్రం ఇది. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ నెల తిరిగేసరికల్లా వచ్చే బిల్లుని చూసి సామాన్యులు గుడ్లు తేలేస్తున్నారు. ఇక కమర్షియల్ విద్యుత్ టారిఫ్ కూడా చాలా ఎక్కువగా ఉంది. పరిశ్రమలకిచ్చే కరెంట్ చార్జీలు ఇతర రాష్ట్రాల్లో యూనిట్‌కి రూ.4 ఉంటే గుజరాత్‌లో ఏకంగా రూ.7.50గా ఉండడంతో వాణిజ్యవేత్తల్లో కూడా అసంతృప్తి నెలకొంది. ఆప్, కాంగ్రెస్ గృహాలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీలు ఇచ్చారు.

5 రైతు సమస్యలు

గుజరాత్ రాష్ట్రాన్ని గత రెండేళ్లుగా వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. పంట నీటిపాలై రైతులకు కడగండ్లే మిగులుతున్నాయి. అయినప్పటికీ వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం అందడం లేదు. ఇక అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో రైతుల దగ్గర్నుంచి ప్రభుత్వం భారీగా భూముల్ని సేకరించింది. అహ్మదాబాద్, ముంబై బుల్లెట్ రైలు ప్రాజెక్టు, వడోదర, ముంబై ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టు కోసం చేసిన భూ సేకరణ వివాదాస్పదమైంది.

6 పేపర్ లీక్స్

ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిర్వహించే పరీక్ష పేపర్ల లీకేజీ యువతలో తీవ్ర అసంతృప్తిని రాజేసింది. తరచుగా పేపర్స్ లీక్ కావడం పరీక్షలు వాయిదా పడడం నిరుద్యోగుల ఆశల్ని అడియాసలు చేస్తోంది. గత ఏడేళ్ల కాలంలో ఎనిమిది సార్లు వివిధ పరీక్షలకు సంబంధించిన పేపర్లు లీకయ్యాయి.

గుజరాత్ సమరం

7 మోర్బీ వంతెన దుర్ఘటన

సౌరాష్ట్ర ప్రాంతంలోని మోర్బీ కేబుల్ బ్రిడ్జి అక్టోబర్ 30న కుప్పకూలిపోయి 135 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన కూడా ఈ సారి ఎన్నికల్లో ప్రధాన అంశంగా మారింది. కాంట్రాక్టులు, స్థానిక ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరగడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. బీజేపీ ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేకి బదులుగా ప్రమాద సమయంలో నదిలోకి దూకి ప్రాణాలను కాపాడిన మాజీ ఎమ్మెల్యేల కాంతి అమృతియకు టికెట్ ఇవ్వడం చూస్తేనే దీని ప్రభావం ఎంత ఉందనేది అర్థమవుతుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

రాహుల్‌పై పరువు నష్టం కేసు

సావర్కర్ వ్యతిరేక వ్యాఖ్యలపై నిరసనలు

థానె/పుణే: స్వాతంత్ర్య యోధుడు వినాయక్ దామోదర్(వీడీ) సావర్కర్‌ను అవమానిస్తూ వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై మహారాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేశారు. సీఎం షిండే సారథ్యంలోని శివసేన వర్గం నేత వందనా డోంగ్రే ఫిర్యాదు మేరకు థానె నగర్ పోలీస్ స్టేషన్‌లో గురువారం సెక్షన్లు– 500, 501 ప్రకారం పరువు నష్టం కేసు నమోదు చేశారు. సావర్కర్‌ను కించపరచడం ద్వారా రాహుల్ ప్రజల మనోభావాలను గాయపరిచినట్లు వందన ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సావర్కర్ మనవడు రంజిత్ సావర్కర్ కూడా రాహుల్ గాంధీపై గురువారం ముంబై పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. రాహుల్ సారథ్యంలో కాంగ్రెస్ చేపట్టిన భారత్ జోడో యాత్ర ప్రస్తుతం మహారాష్ట్రలో కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం రాహుల్ అకోలాలో మీడియాతో మాట్లాడారు. సావర్కర్ బ్రిటిష్ పాలకులకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీతోపాటు శివసేన షిండే వర్గం శ్రేణులు నిరసనలు తెలుపుతున్నాయి. శుక్రవారం బీజేపీ కార్యకర్తలు పుణెలోని కాంగ్రెస్ కార్యాలయంలోని రాహుల్ ఫొటోలకు నల్లరంగు పులిమేందుకు యత్నించారు. పోలీసులు సుమారు 15 మంది కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. పుణే స్వర్‌గేట్ ఏరియాలోని సావర్కర్ మెమోరియల్ వద్ద మాఫీవీర్(క్షమాభిక్ష కోరేవాడు) అంటూ రాసిన ఇద్దరు కాంగ్రెస్ కార్యకర్తలపై కేసు నమోదు చేశారు.

రాహుల్ గాంధీని హత్య చేస్తాం

ఇండోర్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు కమల్ నాథ్‌ను హత్య చేస్తామంటూ బెదిరింపు లేఖ బహిర్గతం కావడం కలకలం సృష్టించింది. జోడో యాత్రలో బాంబు పేలుళ్లకు పాల్పడతామని లేఖలో గుర్తు తెలియని వ్యక్తులు హెచ్చరించారు. ఆ లేఖ ఆకతాయిల పనిగా పోలీసులు అనంతరం తేల్చారు.

ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?

ప్రధాని మోదీని ప్రశ్నించిన ఖర్గే

న్యూఢిల్లీ: ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలను కల్పిస్తామంటూ ఇచ్చిన హామీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీని నిలదీశారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ విభాగాల్లో 30 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉండగా ప్రధాని మోదీ కేవలం 75 వేల నియామక పత్రాలను మాత్రమే పంపిణీ చేశారని ఖర్గే పేర్కొన్నారు. 'ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామంటూ ప్రధాని మోదీ వాగ్దానం చేశారు. 8 ఏళ్లలో 16 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వ విభాగాల్లో 30 లక్షలకుపైగా ఖాళీలున్నాయి. ఇప్పటివరకు మోదీ ఇచ్చింది మాత్రం 75 వేల ఉద్యోగ నియామక పత్రాలే' అని ఖర్గే ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ప్రత్యక్షంగా పీఎంవో ఆజమాయిషీలో ఉండే సెంట్రల్ సెక్రటేరియట్‌లో 1,600 పోస్టులు ఖాళీగా ఉండడమేంటని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు.

మద్యం సేవించి విధులకు రావొద్దు

డిక్లరేషన్ సమర్పించండి • ఛత్తీస్‌గఢ్‌లో టీచర్లకు విద్యా శాఖ ఆదేశం

జాస్పూర్: దేశంలో కొన్ని ప్రాంతాల్లో ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది మద్యం సేవించి విధులకు హాజరవుతుండడంతో విద్యా బోధన కుంటుపడుతోంది. మద్యం మత్తులో తూలుతున్న టీచర్ల తీరుతో విద్యార్థులు ప్రభావితమవుతున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో గిరిజన జనాభా అధికంగా ఉన్న జాస్పూర్ జిల్లాలో ఈ సమస్య మరింత ముదరడంతో ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. మద్యం సేవించి విధులకు రావొద్దని తేల్చిచెప్పింది. మద్యం మత్తులో విధులకు హాజరుకాబోమంటూ ఈ నెల 24వ తేదీ నాటికల్లా డిక్లరేషన్ సమర్పించాలని ఛత్తీస్‌గఢ్ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. జాస్పూర్ జిల్లాలో దాదాపు 30,000 మంది ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. వీరంతా డిక్లరేషన్ సమర్పించాల్సి ఉంటుందని డీఈఓ మధూలిక తివారీ చెప్పారు. మద్యం మత్తులో పాఠాలు చెబుతూ దొరికిపోయిన కొందరు టీచర్లను ఇప్పటికే సస్పెండ్ చేశామని, మరికొందరికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ సివిల్ సర్వీసెస్ కాండక్ట్ రూల్స్–1965లోని రూల్ 23 ప్రకారం.. ప్రభుత్వ ఉద్యోగులు మద్యం కానీ, ఇతర మత్తు పదార్థాలు కానీ సేవించి విధులకు హాజరు కాకూడదు. మత్తులో ఉండి విధులు నిర్వర్తించకూడదు.

గిరిజనుల అభివృద్ధికి సహకరించండి

- కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండాకు డిప్యూటీ సీఎం రాజన్నదొర విజ్ఞప్తి



కేంద్రమంత్రి అర్జున్ ముండాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రాజన్న దొర

సాక్షి, న్యూఢిల్లీ/అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజనుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక చర్యలు చేపడుతున్నారని, ఇందుకు కేంద్రం కూడా పూర్తి సహకారం అందించాలని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అర్జున్ ముండాకు ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో శుక్రవారం కేంద్ర మంత్రిని రాజన్నదొర కలిసి రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల కేటాయింపుపై చర్చించారు. గిరిజన విద్యా సంస్థలలో మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అటవీ ప్రాంతంలోని గిరిజనులకు 180 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించి ఆదుకోవాలన్నారు.

'వామనరావు' నిందితుల బెయిల్‌పై స్పందన తెలపండి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో న్యాయవాద దంపతులు గట్టు వామనరావు, గట్టు నాగమణిల హత్య కేసు నిందితులు ఉడారి లక్ష్మణ్, అక్కపాక కుమార్‌లకు బెయిల్ మంజూరుపై స్పందన తెలపాలని సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. బెయిల్ కోరుతూ లక్ష్మణ్ దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం జస్టిస్ ఏఎస్ బోపన్న, జస్టిస్ పమిడి ఘంటం శ్రీనరసింహలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. న్యాయవాద దంపతుల హత్య కేసులో కుమార్ ఏ3, లక్ష్మణ్ ఏ5గా ఉన్నారు.

మీకు చెప్పు చూపించాలి..
కానీ.. నాకు సభ్యత ఉంది

- కర్నూలు పర్యటనలో ఊగిపోయిన ప్రతిపక్ష నేత చంద్రబాబు



కర్నూలులో చంద్రబాబు గో బ్యాక్ అంటూ ధర్నా చేస్తున్న ప్రజలు, న్యాయవాదులు (ఇన్‌సెట్‌లో) చంద్రబాబు కాన్వాయ్‌కి అడ్డుపడిన యువకులు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: 'తమ్ముళ్లు నన్ను రెచ్చగొడుతున్నారు. నన్ను రెచ్చగొట్టిన వాళ్ల పతనమవడం ఖాయం. నాకు వచ్చిన కోపానికి చెప్పు చూపించాలి. కానీ చూపించలేదు. అది నా సభ్యత. నాకు హుందాతనం ఉంది' అని అంటూనే పచ్చి బూతులు, రెచ్చగొట్టే మాటలతో టీడీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత చంద్రబాబు ఆగ్రహంతో ఊగిపోయారు. 'పనికి మాలిన వ్యక్తుల్లారా.. నేరాలు ఘోరాలు చేసే దరిద్రుల్లారా.. రేయ్ వాన్ని తన్ను.. రేయ్ రారా చూపిస్తా.. మా ఆఫీసుకే వస్తార్రా మీరు.. ఎంత ధైర్యం రా నీకు.. ధైర్యం ఉంటే రాండ్రా గాడిదల్లారా.. బోడి నా కొడుకులు తమాషాలాడుతారా.. రౌడీలకే రౌడీనిరా నేను.. తరిమి తరిమికొట్టిస్తా.. గుడ్డలిప్పదీసి కొట్టిస్తా.. పోలీసులు చొక్కాలిప్పేసి నిద్రపోండి.. ఎందుకు మీకు పోలీసు ఉద్యోగం.. మీతో కాకపోతే నేనే తేల్చుకుంటా.. దద్దమ్మ సీఎం.. పనికి మాలిన సీఎం.. రౌడీ సీఎం.. ఇదేమన్నా పులివెందుల అనుకుంటున్నావా?' అని నోటికొచ్చినట్లు మాట్లాడారు. కర్నూలులో పర్యటిస్తూ.. కర్నూలుకు న్యాయ రాజధాని వద్దని, అన్నీ ఒక్క అమరావతిలోనే ఉండాలని చెప్పడం భావ్యం కాదని విన్నవించడానికి వచ్చిన న్యాయవాదులు, విద్యార్థులను చూసి చంద్రబాబు ఇలా రెచ్చిపోయారు.

అడుగడుగునా నిరసనలే

మూడు రోజుల కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబుకు తొలిరోజు నుంచీ అడుగడుగునా నిరసన సెగ తగులుతూనే ఉంది. దేవనకొండ సర్కిల్, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరులో బాబు పర్యటనకు అడ్డుపడిన న్యాయవాదులు, విద్యార్థి సంఘాలు, జేఏసీ నేతలు.. చివరి రోజు శుక్రవారం తీవ్ర స్థాయిలో ప్రతిఘటించారు. ఉదయం ఓ హోటల్లో టీడీపీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించిన చంద్రబాబు మధ్యాహ్నం 2.40 గంటలకు టీడీపీ ఆఫీసుకు బయల్దేరారు. బుధవారపేటకు రాగానే 'న్యాయ రాజధాని'ని కాంక్షించే ప్రజలు, విద్యార్థులు కాన్వాయ్‌కి అడ్డుతగిలారు. అక్కడి నుండి కలెక్టరేట్ సర్కిల్‌కు రాగానే వందలాది విద్యార్థులు కాన్వాయ్‌కి అడ్డంగా పడుకున్నారు. పోలీసులు వారిని బలవంతంగా లాగేశారు. అక్కడి నుండి గాయత్రి ఎస్టేట్‌లోని టీడీపీ ఆఫీసుకు చంద్రబాబు చేరుకున్నారు. ఇక్కడ కూడా న్యాయవాదులు, విద్యార్థి సంఘాలు, జేఏసీ సభ్యులతో పాటు కుల, ప్రజా సంఘాల నేతలు భారీగా తరలివచ్చి టీడీపీ ఆఫీసులోకి చొరబడే ప్రయత్నం చేశారు. నల్లబెలూన్లు గాలిలోకి ఎగరేశారు. నల్లజెండాలు చేతపట్టుకుని, రాయలసీమ ద్రోహి చంద్రబాబు అని ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. చంద్రబాబు వీరందరినీ చూస్తూ ఒక్కసారిగా సహనం కోల్పోయారు. 'మన ఏకైక రాజధాని అమరావతే. తమ్ముళ్లూ ఇదే విషయం వారికి చెప్పండి. వారిని తన్నండి.. బట్టలూడదీసి కొట్టండి. మీ చేతకాకపోతే నేను వస్తా.. వారి కథ తేలుస్తా' అని కార్యకర్తలను రెచ్చగొట్టారు. దీంతో టీడీపీ శ్రేణులు అమరావతే రాజధాని అంటూ నినాదాలు చేశాయి.

రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు

చంద్రబాబు వ్యాఖ్యలతో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాలు, న్యాయవాదులు, జేఏసీ నేతలపై దాడి చేసేందుకు దూసుకొచ్చారు. ఇదంతా చూస్తున్న చంద్రబాబు.. వారిని మరింత రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. దీంతో జేఏసీ నేతలు, టీడీపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ దశలో పోలీసులతో పాటు జిల్లా ఎస్పీపై కూడా చంద్రబాబు నోరు పారేసుకున్నారు. 'పోలీసులూ నిద్రపోండి. మీరు బట్టలిప్పేయండి. ఎందుకు మీకు పోలీసు ఉద్యోగం. ఎస్పీ ఏం చేస్తున్నారు ఇక్కడ? ఎవరికి కాపలా కాస్తున్నారు? రౌడీలకు అండగా ఉంటారా? నీకు ఐపీఎస్ ఇచ్చిందే దండగ' అంటూ పరుష పదజాలంతో దూషించారు.

మందు, బిర్యానీ ఇచ్చింటారు..

'ఇది పేటీఎం బ్యాచ్.. క్వార్టర్ మందు, బిర్యానీ ఇస్తారు. దీంతో పరిగెత్తుకుంటూ వచ్చారు. ఈ రోజు కూడా వీరందరికీ క్వార్టర్, బిర్యానీలు ఇచ్చి ఉంటారు' అని చంద్రబాబు.. జేఏసీ నేతలు, విద్యార్థి సంఘాలు, న్యాయవాదులు, ఇతర సంఘాల నేతల ఉద్యమాన్ని హేళన చేస్తూ మాట్లాడారు. 'నేను పార్టీ ఆఫీసుకు వస్తే నలుగురు వచ్చి బెదిరించాలని చూస్తారా? రౌడీయిజాన్ని అణిచివేస్తా. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతా. నేను కుప్పానికి వెళ్లినా రౌడీలను తీసుకొస్తున్నారు. ఎక్కడికి వస్తారా? నన్ను రాయలసీమ ద్రోహి అంటారా? రాయలసీమను రతనాల సీమగా మార్చే పార్టీ టీడీపీ. రాయలసీమను దోపిడీ చేసిన వ్యక్తి జగన్. కులాల మధ్య చిచ్చుపెట్టి చలికాచుకుని నువ్వు రాజకీయం చేస్తావా? మర్యాదకు మర్యాద, దెబ్బకు దెబ్బ. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు నా ప్రాణాన్ని లెక్క చేయను. 23 బాంబులకే భయపడలేదు. నేను కనుసైగ చేస్తే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలకు బట్టలు ఊడదీయిస్తారు. పోలీసు వ్యవస్థ నాశనమైంది. పతనమైంది. నా పర్యటనలకు వస్తున్న స్పందన చూసి వైఎస్సార్ సీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అందుకే నన్ను అడ్డుకోవాలని ఐదు, పది మంది వస్తున్నారు. మా తమ్ముళ్లు కన్నెర్ర చేస్తే వీరు పారిపోవడం ఖాయం. కర్నూలును అభివృద్ధి చేసింది నేనే' అని చెప్పుకొచ్చారు.

నువ్వా.. మూడు రాజధానులు నిర్మించేది?

'టిడ్కో ద్వారా 10 వేల ఇళ్లు ఇచ్చా. చేతనైతే వాటిని పూర్తి చేసి పేదలకు ఇవ్వు. 90 శాతం నేను పూర్తి చేస్తే 10 శాతం పూర్తి చేయలేకపోయావు. 10 శాతం ఇళ్లు పూర్తి చేయలేని నువ్వు మూడు రాజధానులు కడతావా? ఏమి మనిషివయ్యా.. నీ పుట్టుకే అబద్ధాల పుట్టుక. నీ చరిత్రే నేర చరిత్ర. నేరగాళ్లను పట్టుకునే పార్టీ టీడీపీ. జగన్ అమరావతి రాజధానిగా ఒప్పుకున్నాడా? లేదా? ఓడిపోతాననే పిరికితనంతో ఇప్పుడు మూడు ప్రాంతాల్లో చిచ్చుపెట్టి పచ్చని కాపురాలు నాశనం చేయాలనుకుంటున్నావు. నాలుగేళ్ల నీ పాలనలో ఒక్క రూపాయి పనైనా కర్నూలులో చేశావా? మద్యం, భూములు, భూగర్భ సంపద మీకే కావాలి. పేరు రాయలసీమది, దోపిడీ జగన్‌ది' అంటూ సీఎంపై నోరు పారేసుకున్నారు. నాతో ఎవరైనా పెట్టుకుంటే అదే వారికి చివరి రోజు. రాజశేఖరరెడ్డి లాంటోళ్లే నాతో పెట్టుకోలేదు. వీరెంత.. అవసరమైతే కర్నూలులోనే బస చేస్తా.. ఎవరెవరు ఏం చేశారో చెబుతా.. నువ్వేం చేశావో చెప్పే ధైర్యం ఉంటే పేపర్‌కు ఇవ్వు.. నేనేం చేశానో ఇస్తా.. కర్నూలు ప్రజలే నిర్ణయిస్తారు. రాయలసీమలో ముఠా నేతలను అణిచి వేసిన పార్టీ టీడీపీ' అని అన్నారు. అంతకు ముందు ఆయన టిడ్కో ఇళ్ల సముదాయాన్ని, తాండ్రపాడులోని చెరువును పరిశీలించారు.

బలభద్రపురం ఘటనపై విచారణ

బిక్కవోలు: తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురం ఘటనపై శుక్రవారం ప్రభుత్వ కార్యదర్శి ఇంతియాజ్ విచారణ జరిపారు. స్థలం ఆక్రమణ వివాదంలో ఇటీవల తల్లీకొడుకులు పురుగుమందు తాగగా, వారిలో కోటిపల్లి కామాక్షమ్మ కాకినాడలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇంతియాజ్ వచ్చి విచారణ నిర్వహించారు. వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. ఎంపీడీవో జేఏ ఝాన్సీ, తహసీల్దార్ పోసిబాబు, ఎస్‌ఐ పి.బుజ్జిబాబు, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి తదితరులతో ఆయన మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

చెయ్యేరు వరద బాధితుల ఇళ్ల కోసం రూ.22కోట్లు

రాజంపేట: అన్నమయ్య జిల్లా చెయ్యేరు వరద బాధితుల ఇళ్ల నిర్మాణం కోసం రూ.22కోట్లు నిధులు మంజూరయ్యాయని గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టరు శివయ్య తెలిపారు. ఆయన శుక్రవారం పులపత్తూరు సర్పంచి జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. పూర్తిగా ఇళ్లు కొట్టుకుపోయిన 446 మందికి ఇంటికి రూ.5లక్షల చొప్పున నిధులు విడుదలైనట్లు తెలిపారు.

తెలంగాణ

కారు వర్సెస్ కమలం

- మళ్లీ మొదలైన రాజకీయ యుద్ధం
- మాటల తూటాలు, దాడులతో హీటెక్కుతున్న పరిణామాలు
- ఎమ్మెల్సీ కవితపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్
- ప్రతిగా ఆయన ఇంటిపై టీఆర్‌ఎస్ శ్రేణుల దాడితో ఉద్రిక్తత
- చెప్పుతో కొడతానన్న కవిత.. దీటుగా స్పందించిన అర్వింద్

సాక్షి, హైదరాబాద్: కారు, కమలం పార్టీల మధ్య రాజకీయ రగడ ముదిరి పాకాన పడుతోంది. ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం పరాకాష్ఠకు చేరుతోంది. రెండు ప్రధాన పార్టీల మధ్య గొడవలు రాజకీయ వేడిని పెంచుతున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్‌ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. నువ్వా? నేనా? అన్నట్టుగా తలపడుతున్నాయి. ఎమ్మెల్సీ కవితనుద్దేశించి నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం, శుక్రవారం ఆయన నివాసంపై గులాబీ దళం దాడికి దిగడం, పిచ్చిపిచ్చిగా మాట్లాడితే చెప్పుతో కొడతానని, కొట్టి కొట్టి సంపుతం అంటూ అర్వింద్‌పై కవిత తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడం వంటి పరిణామాల నేపథ్యంలో.. రాష్ట్రంలో రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. ఎక్కడ పోటీ చేసినా వెంట పడి ఓడిస్తానని కవిత పేర్కొనగా, 'తగ్గేదేలే..' అన్నట్టుగా తాను మళ్లీ నిజామాబాద్‌లోనే పోటీ చేస్తానని, దమ్ముంటే ఓడించాలంటూ ధర్మపురి సవాల్ చేశారు. అర్వింద్‌కు మద్దతుగా బీజేపీ జాతీయ, రాష్ట్ర నేతలు రంగంలోకి దిగారు. ఆయన ఇంటిపై దాడిని ఖండించారు. టీఆర్‌ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సీఎం కేసీఆర్ లక్ష్యంగా కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి విమర్శలు గుప్పించారు. అండర్ గ్రౌండ్ చీఫ్ మినిస్టర్ అని, కుటుంబ పాలన సాగిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్వయంగా అర్వింద్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. బీజేపీ కార్యకర్తలు పలుచోట్ల కవిత దిష్టిబొమ్మలు దహనం చేశారు. దాడి ఘటనపై కోర్టుకు వెళతామని ప్రహ్లాద్ జోషి చెప్పగా, దీనిపై తనకు సమగ్ర నివేదిక సమర్పించాల్సిందిగా డీజీపీని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఆదేశించడం పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తోంది. మరోవైపు టీఆర్‌ఎస్ నేతలు కూడా బీజేపీపై విమర్శల దాడికి దిగారు. మరో ప్రధాన పార్టీ కాంగ్రెస్ మాత్రం..ఇదంతా టీఆర్‌ఎస్, బీజేపీల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకేనని విమర్శిస్తోంది. మొత్తం మీద మునుగోడు ఉప ఎన్నిక ముగియడంతో కొన్నాళ్లు ప్రశాంత వాతావరణం నెలకొంటుందని అంతా భావించారు. కానీ మాటల తూటాల దశ దాటి దాడుల వరకు వెళ్లడం, మళ్లీ రాజకీయ యుద్ధం మొదలవడంతో.. భవిష్యత్తులో ఏం జరుగుతుందోనన్న చర్చ జరుగుతోంది.

వెలుగుల మాటున నలిగిన బతుకులు

- ఖతర్‌లో స్టేడియంలలో ఫీఫా పనులు చేస్తూ ప్రమాదాలు, పని ఒత్తిడితో మరణించిన వలస కార్మికులు
- మృతుల కుటుంబాలకు నయాపైసా పరిహారం ఇవ్వని అక్కడి ప్రభుత్వం

మోర్తాడ్ (బాల్కొండ): నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం వెల్మల్‌వాసి కల్లెడ రమేశ్(50) ఖతర్‌లోని బూమ్ ఇంటర్నేషనల్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తూ 2016లో తీవ్ర అనారోగ్యానికి గురై మరణించాడు. ఫుట్‌బాల్ కప్(ఫీఫా) టోర్నీకి సంబంధించిన విధుల్లో పనిగంటలను విపరీతంగా పెంచడంతో తీవ్ర ఒత్తిడికి గురికావడమే కారణం. రమేశ్ కుటుంబానికి ఖతర్ ప్రభుత్వం, కంపెనీ పరిహారం చెల్లించలేదు. ఇతని మృతితో కుటుంబానికి పెద్దదిక్కు లేకుండా పోయింది.

- జగిత్యాల్ జిల్లా మల్లాపూర్ మండలం ఫ్యాక్టరీ చిట్టాపూర్‌కు చెందిన సురకంటి జగన్(32) 2021 నవంబర్ 11లో ఖతర్‌లో ఫుట్‌బాల్ స్టేడియంలో పైప్‌లైన్ పనులు చేస్తుండగా మట్టిపెల్లలు కూలి సమాధి అయ్యాడు. అతని భార్య, కూతురు, కొడుకులు పెద్ద దిక్కును కోల్పోయారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకూ ఆధారం లేకుండా పోయింది.
- జగిత్యాల్ జిల్లా కొడిమ్యాల మండలం తిప్పాయిపల్లికి చెందిన నరుకుల్ల శ్రీనివాస్(30) 2020 జనవరి 4న ఖతర్ ఫుట్‌బాల్ స్టేడియంలో టవర్ క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తుండగా మరణించాడు. అతని మరణంతో భార్య అనిత, ఇతర కుటుంబసభ్యులు కుంగిపోతున్నారు. ఫీఫా పోటీల కోసం ఖతర్ ప్రభుత్వం చేపట్టిన భారీ ప్రాజెక్టుల్లో పని కోసం వెళ్లి ప్రమాదాలు, పని ఒత్తిడితో తీవ్ర అనారోగ్యానికి గురికావడం, అనుమానాస్పద స్థితిలో మరణించిన మన దేశ వలస కార్మికుల సంఖ్య 2,800 వరకు ఉంటుందని అంచనా. ఆసియా దేశాలకు సంబంధించిన వలస కార్మికులు ఖతర్‌లో గడచిన పదేళ్లలో 6,500 మంది మరణించారని వలస కార్మికుల సంఘాలు పేర్కొంటున్నాయి. ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న ప్రపంచ ఫుట్‌బాల్ కప్(ఫీఫా) పోటీల కోసం ఖతర్ ప్రభుత్వం దాదాపు రూ.16 వేల కోట్లకుపైగా ఖర్చు చేస్తోంది. అయినా వలస కార్మికుల కుటుంబాలకు మాత్రం పరిహారం చెల్లించడంలో నిర్లక్ష్యం వహించిందనే ఆరోపణలు వస్తున్నాయి. వాటిని సహజ మరణాలుగానే ధ్రువీకరించడం గమనార్హం. ఫీఫా పనుల కోసం ఖతర్ ప్రభుత్వం వివిధ కంపెనీలకు పదేళ్ల కిందటే కాంట్రాక్టులు ఇచ్చింది.

బాబు కాన్వాయ్‌లో రాళ్లు.. కర్రలు!

- చంద్రబాబు మనుషులే సీమ విద్యార్థులపై దాడి చేశారు: ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్
- బాబు ముమ్మాటికీ రాయలసీమ ద్రోహి
- న్యాయ రాజధానిగా అంగీకరించాకే కర్నూలుకు రావాలి
- మేం రౌడీలమే అయితే ఆయన కర్నూలు దాటేవారా?
- బాబు చివరి ఎన్నికలు 2019లోనే పూర్తయ్యాయి: కర్నూలు మేయర్ రామయ్య



మాట్లాడుతున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, పక్కన మేయర్ బీవై రామయ్య

కర్నూలు (రాజ్‌విహార్): టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఒక పథకం ప్రకారమే కర్నూలుకు వచ్చి రాయలసీమ విద్యార్థులను రెచ్చగొట్టారని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్ ఖాన్ పేర్కొన్నారు. చంద్రబాబు తన కాన్వాయ్‌లో రాళ్లు, కర్రలు తెచ్చారని, ఆయన కాన్వాయ్ నుంచే న్యాయవాదుల జేఏసీపై రాళ్లు రువ్వారని స్పష్టం చేశారు. నిజంగా విద్యార్థులు సంయమనం కోల్పోయి దాడి చేసి ఉంటే చంద్రబాబు కర్నూలు దాటి వెళ్లగలిగేవారా? అని ప్రశ్నించారు. కర్నూలుకు హైకోర్టు రాకుండా అడ్డుకోవద్దని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాలు శాంతియుతంగా నిరసన తెలిపితే దాడులకు పురిగొల్పడం చంద్రబాబు రౌడీయిజానికి నిదర్శనమన్నారు. వందేళ్లుగా న్యాయ రాజధాని కోసం పోరాటం చేస్తుంటే చంద్రబాబు మాత్రం మరో వందేళ్లు రాయలసీమ వెనుకబడే ఉండాలని కోరుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కర్నూలులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మేయర్ బీవై రామయ్యతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు.

బాబు క్రూరత్వం తెలిసింది..

'చంద్రబాబు కర్నూలుకు హైకోర్టు కాదు కదా కనీసం హైకోర్టు బెంచ్ కూడా ఇవ్వలేకపోయారు. సీఎం జగన్ ఇస్తుంటే అడ్డుపడొద్దు. సీమ ప్రజలు బాంబులు, కత్తులు తీసుకుని తిరుగుతారు. ఫ్యాక్షనిస్టులు అని ముద్ర వేసేందుకే చంద్రబాబు ఒక పథకం ప్రకారం కర్నూలులో డ్రామాలాడారు. ప్రజలు ఆయన ట్రాప్‌లో పడకుండా శాంతియుతంగా నిరసన తెలిపి కర్నూలు వాసుల మంచితనాన్ని చాటుకున్నారు. చంద్రబాబులో ఉండే క్రూరత్వం, అసహనం, రెండు నాల్కల ధోరణిని ప్రజలంతా ఇవాళ గమనించారు. పార్టీ నేతలకు స్వయంగా ఆయనే బూతులు నేర్పిస్తున్నట్లు తేటతెల్లమైంది. రాయలసీమలో హత్యలకు కారకుడు చంద్రబాబే' అని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ పేర్కొన్నారు.

బాబుకు గుణపాఠం తప్పదు..

తనకు 40 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉందని చెప్పుకునే చంద్రబాబు సీమకు ఏం చేశారో చెప్పాలని కర్నూలు మేయర్ బీవై రామయ్య డిమాండ్ చేశారు. రాయలసీమ వాసుల బతుకులు మార్చిన ఘనత దివంగత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. ఫ్యాక్షన్ గొడవలను రూపుమాపి నీటి పారుదల ప్రాజెక్టులు పూర్తి చేయడంతో అందరూ వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కుళ్లు, కుటిల రాజకీయాలు మినహా ఈ ప్రాంతానికి ఏమీ చేయని చంద్రబాబుకు చివరి ఎన్నికలు 2019లోనే పూర్తయ్యాయని వ్యాఖ్యానించారు. న్యాయ రాజధాని ఏర్పాటుకు మద్దతు ప్రకటించాకే చంద్రబాబు కర్నూలు రావాలని, లేదంటే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షురాలు సిత్రా సత్యనారాయణమ్మ, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పుట్టక ముందే డ్వాక్రా సంఘాలు

- వాటిని తానే ఏర్పాటు చేసినట్లు బాబు బిల్డప్
- మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్



సాక్షి, అమరావతి: 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు.. ఆ అనుభవంతో పచ్చి అబద్ధాలను ప్రచారం చేసుకుంటున్నాడని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ విమర్శించారు. విశాఖలో జరిగిన సభలో ప్రధాని మోదీ అసలు చంద్రబాబు ప్రస్తావనే తీసుకురాలేదన్నారు. డ్వాక్రా సంఘాలను చంద్రబాబే ఉద్ధరించినట్లు తన జేబు పత్రికల్లో అబద్ధాలు రాయించుకున్నాడని ఆమె మండిపడ్డారు. నిజానికి డ్వాక్రా సంఘాల మహిళలను నమ్మించి మోసంచేసిన ఘనుడు చంద్రబాబేనని, రుణమాఫీ పేరుతో పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలను నట్టేట ముంచాడని ఆమె ఆరోపించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఉషశ్రీ చరణ్ మీడియాతో మాట్లాడారు. ఆమె ఏమన్నారంటే.. డ్వాక్రా సంఘాలను తానే కనిపెట్టినట్లుగా చంద్రబాబు తప్పుడు ప్రచారం చేసుకుంటున్నాడు. నిజానికి.. డ్వాక్రా సంఘాలు మన దేశంలో 1982లో ఏర్పాటయ్యాయి. టీడీపీ పుట్టకముందే అవి పుట్టాయి. డ్వాక్రా మహిళలను వంచించిన దుర్మార్గుడు బాబు. చివరకు పావలా వడ్డీ రుణాలకు కూడా మంగళం పాడిన దగాకోరు. మహిళల సాధికారతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పని చేస్తున్నారు. కానీ, బాబుకు, పవన్‌కు జెండా, అజెండా లేదు. అందుకే వారు ప్రభుత్వంపై బురదజల్లుతున్నారు.

ఎంగిలి కాఫీలు తాగే రకం!

- చంద్రబాబుపై సోము వీర్రాజు ధ్వజం
- బాబును ప్రధాని పొగిడారని ఎవరు చెప్పారు?
- ఎవరో చేసినవీ చంద్రబాబు తానే చేశానంటారు
- పొదుపు సంఘాలు తెచ్చింది పీవీనే



మాట్లాడుతున్న సోము వీర్రాజు. పక్కన జీవీఎల్

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఎవరో చేసిన పనులను కూడా తానే చేసినట్లుగా చెప్పుకుంటారని, ఆయనో ఎంగిలి కాఫీలు తాగే రకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు వ్యాఖ్యానించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'పొదుపు సంఘాలను తానే ఏర్పాటు చేశానని చంద్రబాబు చెబుతున్నారు. ప్రధాని కూడా తనను పొగిడారని చెప్పుకుంటున్నారు. ప్రధాని అలా అన్నారని ఆయనకు ఎవరు చెప్పారు? పొదుపు సంఘాలను చంద్రబాబు ఏర్పాటు చేయలేదు. వాటిని ఏర్పాటు చేసింది దివంగత ప్రధాని పీవీ నరసింహారావు. 1991–95 మధ్య పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో పొదుపు సంఘాల వ్యవస్థను తెచ్చి రివాల్వింగ్ ఫండ్ మంజూరు విధానాన్ని ప్రవేశపెట్టారు. దేశంలో తొలిసారిగా శ్రీకాకుళం జిల్లాలోని ఓ కుగ్రామంలో ఒక ఎన్జీవో పొదుపు సంఘాలను ఏర్పాటు చేసింది. ఇప్పటికీ ఆ సంస్థ ఉంది. అందులో చంద్రబాబు ప్రమేయం ఏమీ లేదు. గ్రామీణ ప్రాంతాల్లో పీవీ వీటిని తీసుకొస్తే.. వాజ్‌పేయి వచ్చాక డ్వాక్రా పేరుతో పట్టణాల్లోనూ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. చంద్రబాబు మైక్ పట్టుకొని ఊగిపోతున్నారు. అదీ మన తడాఖా అంటున్నారు. ఏం తడాఖా..? అలాంటి వాటినే ఎంగిలి కాఫీలు తాగే రకాలు అంటారు' అని ధ్వజమెత్తారు.

ఇక ఇబ్బందులు ఉండవు..

బీజేపీ కార్యక్రమాలకు రాష్ట్రంలో పత్రికలు పెద్దగా కవరేజీ ఇవ్వడం లేదని సోము వీర్రాజు పేర్కొన్నారు. ప్రధాని మోదీతో పవన్‌కళ్యాణ్ సమావేశం తర్వాత తమ మిత్రపక్షం జనసేన కార్యక్రమాల కవరేజీ కూడా తగ్గించేశారని చెప్పారు. మోదీ, పవన్‌కళ్యాణ్ మధ్య పలు అంశాలపై చర్చ జరిగిందని, ఇక రెండు పార్టీల మధ్య ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. బీజేపీ, జనసేన ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించి పోరాడతాయన్నారు. పవన్‌కళ్యాణ్ కార్యక్రమాలను అధికారపార్టీ నేతలు నిరోధిస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వ సొమ్ము చర్చిలకు ఎలా కేటాయిస్తారని, దీనిపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.

బీసీలపై టీడీపీ తీరుకు నిదర్శనం: జీవీఎల్

టీడీపీ పూర్తి అభద్రతా భావంతో ఉందని జీవీఎల్ చెప్పారు. టీడీపీ ఏర్పాటు నుంచి పార్టీలో కొనసాగుతున్న యనమల లాంటి వారిని ఉద్దేశించి వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇవ్వబోమని లోకేశ్ ప్రకటించటాన్ని బట్టి బీసీల పట్ల వారి వైఖరి తెలుస్తోందన్నారు. బీజేపీ-జనసేన భాగస్వామ్యంతో 2024లో పొలిటికల్ బ్లాక్‌బస్టర్ రావడం ఖాయమన్నారు. సాధారణ రోజుల్లో పెద్దగా కనిపించని రూ.2 వేల నోట్లు తెలుగు రాష్ట్రాల ఎన్నికల సమయంలో పెద్దఎత్తున బయటకు రావడంపై కేంద్రానికి లేఖ రాస్తానని చెప్పారు. గన్నవరం విమానాశ్రయం టీడీపీ హయాంలో కూడా రాష్ట్ర పోలీసుల పర్యవేక్షణలోనే ఉందన్నారు. దీనిపై కేంద్ర విమానయాన మంత్రికి లేఖ రాస్తానని తెలిపారు.

క్లుప్తంగా

'సదరన్' డిస్కంకు జాతీయ అవార్డులు

- రెండు విభాగాల్లో ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రదానం



అవార్డును అందుకుంటున్న సంతోషరావు

సాక్షి, అమరావతి/తిరుపతి రూరల్: ఏపీ దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీసంస్థ (ఏపీ ఎస్పీడీసీఎల్)ను రెండు జాతీయస్థాయి అవార్డులు వరించాయి. ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన ఐసీసీ అవార్డ్స్–2022 వేడుకలో ఈ అవార్డులను సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు అందుకున్నారు. ఢిల్లీలోని ఇండియా హ్యాబిటేట్ సెంటర్లో ఐసీసీ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 18వ తేదీ వరకు 16వ ఇంధనసదస్సు నిర్వహించారు. వినియోగదారులకు అందిస్తున్న నాణ్యమైన సేవలు, వినియోగదారుల సాధికారత, సంస్థ పనితీరు మెరుగుదల అంశాల్లో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానాలకు ఎంపిక చేశారు.

ప్రత్యామ్నాయ వైద్యం ఆయుర్వేదం: గవర్నర్

సాక్షి, రాజమహేంద్రవరం: జీవనశైలిలో వస్తున్న మార్పులతో వ్యాధుల బారిన పడుతున్నారని, వాటిపై శారీరకంగా, మానసికంగా పోరాడేందుకు ప్రత్యామ్నాయ వైద్యంగా ఆయుర్వేదం నిలుస్తోందని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ, వినోబా సేవా ప్రతిష్ఠాన్ తో కలిసి విజయవాడలోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధనాసంస్థ (రారీ) రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన 'ఆయుర్వేద పర్వ్' జాతీయస్థాయి కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ వర్చువల్‌గా ప్రసంగించారు. మధుమేహం, మానసిక ఒత్తిడి, రక్తపోటులాంటి వ్యాధులకు పురాతన ఔషధ విధానం శరణ్యమన్నారు. గ్రామీణ ప్రాంతం ప్రజలకు ఆయుర్వేద వైద్యం అందేలా చూడాలని సూచించారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ రూ.3,500 కోట్లతో పేదలకు విశేష సేవలు అందిస్తోందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయుర్వేదిక్ పర్వ్ జాతీయ కన్వీనర్ మనోజ్ జిన్నా, స్టేట్ కన్వీనర్ బాలు తదితరులు పాల్గొన్నారు.

యాంటీ మైక్రోబియల్ అవగాహన వారోత్సవాలు

సాక్షి, అమరావతి: పశువులు, సన్నజీవాలు, పెంపుడు జంతువుల పోషకుల్లో యాంటీబయోటిక్స్ వినియోగంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నట్టు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) కంటైన్‌మెంట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు యాంటీ మైక్రోబియల్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'వారిని సంఘ బహిష్కరణ చేయాలి'

సాక్షి, అమరావతి: అనుమానం పేరిట మహిళల ప్రాణాల్ని తీసే సైకో భర్తల్ని సంఘ బహిష్కరణ చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలి, అనంతపురం జిల్లాలో అనుమానంతో మహిళల ప్రాణాల్ని పొట్టనబెట్టుకున్న ఉన్మాదుల చర్యలపై శుక్రవారం ఆమె స్పందించారు. ఇలాంటి దుర్మార్గుల ఆగడాలను ఖండించాలన్నారు.

ప్రతీ డివిజన్‌లో వ్యాపార సలహా మండళ్లు

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

సాక్షి, అమరావతి: ఇది వ్యాపార అనుకూల ప్రభుత్వమని, తనిఖీలు, దాడులు లేకుండా ప్రతీ ఒక్కరు బాధ్యతగా పన్ను చెల్లించేలా వ్యవస్థలో మార్పులు తీసుకువస్తున్నట్లు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. ఇందులో భాగంగా రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖను పూర్తిగా పునర్వ్యవస్థీకరించడంతో ప్రతీ డివిజన్ స్థాయిలో తొలిసారిగా వాణిజ్య సలహా మండళ్లను ఏర్పాటుచేశామన్నారు. విజయవాడలోని మూడు డివిజన్ల వాణిజ్య సలహా మండలి సమావేశంలో మంత్రి శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపార సంస్థల్లో తనిఖీలు, దాడులు లేకుండా పన్ను ఎగవేతదారులనే గుర్తించే విధంగా ప్రత్యేకంగా డేటా అనలిటిక్స్ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. విజయవాడలో ఫర్నిచర్ క్లస్టర్ ఏర్పాటునూ పరిశీలిస్తామన్నారు. సమావేశానంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీభాగ్ ఒడంబడిక ప్రకారం రాయలసీమలో రాజధాని లేదా హైకోర్టును ఏర్పాటుచేయాలని దీనికి కట్టుబడే కర్నూలులో హైకోర్టును ఏర్పాటుచేస్తున్నామన్నారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు చంద్రబాబు వ్యతిరేకమా అని ఆయన ప్రశ్నించారు.



ఎన్టీఆర్ జిల్లా నందిగామలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహనరావు



విశాఖ జిల్లా పీఎంపాలెంలో లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మన ప్రభుత్వం



కర్నూలు జిల్లా చింతకుంట గ్రామంలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



నెల్లూరు 5వ డివిజన్ ప్రగతినగర్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ఆర్టీసీలో ఇక అన్నీ ఈ - బస్సులే

వంద శాతం ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టాలని సీఎం జగన్ ఆదేశం

కాలుష్య నివారణ, ప్రజలకు మరింత ప్రయాణ సౌకర్యం లక్ష్యం



- ఐదేళ్లలో డీజిల్ బస్సుల స్థానంలో అన్నీ ఎలక్ట్రిక్ బస్సులే
- కార్యాచరణ సిద్ధం చేసి, సీఎంకి సమర్పించిన ఆర్టీసీ
- ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి
- డిస్కంలతో కలిసి ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు
- సింహాచలంలో ప్రత్యేక డిపో.. స్థలాన్ని పరిశీలించిన ఆర్టీసీ ఎండీ
- ఇకపై ఆర్టీసీ గ్యారేజీల్లో ప్రైవేటు బస్సులకు కూడా సర్వీసింగ్

సాక్షి,అమరావతి/గోపాలపట్నం/సింహాచలం

రాష్ట్ర ప్రజా రవాణా విభాగం (ఆర్టీసీ) పూర్తిగా ఈ - బాట పట్టనుంది. ఆర్టీసీలో డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు (ఈ–బస్సులు) రానున్నాయి. కాలుష్య నియంత్రణ, ప్రజలకు మరింత మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు ఈ–బస్సులను ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ–బస్సులను ప్రవేశపెట్టేందుకు ఆర్టీసీ నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఈ–బస్సుల కొనుగోలుపై చర్చించి కార్యాచరణను ఖరారు చేశారు. ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు సమర్పించారు. వాటిపై ముఖ్యమంత్రి సమీక్షించి, అనుమతినిచ్చారు. ఆర్టీసీ ఇప్పటికే తిరుమల–తిరుపతి మార్గంలో 100 ఈ–బస్సులను ప్రవేశపెట్టింది. వీటిపై ప్రయాణికుల నుంచి సానుకూల స్పందన లభిస్తోంది. ఇప్పుడు రాష్ట్రమంతటా ఈ–బస్సులను ప్రవేశపెట్టనుంది. ఈ–బస్సును ఒకసారి చార్జింగ్ చేస్తే ఒక రూట్‌లో రానుపోనూ ప్రయాణించవచ్చని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. డిస్కంలతో కలిసి ఈ–బస్సులకు చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మొదటి దశలో రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో, రెండో దశలో జిల్లా కేంద్రాల్లోని బస్ స్టేషన్లలో చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తారు. మూడో దశలో డివిజన్ కేంద్రాలు, రాష్ట్ర సరిహద్దు సమీపంలోని పట్టణాల్లోని బస్ స్టేషన్లలో ఏర్పాటు చేస్తారు.

రెండు దశల్లో 4 వేల ఈ-బస్సులు

ప్రస్తుతం ఆర్టీసీలో 11,214 డీజిల్ బస్సులున్నాయి. వాటి స్థానంలో దశల వారీగా ఈ–బస్సులను ప్రవేశపెడతారు. మొదటగా రెండు దశల్లో 4 వేల బస్సులు కొనాలని నిర్ణయించారు. 2023లో 2 వేల ఈ–బస్సులను ప్రవేశపెడతారు. ఇందు కోసం ఆర్టీసీ వచ్చే ఏడాది ప్రారంభంలో టెండర్ల ప్రక్రియ చేపట్టనుంది. 2024లో పరిస్థితిని సమీక్షించాక.. మరో 2 వేల బస్సులను ప్రవేశపెడతారు. అవసరమైతే ఆ సంఖ్యను పెంచుతారు. ముందుగా సిటీ సర్వీసులు, అంతర్రాష్ట్ర సర్వీసులు, దూర ప్రాంతాలకు నడపాలని భావిస్తున్నారు. ఐదేళ్లలో ఆర్టీసీలో డీజిల్ బస్సు అన్నదే లేకుండా పూర్తిగా ఈ–బస్సులనే నడపాలన్నది లక్ష్యం. వీటి కోసం విశాఖ నగరానికి సమీపంలోని సింహాచలం వద్ద సింహపురి లే అవుట్‌లో ఉన్న ఆర్టీసీ స్థలంలో ప్రత్యేక డిపో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ స్థలాన్ని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు గురువారం పరిశీలించారు.

ఉల్లంఘనలపై ఉక్రోషం

చిట్టీల సొమ్ము మళ్లించి మార్గదర్శి ఎదురుదాడి..

- సొంత అవసరాలకు చందాదారుల సొమ్ము వాడుకోవడం తప్పు కాదా?
- చట్ట ఉల్లంఘనలను ప్రభుత్వ ఏజెన్సీలు అంగీకరిస్తాయా?
- తప్పులు జరిగితే గుర్తించడం తప్పెలా అవుతుంది
- చిట్టీలు ఎవరు కడుతున్నారో కూడా చెప్పని మార్గదర్శి సిబ్బంది
- తనిఖీ బృందాలకు సహాయ నిరాకరణ
- బినామీ చందాదారులు ఉన్నట్లు బలపడుతున్న అనుమానాలు
- ఫోర్‌మెన్‌లను డమ్మీలుగా మార్చి అంతా హెడ్‌క్వార్టర్ నుంచి కంట్రోల్
- మార్గదర్శి సహా ఇతర చిట్‌ఫండ్ కంపెనీల్లోనూ తనిఖీలు



సాక్షి, అమరావతి: చిట్‌ఫండ్ చట్టాన్ని ధిక్కరించి ఇష్టానుసారం కంపెనీలు నడుపుతున్న మార్గదర్శి యాజమాన్యం తప్పులను కప్పిపుచ్చేందుకు మీడియా ముసుగులో ఎదురుదాడి చేస్తోంది. మార్గదర్శిలో జరిగిన ఉల్లంఘనలు, మోసాల గురించి స్పందించకుండా ప్రభుత్వం తమపై కక్ష సాధిస్తోందని గగ్గోలు పెడుతోంది. తనిఖీ అధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండా సహాయ నిరాకరణ చేస్తూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి దందాలు చేస్తాం.. అడగడానికి మీరెవరంటూ ఎదురు దాడికి దిగుతోంది.

మార్గదర్శి సహాయ నిరాకరణ

తనిఖీల సందర్భంగా మార్గదర్శి సిబ్బంది అధికారులకు సహకరించలేదు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సహాయ నిరాకరణ చేశారు. కనీసం చిట్‌లు ఎవరు కడుతున్నారో కూడా వెల్లడించలేదు. రికార్డులు చూపించకపోవడం, అడిగిన సమాచారం ఇవ్వకపోవడాన్ని బట్టి ఆ సంస్థలో ఇంకెన్ని మోసాలు జరిగాయోననే అనుమానాలు తనిఖీ అధికారుల నుంచి వ్యక్తమవుతున్నాయి. మార్గదర్శిలో చిట్టీలు ఎవరు కడుతున్నారనే జాబితాను కూడా అధికారులకు ఇవ్వలేదు.

మాకు తెలియదు.. హైదరాబాద్ నుంచే

సాధారణంగా ఏ చిట్‌ఫండ్ కంపెనీలోనైనా ఫోర్‌మెన్ ప్రధానం. ప్రతి బ్రాంచికి ఒక ఫోర్‌మెన్‌ను ఆయా కంపెనీలు నియమించుకుంటాయి. అక్కడ నిర్వహించే చిట్టీలన్నింటికీ అతడే జవాబుదారీ. ప్రతి చిట్టీ, చందాదారులు, లావాదేవీల సమాచారం అంతా అతడు చిట్స్ రిజిస్ట్రార్‌కి సమర్పించాలి. మార్గదర్శి బ్రాంచిల్లో ఫోర్‌మెన్‌లు మాత్రం తనిఖీ అధికారులకు సమాచారం ఇవ్వలేదు. ఏ ప్రశ్న అడిగినా తమకు తెలియదని చెప్పారు. కార్యకలాపాలన్నీ హైదరాబాద్‌లోని హెడ్ క్వార్టర్ నుంచే నడుస్తాయని తెలిపారు. బ్రాంచీల అకౌంట్‌లన్నీ అక్కడే ఉన్నాయని, చందాదారులు కట్టిన సొమ్మంతా అక్కడికే పంపిస్తున్నామని, తమకు చెక్ పవర్ కూడా లేదని ఫోర్‌మెన్లు చెప్పారు. అధికారులు అడిగిన చట్టబద్ధమైన సమాచారం ఇవ్వడానికి కూడా అంగీకరించలేదు. చిట్స్ రిజిస్ట్రార్ చట్టబద్ధంగా అడిగిన సమాచారాన్ని ఫోర్‌మెన్ ఇవ్వకపోవడం నిబంధనలకు విరుద్ధం. హెడ్‌క్వార్టర్ ఆదేశాలు లేకుండా తాము ఏమీ చేయలేమని, ఏ సమాచారాన్ని వెల్లడించలేమంటూ ఫోర్‌మెన్లు తప్పించుకున్నారు. సోదాల్లో దొరికిన డాక్యుమెంట్ల గురించి వివరణ కోరినా సాయంత్రం వరకూ రకరకాల సాకులు చెప్పి ఆ తర్వాత తమకు తెలియదని జారుకున్నారు.

పలు కంపెనీల్లో తనిఖీలు

మార్గదర్శితో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలు చిట్‌ఫండ్ కంపెనీల్లో మూడు విడతలుగా స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్), జీఎస్టీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. చిట్టీల పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో అక్టోబర్ 21, 31, నవంబర్ 15వతేదీల్లో ఈ తనిఖీలు జరిగాయి. 15వ తేదీన తనిఖీల సందర్భంగా మార్గదర్శి సిబ్బంది సమాచారం ఇవ్వకపోవడంతో వివరాల సేకరణ కోసం మూడు రోజులు ఆ సంస్థల్లో తనిఖీలు చేయాల్సి వచ్చింది. వారు సహకరించి ఉంటే మిగిలిన సంస్థల మాదిరిగానే ఒక్క రోజులో తనిఖీలు పూర్తయ్యేవి. మార్గదర్శితోపాటు కపిల్ చిట్స్, ఉషాబాల, క్యాపిటల్, బల్పియా, ఎస్టీఆర్, సూర్యచంద్ర, జగత్ జనని, చలపతి, చిరంజీవ, వజ్రాంకుర లాంటి పలు చిట్‌ఫండ్ కంపెనీల్లో తనిఖీలు నిర్వహించారు. ఈనాడు మాత్రం తమకు చెందిన మార్గదర్శి సంస్థల్లోనే తనిఖీలు జరుగుతున్నాయని, తమపై కక్ష సాధిస్తున్నారని బుకాయిస్తోంది.

ఈనాడు నీతులు ఎదుటివారికే పరిమితం

బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు, చిట్‌ఫండ్ కంపెనీలు ప్రజల నుంచి డబ్బులు తీసుకుని ఇష్టానుసారంగా ఇతర కంపెనీలకు, సొంత అవసరాలకు మళ్లిస్తుంటే చట్టం ఒప్పుకుంటుందా? ఉల్లంఘనలు జరగకుండా చూడడమే ప్రభుత్వ ఏజెన్సీల బాధ్యత అనే విషయం చిట్ నిర్వాహకులకు తెలియదా? ఖాతాదారులు, డిపాజిట్‌దారుల ప్రయోజనాలను పూర్తిగా రక్షించడమే ఆ ఏజెన్సీల ప్రధాన బాధ్యత. తప్పులు జరిగితే వాటిని గుర్తించడం తప్పు ఎలా అవుతుందో ఈనాడు యాజమాన్యమే చెప్పాలి. ప్రజాస్వామ్యం గురించి పుంఖానుపుంఖాలుగా కథనాలు ప్రచురిస్తూ అదంతా ఎదుటి వారికే పరిమితం.. తమకు వర్తించదనే రీతిలో ఈనాడు వ్యవహరిస్తోంది.

బలపడుతున్న అనుమానాలు

ఫోర్‌మెన్లు సమాచారం ఇవ్వకపోవడాన్ని బట్టి చిట్టీల నిర్వహణలో పెద్ద ఎత్తున ఉల్లంఘనలు జరిగాయనే అనుమానాలు బలపడుతున్నాయి. చిట్టీల సొమ్మును హైదరాబాద్‌లోని అకౌంట్లలోకి మళ్లించినట్లు ఇప్పటికే గుర్తించారు. మళ్లించిన డబ్బు ఏం చేస్తున్నారు? ఎక్కడ పెట్టుబడి పెట్టారనే దానిపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. అకౌంట్లను బ్రాంచీల వారీగా నిర్వహించకుండా హెడ్‌క్వార్టర్ నుంచే నడిపిస్తుండడంతో చందాదారుల్లో బినామీలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. చందాదారుల నుంచి సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేసి హెడ్‌క్వార్టర్‌కి బదిలీ చేస్తున్నట్లు వీటన్నింటిపై తనిఖీ అధికారులు చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

'ఆల్‌స్ట్రామ్'లోనే ఢిల్లీ మెట్రో రైలు బోగీల తయారీ

వరదయ్యపాళెం: ఢిల్లీ 4వ దశ మెట్రో ప్రాజెక్ట్‌కు మెట్రో రైలు బోగీల తయారీ ప్రాజెక్టును శ్రీసిటీ సెజ్‌లోని ఫ్రాన్స్ దేశానికి చెందిన అల్‌స్ట్రామ్ పరిశ్రమ మరోసారి సొంతం చేసుకుంది. మొత్తం 312 బిలియన్ యూరోల విలువ గల 312 మెట్రో కార్ బోగీలను తయారు చేసేందుకు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌తో అల్‌స్ట్రామ్‌కు ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని అల్‌స్ట్రామ్ పరిశ్రమ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రంలో మేక్ ఇన్ ఇండియా దార్శనికతతో 100శాతం స్థానికత, అత్యంత అధునాతన సాంకేతికతతో ఆపరేషన్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించే మూడు కోచ్‌లు కలిగిన డ్రైవర్ రహిత రైళ్లను అల్‌స్ట్రామ్ పరిశ్రమ తయారు చేయనుంది. దేశంలో వివిధ మెట్రో రైల్ ప్రాజెక్టులతోపాటు విదేశాల్లోని ప్రాజెక్టులకు సైతం శ్రీసిటీ అల్‌స్ట్రామ్ ప్రధాన చిరునామాగా మారింది.



ఏపీలో స్వచ్ఛత భేష్



- పనులు ఇలాగే కొనసాగించండి
- వ్యర్థాల నిర్వహణ పట్ల ఎన్జీటీ సంతృప్తి
- ఎన్జీటీ ముందుకు జగనన్న స్వచ్ఛ సంకల్పం విధానాలు
- ఇదే అంశంలో ఇతర రాష్ట్రాలకు రూ.వేల కోట్ల జరిమానా

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న స్వచ్ఛతా కార్యక్రమాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సంతృప్తి వ్యక్తం చేసింది. ఘన, ద్రవ వ్యర్థాలు, మురుగు నీటి నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఎన్జీటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నట్టు పేర్కొంది. రెండు రోజులుగా రాష్ట్రంలోని స్వచ్ఛతా పనులపై విచారణ చేపట్టిన ఎన్జీటీ న్యాయమూర్తులు శుక్రవారం సాయంత్రం తీర్పునిచ్చారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలోని పలు పట్టణాల్లో అమలు చేస్తున్న జగనన్న స్వచ్ఛ సంకల్పం ప్రణాళిక, అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. స్వచ్ఛతా పనుల ప్రణాళికను ఇలాగే అమలు చేయాలని, ఈ పనులకు కేటాయించిన నిధులను సమర్థంగా వినియోగించుకోవాలని జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయల్ నాయకత్వంలోని ఎన్జీటీ సూచించింది. పర్యావరణానికి హానికరంగా పరిణమించిన వ్యర్థాలను సమర్థంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం 2016లో వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలను అమల్లోకి తెచ్చింది. ఆ తర్వాత ఫిర్యాదులు అందిన రాష్ట్రాల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ తీరుతెన్నులు తమ ముందుంచాలని ఆయా రాష్ట్రాలకు ఎన్జీటీ నోటీసులు ఇచ్చింది. అయినా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో ద్రవ వ్యర్థాల నిర్వహణలో రోజుకు మిలియన్ లీటర్లకు రూ.2 కోట్ల చొప్పున, మెట్రిక్ టన్నుకు రూ.300 వంతున జరిమానా విధించింది. ఈ మేరకు రాజస్థాన్‌కు రూ.3,000 కోట్లు, మహారాష్ట్రకు రూ.12,000 కోట్లు, పశ్చిమ బెంగాల్‌కు రూ.3,000 కోట్లు, తెలంగాణకు రూ.3,800 కోట్లు, కర్ణాటకకు రూ.2,900 కోట్ల మేర జరిమానా విధించింది. రాష్ట్ర ప్రభుత్వానికి గతంలో ఎన్జీటీ నోటీసులు జారీ చేసినప్పటికీ.. ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ.. నిర్దిష్ట వ్యవధిలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశిస్తూ నోటీసులను ఉపసంహరించుకుంది.

రాష్ట్రంలో సమర్థంగా స్వచ్ఛతా పనులు

- ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'జగనన్న స్వచ్ఛ సంకల్పం–క్లీన్ ఆంధ్రప్రదేశ్' (క్లాప్)ని అమలు చేస్తోంది.
- రాష్ట్రంలోని అన్ని గ్రామాలను, నగరాలను పరిశుభ్రంగా మార్చేందుకు బిన్ ఫ్రీ, లిట్టర్ ఫ్రీ, గార్బేజ్ ఫ్రీగా మార్చేందుకు ప్రణాళికా బద్ధంగా ప్రభుత్వం పని చేస్తోంది. తడి, పొడి, ప్రమాదకరమైన వ్యర్థాలను వేరు చేసి, ఇంటి వద్దనే సేకరించేందుకు వీలుగా ప్రతి ఇంటికి మూడు చొప్పున 1.21 కోట్ల చెత్త డబ్బాలను పంపిణీ చేసింది.
- పొడి చెత్తను ప్రాసెస్ చేసి, దాన్నుంచి తిరిగి ఉపయోగించదగిన వస్తువులను వినియోగంలోకి తీసుకువచ్చే ప్రక్రియలను కూడా చేపట్టింది. చెత్త తరలింపునకు వీలుగా జీపీఎస్ ట్రాకింగ్‌తో కూడిన 2,737 గార్బేజ్ ఆటో టిప్పర్లు, 287 ఈ–ఆటోలు, 880 ట్రక్కులు, 480 కంపాక్టర్లను యూఎల్బీల్లో వినియోగిస్తున్నారు.
- సేకరించిన చెత్తను ప్రాసెసింగ్ ప్లాంట్లకు చేర్చే ప్రక్రియలో భాగంగా 123 మున్సిపాలిటీల్లో 138 గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల (జీటీఎస్)ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 123 మున్సిపాలిటీల్లో రోజుకు 6,890 టన్నుల ఘన వ్యర్థాలను, 86 లక్షల మెట్రిక్ టన్నుల ప్రమాదకర వ్యర్థాలు, 1503 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలను శుద్ధి చేస్తున్నారు.
- లక్ష కంటే తక్కువ జనాభా గల పట్టణాల్లో 91 స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల(ఎస్టీపీ)ను ఏర్పాటు చేస్తున్నారు. మరో 71 ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లు నిర్మాణంలో ఉన్నాయి. లక్ష మించి జనాభా ఉన్న పురపాలక సంఘాల్లో రూ.1,436 కోట్లతో, లక్ష లోపు జనాభా గల వాటిలో రూ.1,445 కోట్లతో ఎస్టీపీల నిర్మాణం చేపట్టింది.

'డిజిటల్ హెల్త్'లో ఏపీ టాప్

- 'ఆయుష్మాన్ భారత్' అమలులో ప్రైవేట్ ఆస్పత్రులు భాగం కావాలి
- ఎన్‌హెచ్‌ఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిరణ్ గోపాల్



సాక్షి, అమరావతి: ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్(ఆభా) కార్డుల జారీలో దేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలిచిందని నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్‌ఏ) ఐటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిరణ్ గోపాల్ తెలిపారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో శుక్రవారం ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) సభ్యులకు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సమాచారాన్ని డిజిటలైజేషన్ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్తమ కృషి చేస్తోందన్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ కార్యక్రమంలో ప్రైవేట్ ఆస్పత్రులు భాగస్వాములు కావాలని చెప్పారు. ఆభా రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జీఎస్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ డిజిటల్ యుగం వైపు దేశం దూసుకుపోతున్న తరుణంలో వైద్య, ఆరోగ్య రంగం కూడా ఆ దిశగా అడుగులు వేస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఫ్యామిలీ డాక్టర్' విధానానికి శ్రీకారం చుట్టిందన్నారు. గ్రామాలకు వెళ్లిన వైద్యులు ప్రజలకు అందించే వైద్య సేవలను వారి ఆభా ఐడీలకు అనుసంధానం చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల ప్రజలు ఎక్కడికి వెళ్లినా వారి ఆరోగ్య పరిస్థితి వెంటనే తెలిసిపోతుందని, సత్వర వైద్యం అందించేందుకు దోహదపడుతుందని వివరించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి, ఆయుష్మాన్ భారత్ ప్రత్యేకాధికారి బీపీ రావు, డాక్టర్ కోటిరెడ్డి, పాల్గొన్నారు.

డీఎంఈ నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే

సాక్షి, అమరావతి: సీనియర్ రెసిడెంట్స్‌గా ప్రభుత్వ వైద్యకళాశాల్లోనే చదివిన పీజీ విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పిస్తూ వైద్య విద్య డైరెక్టర్ (డీఎంఈ) జారీచేసిన నోటిఫికేషన్‌పై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. ఈ నోటిఫికేషన్ ప్రైవేటు వైద్యకాలేజీల్లో పీజీచేసిన విద్యార్థుల పట్ల వివక్ష చూపేదిగా ఉందని ప్రాథమికంగా అభిప్రాయపడింది. అందువల్ల ఈ నోటిఫికేషన్‌పై స్టే విధిస్తున్నట్లు తెలిపింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వైద్య విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 7కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ వైద్యకాలేజీల్లో పీజీచేసిన విద్యార్థులకు మాత్రమే సీనియర్ రెసిడెంట్స్‌గా అవకాశం కల్పిస్తూ ఈ నెల 13న డీఎంఈ నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ పలువురు పీజీ విద్యార్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

మూడు రాజధానుల నిర్ణయం హర్షణీయం

- వికేంద్రీకరణతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి
- తిరుపతి రౌండ్ టేబుల్ భేటీలో మేధావులు

తిరుపతి అలిపిరి/ఎడ్యుకేషన్: అన్ని ప్రాంతాల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ మూడు రాజధానుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని రాయలసీమ మేధావులు పేర్కొన్నారు. వికేంద్రీకరణతోనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ సౌత్ ఈస్ట్ ఏషియన్–పసిఫిక్ స్టడీస్ భవనంలో శుక్రవారం రాయలసీమ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు మేధావులు, సీనియర్ జర్నలిస్టులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రస్తుతమున్న రాజధాని వలన కేవలం 29 గ్రామాలే అభివృద్ధి చెందుతాయని వక్తలు పేర్కొన్నారు. సమావేశంలో రాయలసీమ మేధావుల ఫోరం కన్వీనర్ ఎం.పురుషోత్తంరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ యర్రంరెడ్డి, డాక్టర్ ప్రయాగ, డాక్టర్ జయచంద్రారెడ్డి, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ మస్తానమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయలసీమ అభివృద్ధికి పలు ప్రతిపాదనలు చేశారు. వాటిలో.. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి. కృష్ణా నది మేనేజ్‌మెంట్ బోర్డును సీమలో ఏర్పాటు చేయాలి. ఖనిజాభివృద్ధి, వ్యవసాయ పరిశోధన కేంద్రం, పశుపోషణ పరిశోధన సంస్థ ఏర్పాటు చేయాలి. తిరుపతిని ఐటీ హబ్‌గా పరిగణించాలి అనే ప్రతిపాదనలు ఉన్నాయి.

సాక్షి
విజయనగరం
శనివారం । 19 । నవంబర్ । 2022

శారద సేవలకు గుర్తింపు



బొబ్బిలి: మానవ హక్కుల సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా చింత శారద ఎంపికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ముజఫర్ అలీ నుంచి లేఖ అందినట్టు ఆమె శుక్రవారం తెలిపారు. ఈ పదవితో మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఆమెను పలువురు అభినందించారు.



సహస్ర దీపాలంకరణ

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సీతారామచంద్ర స్వామిని పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి రాజగోపురం వద్దనున్న వేదిక వద్దకు తీసుకెళ్లారు. అనంతరం దీపాలంకరణ వేడుకను జరిపారు.



సమాజానికి మీ సేవలు అవసరం

చీపురుపల్లి: విశ్రాంత ఉద్యోగుల సూచనలు, సేవలు సమాజాభివృద్ధికి అవసరమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్తీక వనమహోత్సవంలో పలువురు విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు.

న్యూస్‌రీల్

వెయిట్ లిఫ్టింగ్‌లో రాణించిన ఉష



సాధించిన మెడల్‌తో బంగారు ఉష

విజయనగరం: ఆల్ ఇండియా వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో విజయనగరానికి చెందిన బంగారు ఉష కాంస్య పతకం సాధించారు. ఈ నెల 16 నుంచి 18 తేదీ వరకు ముంబయిలో జరిగిన ఆల్ ఇండియా రైల్వే చాంపియన్‌షిప్ పోటీల్లో 59 కేజీల విభాగంలో ప్రాతినిధ్యం వహించిన ఆమె స్నాచ్‌లో 61 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 81 కేజీలు మొత్తంగా 142 కేజీల బరువు ఎత్తి కాంస్యపతకాన్ని చేజిక్కించుకున్నారు. ప్రస్తుతం ఆగ్రాలో క్లర్క్‌గా పనిచేస్తున్న ఉష ఏడాదిన్నర కిందట ఓ పాపకు జన్మనిచ్చింది. వెయిట్‌లిఫ్టింగ్ క్రీడపై మక్కువతో కఠోర సాధన చేసి పతకం సాధించడంపై జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు ఉషను అభినందించారు.

చదువే మన ఆస్తి

- సీనియర్ సివిల్ జడ్జి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి



మోపాడ కేజీబీవీలో న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి

డెంకాడ: చదువే మన ప్రధాన ఆస్తి.. విద్యార్థులందరూ చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి పిలుపునిచ్చారు. మోపాడ కేజీబీవీలో చిల్డ్రన్స్‌డే సందర్భంగా శుక్రవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. చదువుకునే హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. విద్యార్థుల హక్కులకు భంగం కలిగించే వారు శిక్షార్హులవుతారన్నారు. సైకాలజిస్టు ఎస్.వి.రమణ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో గెలవాలంటే మానసికంగా బలంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి మాలతి, ఏఎస్‌ఐ మురళీధర్, అడ్వకేట్ జి.భవానీ, ప్రిన్సిపాల్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తగా ఆమె

- ఉమ్మడి జిల్లా మహిళల పారిశ్రామిక అభ్యుదయం
- పరిశ్రమల స్థాపనకు ముందడుగు
- ప్రధానంగా చిన్న తరహా పరిశ్రమల వైపే మొగ్గు
- పది మందికీ ఉపాధి కల్పిస్తూ సమాజాభివృద్ధికి కృషి
- ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వ ప్రోత్సాహం
- కొత్తవలస మండలంలో ప్రత్యేకంగా మహిళా పారిశ్రామిక పార్కు
- బ్యాంకు రుణాలు మంజూరులో జిల్లా పరిశ్రమల శాఖ సహాయం

నేడు మహిళా పారిశ్రామికవేత్తల దినోత్సవం



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఇంటికి దీపం ఇల్లాలు అనేది నానుడి. ఇప్పుడు ఇంటికే కాదు సమాజాభివృద్ధిలో మహిళలు కీలకమయ్యారు. ఏ రంగంలో అడుగుపెట్టినా నిరంతర కృషితో, ఒడుదొడుకులను ఎదుర్కొనే సామర్థ్యంతో తమదైన ముద్ర వేస్తున్నారు. ఇప్పుడు పారిశ్రామికం రంగంలోనూ తామే కర్త, కర్మ, క్రియ అన్నట్లుగా ఒంటిచేత్తే విజయాలను అందుకుంటున్నారు. సంక్షేమ పథకాల్లోనూ, రాజకీయ పదవుల్లోనూ మహిళలకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి వారికి పారిశ్రామిక రంగంలోనూ అదే తరహాలో ప్రోత్సహిస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు స్థలంతో పాటు రుణాల మంజూరుకు ప్రభుత్వం నుంచి సహకారం అందుతోంది. పెట్టుబడిలో రాయితీలు కల్పిస్తోంది. సింగిల్ విండో విధానంలో త్వరిత గతిన అనుమతులు మంజూరు చేస్తోంది. మరెక్కడా లేనివిధంగా కొత్తవలస మండలం రెల్లి వద్ద 159 ఎకరాల్లో మహిళలకు ప్రత్యేక ఇండస్ట్రియల్ పార్కు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన అనేకమంది మహిళలు పారిశ్రామిక ప్రగతిలో భాగస్వాములు అవుతున్నారు. పదిమందికీ ఉపాధి కల్పిస్తూ పారిశ్రామిక వేత్తలుగా రాణిస్తున్నారు.

జిల్లాలో పారిశ్రామిక ప్రగతి ఇలా..

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 37 భారీ, మెగా పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో 18,202 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారిలో మహిళా భాగస్వామ్యం ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పారిశ్రామిక విధానంతో కొత్త పరిశ్రమలకు మార్గం సుగమమైంది. రూ.4,460 కోట్ల పెట్టుబడితో మరో 14 పరిశ్రమలు ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. వీటికి వివిధ దశల్లో అనుమతులు మంజూరు కావాల్సి ఉంది. అవి కార్యరూపంలోకి వస్తే 19,038 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. మరో 2,883 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో ముఖ్యంగా సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల యజమానుల్లో ఎక్కువ మంది మహిళలే. ఆ పరిశ్రమల ద్వారా ప్రస్తుతం 41,175 మందికి ఉపాధి లభిస్తోంది.

ప్రభుత్వ ప్రోత్సాహకంతో పరిశ్రమ పెట్టా...



భోగాపురం మండలం పోలిపల్లి వద్ద ఆర్‌ఏఎస్ చేపల పరిశ్రమ



ప్రత్యేకంగా నిర్మించిన ట్యాంకుల్లో అదీ తక్కువ నీటి వినియోగంతో చేపల పెంపకాన్ని కువైట్‌లో చూశాను. రీసర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్ (ఆర్‌ఏఎస్)లో నీటి పునర్వినియోగమవుతున్న తీరు నన్ను ఆకర్షించింది. అలాంటి పరిశ్రమను పెట్టాలనే ఆలోచనతో తమిళనాడులో శిక్షణ తీసుకున్నాను. జిల్లాకు వచ్చిన తర్వాత నా ప్రాజెక్టు రిపోర్టును చూసి మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నిర్మలాకుమారి, ఎస్‌బీఐ భోగాపురం శాఖ మేనేజర్ లక్ష్మి ఎంతో ప్రోత్సహించారు. గత ఏడాది నిర్వహించిన ఎస్‌బీఐ క్రెడిట్ అవుట్‌రీచ్ క్యాంపెయిన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి చేతుల మీదుగా రుణ మంజూరు చెక్కును అందుకున్నాను. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు పీఎంఎంఎస్‌వై పథకంలో 60 శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తోంది. అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– కేవీ నాగమణి,
ఆర్‌ఏఎస్ యూనిట్ యజమాని,
పోలిపల్లి, భోగాపురం మండలం

వంద మందికి ఉపాధి కల్పనే లక్ష్యం...



మనం బతకడమే కాదు పదిమందిని బతికించడంలోనే ఆనందం ఉంది. స్వతహాగా పిండివంటల తయారీపై అభిలాష ఉండేది. బెలగాంలోని మా ఇంటిలోనే ఎనిమిదేళ్ల క్రితం వివిధ రకాల పిండివంటల తయారీని వ్యాపారాత్మకంగా ప్రారంభించాను. నలుగురికి ఉపాధి కల్పించాను. వినియోగదారుల ఆదరణ పెరగడంతో తయారీని పెంచాం. ప్రస్తుతం 45 మందికి ఉపాధి కల్పిస్తున్నాను. ఔత్సాహికులకు అవగాహన కల్పిస్తున్నాను. ఫుడ్‌గార్డెన్ స్టాల్ ప్రారంభించిన తొలిరోజుల్లో కాస్త ఒడుదొడుకులు ఎదురైనా తట్టుకొని నిలబెట్టాను. ఈ పరిశ్రమను మరింత విస్తరించి వంద మందికి ఉపాధి కల్పించాలనేది నా లక్ష్యం.

– బి.కన్యాకుమారి,
ఫుడ్‌గార్డెన్ యజమాని, పార్వతీపురం



పిండివంటల తయారీని పరిశీలిస్తున్న ఫుడ్‌గార్డెన్ యజమాని కన్యాకుమారి



పార్వతీపురంలోని ఫుడ్‌గార్డెన్

మహిళలకు ప్రత్యేక ప్రోత్సాహం...

జిల్లా కలెక్టర్‌గా ఎ.సూర్యకుమారి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నారు. ఔత్సాహికులకు ప్రత్యేకంగా జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ) ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నారు. ఫలితంగా 2,370 వరకూ దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 2,296 దరఖాస్తులకు అనుమతులు ఇచ్చారు. ఆయా లబ్ధిదారుల్లో ఎక్కువ మంది మహిళలే ఉండటం విశేషం. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) కింద పరిశ్రమల స్థాపనకు అవసరమైన సహాయ సహకారాలను డీఐసీ అధికారులు అందిస్తున్నారు.

కొత్తవలస మండలం బలిఘట్టం గ్రామంలో 70.41 ఎకరాలు, రామభద్రాపురం మండలం కొటక్కి గ్రామం వద్ద 187.08 ఎకరాలు, నెల్లిమర్ల నియోజకవర్గంలోని పూసపాటిరేగ మండలం జి.చోడవరం గ్రామంలో 155.92 ఎకరాల్లో కొత్తగా పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తున్నారు. ఇక ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల కోసమే ప్రత్యేకంగా కొత్తవలస మండలంలోని రెల్లి గ్రామం సమీపంలో 159 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక పార్కు అందుబాటులోకి రానుంది. ప్రభుత్వం 2020–23 నూతన పారిశ్రామిక విధానంలో భాగంగా వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకాన్ని తీసుకొచ్చింది. సూక్ష్మ, చిన్న, మధ్య, భారీ, మెగా పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి రాయితీ 15 శాతం నుంచి 45 శాతం వరకూ ఇస్తోంది. భూమి కొనుగోలుపై స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, భూమి తనఖాకు 100 శాతం రాయితీ కల్పిస్తోంది. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే మహిళలకు ఏపీఐఐసీ ప్లాట్లలో 50 శాతం రాయితీ ఇస్తోంది. వీటితోపాటు భూమి మార్పిడి చార్జీలు, విద్యుత్ వినియోగం, వడ్డీ రీయింబర్స్‌మెంట్‌పై రాయితీలు కల్పిస్తోంది. అమ్మకపు పన్ను, సీడ్ కాపిటల్‌పై 50 నుంచి శత శాతం రాయితీలు లభిస్తున్నాయి.

గంట్యాడ మండలం నందాం వద్ద కార్టూన్ బాక్స్‌ల తయారీ పరిశ్రమ



18 మందికి ఉపాధి కల్పిస్తున్నా...



వ్యాపార రంగంలో అడుగుపెట్టి పది మందికి ఉపాధి చూపించాలని తొలి నుంచి ఆలోచించేదాన్ని. 2012 సంవత్సరంలో రూ.75వేల పెట్టుబడితో టెక్స్‌టైల్స్ వ్యాపారం ప్రారంభించాను. మూడేళ్లలో వచ్చిన లాభంతో గంట్యాడ మండలం నందాం గ్రామంలో 75 సెంట్ల స్థలం కొన్నాను. జిల్లాలో అత్యధికంగా పండే మామిడి పండ్లను ఎగుమతి చేయడానికి ప్రత్యేకంగా కార్టూన్ బాక్స్‌లు అవసరం. వాటిని తయారుచేసేందుకు శ్రీసాయిసుధా కోరుగేటెడ్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో 2017లో పరిశ్రమను బ్యాంకు రుణం రూ.1.50 కోట్లతో ప్రారంభించాను. 2018 నుంచి ఉత్పత్తి మొదలైంది. రూ.40 లక్షల టర్నోవర్ వచ్చింది. తర్వాత సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేస్తున్నాం. ప్రస్తుతం ఏటా కోటి రూపాయల టర్నోవర్ స్థాయికి చేరుకున్నాను. 18 మందికి సాంకేతిక అవగాహన కల్పించి ఉపాధి ఇస్తున్నాను. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆర్గానిక్ ఉత్పత్తుల పరిశ్రమను స్థాపించేందుకు ప్రయత్నిస్తున్నాను.

– బి.సుధార్చన, పారిశ్రామికవేత్త, నందాం,
గంట్యాడ మండలం

ఆక్వా రైతుకు అండ

- విద్యుత్ చార్జీలలో రాయితీ
- నాణ్యమైన సీడ్, ఫీడ్ సరఫరా
- జిల్లాలో పెరిగిన సాగు విస్తీర్ణం
- కౌంట్‌ను బట్టి కిలో ధర రూ.30 నుంచి రూ.40 వరకు పెంపు
- రొయ్యల ఎగుమతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

పూసపాటిరేగ:

ఆక్వా సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రైతులకు రాయితీలు అందిస్తోంది. ఆక్వా ఉత్పత్తులకు మద్దతు ధరతో పాటు మార్కెట్ సదుపాయం కల్పిస్తుండడంతో ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణలో తీరంలో రొయ్యల చెరువులు వెలుస్తున్నాయి. రొయ్యల ధరలపై అధికారుల నిరంతర పర్యవేక్షణ, వ్యాపారుల సిండికేట్ నుంచి రైతులకు విముక్తి కల్పించడం, ఉత్పత్తికి అయ్యే ఖర్చుకంటే అధిక ధరకు అమ్ముడయ్యేలా చర్యలు తీసుకోవడం ఆక్వా రైతులకు కలిసివస్తోంది. ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఆక్వాసాగు క్రమబద్ధీకరణ, నాణ్యమైన మేత సరఫరాకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



కోనాడలో రొయ్యల చెరువు

జిల్లాలో సాగు ఇలా...

విజయనగరం జిల్లాలో 49 మంది రైతులు 175.37 హెక్టార్ల విస్తీర్ణంలోని చెరువుల్లో రొయ్యలు పెంచుతున్నారు. 2021-22 సంవత్సరంలో 217 టన్నుల రొయ్యలు ఉత్పత్తి చేశారు. ప్రాసెసింగ్ ప్లాంట్‌ల ద్వారా 21,600 మెట్రిక్ టన్నుల రొయ్యలను ఎగుమతి చేశారు. విజయనగరంలోని ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ నుంచి ఆక్వా రైతులకు సీడ్ సరఫరా అవుతోంది.

రాయితీలు ఇలా..

జిల్లాలో తీరప్రాంత మండలాలైన పూసపాటిరేగ, భోగాపురం ఆక్వాజోన్‌లో 10 ఎకరాలలోపు ఆక్వా సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం రాయితీలు అందిస్తోంది. యూనిట్ విద్యుత్‌ను రూ.1.60 పైసలకే సరఫరా చేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో యూనిట్ విద్యుత్ ధర రూ.3 రూపాయలు ఉండేది. అప్పటిలో విద్యుత్ బిల్లులు చెల్లించలేక ఆక్వా సాగును కొందరు రైతులు వదిలేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు విద్యుత్ చార్జీలు తగ్గించడం, ఫీడ్ (జొన్న)ను తక్కువ ధరకే అందిస్తుండడంతో సాగుపై మక్కువ చూపుతున్నారు.

వనామి సాగుకు రైతుల ఆసక్తి

జిల్లా ఆక్వా రైతులు వనామి రకం రొయ్యల సాగుకు ఆసక్తి చూపిస్తున్నారు. వనామిసాగు అనుకూలంగా ఉండి మంచి దిగుబడులు వస్తున్నాయి. ఏటా జనవరి నుంచి మార్చినెల వరకు ధరలు బాగుంటాయని, ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు ధరలు తగ్గి రైతులకు కొంతమేర లాభాలు తగ్గుతున్నాయని, నవంబర్ నుంచి జనవరి వరకు ఆక్వా ఉత్పత్తులు గిట్టుబాటు అవుతాయని రైతులు చెబుతున్నారు.

ప్రస్తుతం విజయనగరం జిల్లాలో రొయ్యల ధరలు ఇలా..

కిలో కౌంట్	ధర (రూపాయల్లో)
100	180
90	190
80	200
70	220
60	230
50	280
40	300
30	350

సాగు విస్తీర్ణం పెరిగింది



గత టీడీపీ ప్రభుత్వంలో ఆక్వా రైతులకు సరఫరా చేసే విద్యుత్‌కు చార్జీలు పెంచింది. దీని కారణంగా చాలా మంది రైతులు ఆక్వా సాగుకు దూరమయ్యారు. ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ ద్వారా ఆక్వాజోన్‌లకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. దీని కారణంగా ఆక్వాసాగు అమాంతంగా పెరిగింది. ప్రభుత్వమే సాగు ద్వారా వచ్చే ఉత్పత్తిపై దృష్టిసారించి రైతులకు మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకుంది.

– అమర బుజ్జి, ఆక్వారైతు, కోనాడ

గిట్టుబాటు ధర



ఆక్వా రైతులకు ప్రభుత్వం అండగా ఉంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేయాలని పరిశ్రమ యాజమాన్యాలు, ప్రాసెసింగ్ ల్యాబ్‌లు, వ్యాపారులను ఆదేశించాం. ఆక్వా రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సాగును లాభసాటిగా మార్చుతోంది.

– నిర్మలాకుమారి, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్, విజయనగరం



క్లుప్తంగా

జనరల్ నర్సింగ్ కోర్సులకు ఉచిత శిక్షణ

పార్వతీపురం టౌన్: ఇంటర్ ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు 'కిమ్స్ నర్సింగ్ ఆఫ్ ఒంగోలు కళాశాల'లో జనరల్ నర్సింగ్ కోర్సు ఉచిత శిక్షణకు అర్హులని కళాశాల ఎగ్జిక్యూటివ్ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కన్వీనర్ కోటాలో ఉచితంగా శిక్షణ అందజేస్తామని పేర్కొన్నారు. మొదటి సంవత్సరం పూర్తయిన తరువాత రెండవ సంవత్సరం నుంచి రూ.7 వేలు స్టైపెండ్ ఇస్తామని తెలిపారు. ఉచితంగా హాస్టల్ సదుపాయం ఉందని ఆసక్తి ఉన్నవారు ఈ నెల 21వ తేదీ లోపు కళాశాల వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9398917283, 7020408565 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పేలిన గోలీసోడాలు



రోడ్డుమీదపడి పేలిన సోడాబుడ్డీలను డివైడర్‌పై పెడుతున్న వ్యాపారి

రాజాం: పట్టణంలోని ప్రధాన రహదారిలో పాత పోలీస్ క్వార్టర్స్ ఎదురుగా సినిమాలో చూపించేవిధంగా గోలీ సోడా బుడ్డీలు పేలాయి. వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలి జంక్షన్ నుంచి ఓ వ్యాపారి సోడా బుడ్డీలను ద్విచక్ర వాహనంతో శుక్రవారం పట్టణంలోకి తీసుకొస్తుండగా, ముందు వెళ్తున్న వాహనం అడ్డంగా వచ్చింది. దీంతో వ్యాపారి బండి ఒక్కసారిగా కిందకు ఒరిగిపోయింది. ఈ క్రమంలో బండి వెనుక ఉన్న సోడాబుడ్డీలు రోడ్డుమీద పడి పేలాయి. దీంతో ఆ సమయంలో అక్కడే ఉన్న పోలీసులు అప్రమత్తమై రోడ్డుపై పేలిన సోడాబుడ్డీలను తొలగించారు. వ్యాపారితో పాటు ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సైకిళ్ల దొంగ అరెస్ట్



రికవరీ చేసిన సైకిళ్లను పరిశీలిస్తున్న టూటౌన్ సీఐ సీహెచ్ లక్ష్మణరావు, తదితరులు

విజయనగరం క్రైమ్: పట్టణంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న సైకిల్స్ దొంగతనాలపై టూటౌన్ పోలీసులు దృష్టిసారించి దాసన్నపేటకు చెందిన నిందితుడు మల్యాడ నారాయణ రావును శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 12 సైకిళ్లను రికవరీ చేసుకుని, కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు టూటౌన్ సీఐ సీహెచ్ లక్ష్మణ రావు తెలిపారు.

పొలంలో మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అనీష్

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ రామభద్రపురం నిడగల్లుగూడ గ్రామాల మధ్య ఉన్న పత్తిపొలంలో రామభద్రపురం గ్రామానికి చెందిన కొండ గౌర్రి మల్లేష్ (56) మృతదేహం పడి ఉన్నట్లు స్థానికుల ఫిర్యాదు మేరకు ఎస్సై అనీష్ కేసు నమోదు చేశారు. రామభద్రపురం గ్రామానికి చెందిన మల్లేష్ ఈనెల 9వ తేదీనుంచి కనిపించడం లేదని భార్య రూప ఫిర్యాదు చేయగా ఆమెను పోలీసులు శుక్రవారం పిలిపించారు. ఆమె వచ్చి తన భర్త మృతదేహంగా గుర్తించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 520.00
విజయనగరం	రూ. 524.00
శ్రీకాకుళం	రూ. 524.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	53,180-00
బంగారం(22సి. 10గ్రా.)	48,750-00
వెండి (కిలో)	67,000-00


చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204

చెరకు రైతుకు ఊరట

- రూ.80 పెరిగిన మద్దతు
- ప్రస్తుతంటన్ను ధర రూ.2980
- ప్రారంభమైన క్రషింగ్
- గ్రామాల్లో వేగంగా చెరకు కటింగ్
- ఇతర ప్రాంతాల నుంచి కూలీల వలస



క్రషింగ్ ప్రారంభించిన ఈఐడీ ప్యారీ చెక్కెర కర్మాగారం

రేగిడి: విజయనగరం జిల్లాలోనే కాకుండా పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో చెరకు సాగుచేస్తున్న రైతులకు ఈ ఏడాది ముందుగానే ఊరట లభించింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపడంతో ఉత్తరాంధ్రంలో ఏకైక కర్మాగారంగా నిలిచిన రేగిడి మండలంలోని సంకిలి వద్ద గల ఈఐడీ ప్యారీ చెక్కెర కర్మాగారం క్రషింగ్‌ను గురువారం ప్రారంభించింది. గత ఏడాది కంటే పదిరోజులు ముందుగానే ఈ ఏడాది చెరకు క్రషింగ్ ప్రారంభించడం శుభపరిణామం. ఇంకో వైపు గతేడాది కంటే ఈ ఏడాది చెరకు టన్ను మద్దతు ధర కూడా రూ.80 పెరగడం విశేషం . ఇప్పుడు టన్నుకు మద్దతు ధర రూ.2980 చెల్లిస్తున్నారు.

ఈ ఏడాది క్రషింగ్ లక్ష్యం పెంపుదల

గతేడాది కంటే ఈ ఏడాది క్రషింగ్ లక్ష్యాన్ని ఈఐడీ కర్మాగారం పెంచింది. గతేడాది 5.04 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ చేయగా, ఈ ఏడాది మరో 81,000 టన్నుల క్రషింగ్ పెరుగుతున్నట్లు యాజమాన్యవర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది 5.85 లక్షల మెట్రిక్ టన్నులు గానుగ ఆడేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు యాజమాన్యం తెలిపింది.

అనుకూల వాతావరణం

గతేడాది కంటే ఈ ఏడాది చెరకు పంట దిగుబడి బాగా కనిపిస్తోంది. అనుకూల వాతావరణం కారణంగా పంట దిగుబడి అధికంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. సకాలంలో క్రషింగ్ ప్రారంభం కావడంతో ముందుగానే నగదు జమఅవుతుందని మంచి గిట్టుబాటయ్యే అవకాశం ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



చెరకు కోత పనుల్లో బిజీగా రైతులు



ఏపుగా పెరిగిన పంట

ఇతర ప్రాంతాల నుంచి వలసలు

సాధారణంగా ఈ ప్రాంతాల నుంచి రాజమండ్రి, చీరాల, ఒంగోలు, విజయవాడ, ఒడిశా ప్రాంతాలకు రైతు కూలీలు వలస వెళ్తుంటారు. అయితే నాలుగేళ్లుగా తుని, అన్నవరం, పాయకరావుపేట తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి రైతు కూలీలు వలస వస్తున్నారు. చెరకు పంట కోతతో పాటు ట్రాక్టర్లకు లోడ్ చేసేందుకు ప్రత్యేకంగా కుటుంబాలతో సహా కూలీలు ఇక్కడికి వచ్చి ఉంటున్నారు. వీరు ఈ పనులను కాంట్రాక్టుకు తీసుకుని రాత్రిపగలు కష్టపడుతుంటారు. ఇప్పటినుంచి ఫిబ్రవరి నెల వరకూ ఈ సీజన్ ఉండడంతో ఈ ప్రాంతాలకు వలసవచ్చే రైతులకు బాగా కలిసివస్తుంది. ఒక్కో కూలీ నెలకు రూ.20వేల వరకు సంపాదించుకునే అవకాశం ఉంటుంది.

చెరకు రైతులందరికీ అవకాశం



మా ఫ్యాక్టరీ సమీపంలోని రైతులకు తొలుత కటింగ్ ఆర్డర్లు ఇస్తున్నాం. విల్లింగ్ ఇవ్వడంతో చెరకును యాజమాన్య పద్ధతుల్లో సాగుచేసి దిగుబడి సాధిస్తున్న ఇతర ప్రాంతాల రైతులను కూడా గుర్తించాం. ఈ ఏడాది ముందుగానే క్రషింగ్ ప్రారంభించాం. మార్చి, ఏప్రిల్ నెలవరకూ కొనసాగించే ఆలోచనలో ఉన్నాం. రాష్ట్ర ప్రభుత్వం, రైతులు సహకరిస్తున్నారు.

ఎ.నాగిశేషారెడ్డి, సీనియర్ అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్, ఈఐడీ ప్యారీ చెక్కెర కర్మాగారం, సంకిలి, విజయనగరం జిల్లా

బేస్‌బాల్ పోటీల్లో మరింతగా రాణించాలి

- జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన తెర్లాం విద్యార్థిని మీనాకుమారి



విద్యార్థిని మీనాకుమారిని సన్మానిస్తున్న ఎంఈఓ, ఆప్తాల్మిక్ అధికారి, ఉపాధ్యాయులు

తెర్లాం: విద్యార్థిని మీనాకుమారి బేస్‌బాల్ పోటీల్లో బాగా రాణించి మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు, రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు, తెర్లాం హైస్కూల్ పీడీ బంగారు నాయుడు, పెరుమాళి పీహెచ్‌సీ ఆప్తాల్మిక్ అధికారి వసంతరావు ఆకాంక్షించారు. ఈ నెల 4 నుంచి 8 వరకు పంజాబ్ రాష్ట్రంలోని లూధియానాలో జరిగిన జాతీయస్థాయి సబ్‌జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో తెర్లాం జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని మీనాకుమారి రాష్ట్ర జట్టు తరఫున పాల్గొని జాతీయస్థాయిలో ద్వితీయ స్థానం సాధించడానికి ఎంతగానో కృషి చేసింది. ఈ మేరకు శుక్రవారం పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, ఎంఈఓ, పెరుమాళి పీహెచ్‌సీ ఆప్తాల్మిక్ అధికారి విద్యార్థిని గౌతమిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరిన్ని బేస్‌బాల్ పోటీల్లో మీనాకుమారి పాల్గొని మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.పాపారావు, ఉపాధ్యాయులు, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు

- డిప్యూటీ డీఈఓ కె వాసుదేవరావు



విజేతలతో డి ప్యూటీ డీఈఓ వాసుదేవరావు

విజయనగరం పూల్‌బాగ్: నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలని డిప్యూటీ డీఈఓ కంది వాసుదేవరావు అన్నారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్-2022 జిల్లా స్థాయి ప్రదర్శన, రాష్ట్ర స్థాయి ప్రాజెక్టుల ఎంపిక కార్యక్రమం స్థానిక పూల్‌బాగ్‌లోని చలపతి స్కూల్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 167 స్కూళ్లనుంచి 242 ప్రాజెక్టులు ప్రదర్శనలో పాల్గొన్నాయని, వాటిలో ఏడు ప్రాజక్టులు ప్రథమ స్థానానికి ఎంపికయ్యాయని చెప్పారు. పి.లోకేష్ (జెడ్పీహెచ్‌ఎస్, బొబ్బిలి), టి.అమన్ (జెడ్పీహెచ్‌ఎస్, బాడంగి), పి మల్లేశ్వర్‌బాబు (జెడ్పీహెచ్‌ఎస్ రామతీర్థం) డి.వరుణ్‌కుమార్ (జెడ్పీహెచ్‌ఎస్,పెదవేమలి), పి గాయత్రి (జెడ్పీహెచ్‌ఎస్,జిన్నాం), ఐ సోనియా (జెడ్పీహెచ్‌ఎస్, రెల్లివలస), కె జశ్వంత్ సంతోషి (శ్రీ చలపతి ఇంగ్లీష్‌మీడియం స్కూల్) సాధించా ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ద్వితీయస్థానంలో పీఎం జస్మిత(ఫోర్ట్‌సిటీ స్కూల్, విజయనగరం), ఎ జోషిత (ఏపీమోడల్‌స్కూల్, మదనాపురం), ఎం జ్యోతి ప్రకాశ్(జెడ్పీహెచ్‌ఎస్, ఆరికతోట), టి.ఝాన్సీ (జెడ్పీహెచ్‌ఎస్ పోరాం),పి సౌజన్య(జెడ్పీహెచ్‌ఎస్, కంచరాం), ఎల్.గౌతమి (జెడ్పీహెచ్‌ఎస్, రేగిడి) సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ మిరియాల కృష్ణారావు, చలపతి స్కూల్ కరస్పాండెంట్ రాజేష్, ఉపాధ్యాయులు బల్లా శ్రీనివాసరావు, రామకృష్ణ, రాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక



ఎంపికైన జట్టు సభ్యులతో ప్రిన్సిపాల్ తదితరులు

రాజాం సిటీ: ఈ నెల 28 నుంచి బెంగళూరులోని జైన్ యూనివర్సిటీలో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ పోటీలకు జేఎన్‌టీయూ జీవీ పురుషుల జట్టును ఎంపిక చేశామని జీఎంఆర్ ఐటీ కళాశాల పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక జీఎంఆర్ ఐటీ కళాశాలలో ఎంపికలు నిర్వహించామని, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ఇంజినీరింగ్ కళాశాలల నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ప్రతిభ ఆధారంగా నిర్వహించిన ఎంపికలో వి.అభిషేక్, కె.హరిన్ (వైజాగ్ రఘు ఇంజినీరింగ్ కళాశాల), పి.తేజ (విజ్ఞాన్ కళాశాల), బి.గణేష్ (అవంతి ఇంజినీరింగ్ కళాశాల), డి.వీరవర్ధన్ (విజయనగరం లెండి ఇంజినీరింగ్ కళాశాల)లు ఎంపికయ్యారని తెలిపారు. అలాగే స్టాండ్‌బైగా సీహెచ్ అరవింద్‌రెడ్డి, యు.రోహన్‌కృష్ణలు ఎంపికయ్యారని పేర్కొన్నారు. జేఎన్‌టీయూ జీవీ జట్టు తరపున ఎంపికైన క్రీడాకారులను ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, డాక్టర్ శశికుమార్, జేఎన్‌టీయూ జీవీ కమిటీ సభ్యులు పి.తిరుపతి, పీఎస్‌ఆర్ నాయుడు తదితరులు అభినందించారు.

పుస్తకాధ్యయనంపై దృష్టి కేంద్రీకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సుభాష్

- డీఎస్పీ ఎ.సుభాష్

పార్వతీపురం టౌన్: విద్యార్థులు పుస్తకాధ్యయనంపై దృష్టి కేంద్రీకరించాలని పార్వతీపురం డీఎస్పీ ఎ.సుభాష్ సూచించారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక గాయత్రి డిగ్రీ కళాశాలలో జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు టి.శివకేశవరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ సుభాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిశా చట్టంపై విద్యార్థులంతా అవగాహన కలిగి ఉండాలని కోరారు. విద్య నేర్పిన గురువు ఎక్కడ కనబడినా నమస్కరించాలని, గురువు పట్ల శిష్యుడు ఎలా ఉండాలో వశిష్ఠుడు రాముడికి నేర్పించాడని తెలిపారు. అలానే విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు వచ్చే ముందు తల్లిదండ్రులకు నమస్కరించి పాఠశాలకు వస్తే మంచిదన్నారు. ప్రతి రోజు పేపర్ చదవడం వల్ల మేధస్సు మెరుగుపడుతుందని అన్నారు. చదవడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు విషయ పరిజ్ఞానం కూడా పెరుగుతుందని, అందుకోసం పుస్తకాధ్యయనంపై దృష్టి కేంద్రీకరించాలని హితవు పలికారు. మహాత్మా గాంధీ, మేడంక్యూరీ వంటి వారి జీవిత చరిత్రలు అధ్యయనం చేసి ప్రేరణ పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పీవీ మణికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

8 కేజీల గంజాయితో పట్టుబడిన మహిళ

కొత్తవలస: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు మండలానికి చెందిన పంచాది వసుంధర కొత్తవలస మండలంలోని మంగళపాలెం జంక్షన్ వద్ద లగేజ్‌బ్యాగ్‌తో విశాఖపట్నం వైపు వెళ్తున్న ఆటో ఎక్కుతుండగా సమాచారం మేరకు ఎస్సై కె.వెంకటేశ్వరరావు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా లగేజ్ బ్యాగ్‌లో గల ప్లాస్టిక్ సంచిలో సుమారు 8 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నిందిత మహిళ అరకులో గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర గంజాయి కొనుగోలు చేసి పోలీసులు గుర్తించకుండా ఉండేందుకు అక్కడి నుంచి పలు ఆటోలు మారి ప్రయాణం చేస్తూ మంగళపాలెం చేరుకుందని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ గంజాయిని విశాఖలో అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకునేందుకు ప్రణాళిక రచించినట్లు విచారణలో నిందిత మహిళ అంగీకరించినట్లు చెప్పారు. పట్టుబడిన మహిళపై కేసు నమోదు చేసి కొత్తవలస కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుడికి తీవ్రగాయాలు



అపస్మారక స్థితికి చేరుకున్న ఉపాధ్యాయుడు సీతారాం

కురుపాం: మండలంలోని తోటగూడ గిరిజన గ్రామం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మొండెంఖల్లుకు ఉపాధ్యాయుడు ఎస్.సీతారాం తీవ్రంగా గాయపడ్డారు. ఆయన ద్విచక్రవాహనంపై కురుపాం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా రస్తాకుంటుబాయి పంచాయతీ తోటగూడ గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో మెరుగైన వైద్య సేవల కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

దాడిలో మహిళకు..



గాయపడిన వెంకటలక్ష్మి

పార్వతీపురంటౌన్: పాతకక్షలతో దాడిచేయడంతో ఓ మహిళ గాయాలపాలైంది. శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం మార్కొండపుట్టి గ్రామానికి చెందిన టి.వెంకటలక్ష్మి, తన మరిది శంకరరావు ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. వెంకట లక్ష్మికి కొన్ని కోళ్లు ఉన్నాయి. అవి శుక్రవారం ఉదయం మరిది ఇంటివైపు వెళ్లగా తోడికోడలు సంతోషి నోటికి వచ్చినట్లు దుర్భాషలాడి రాయితో దాడిచేసి గాయపర్చింది. ఎందుకు అలా కోప్పడుతున్నావని తోడికోడలని వెంకటలక్ష్మి అడగ్గా అదే సమయంలో మరిది శంకరరావు వచ్చి అక్కడే ఉన్న కర్రతో వదిన వెంకటలక్ష్మి వీపుపై కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఈ ఘటనపై ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కులదూషణ కేసు నమోదు

కొత్తవలస: మండలంలోని అప్పన్నదొరపాలెం గ్రామానికి చెందిన బండ పైడిరాజును కులం పేరుతో దూషించినట్లు అదే గ్రామానికి చెందిన మహాదాసు పైడిరాజుపై శుక్రవారం కేసు నమోదైంది. బాధితుడు బండ పైడిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపారు.

విపత్తులు ఎదుర్కోవడంలో అవగాహన అవసరం

- ఆపదమిత్రల శిక్షణ ముగింపులో కలెక్టర్ సూర్యకుమారి



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి, జెడ్పీ సీఈఓ డాక్టర్ అశోక్‌కుమార్

విజయనగరం అర్బన్: ప్రకృతి విపత్తులు సంభవించేటప్పుడు ప్రజలు తమను తాము రక్షించుకోవడంతోపాటు తోటివారిని, తమ ఆస్తులను రక్షించుకోవడంలో ఎలాంటి పద్ధతులు అవలంబించాలో అవగాహన కల్పించగలిగితే విపత్తుల వల్ల కలిగే నష్టాలను తగ్గించవచ్చని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అభిప్రాయ పడ్డారు. విపత్తులను ఎదుర్కోవడంపై ప్రజల్లో పూర్తి అవగాహన ఉంటే ఎదుర్కోవడం సులువవుతుందన్నారు. రానున్న రోజుల్లో జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడంలో ఆపద మిత్రలు అందించే సహాయం కీలకం కానుందని పేర్కొన్నారు. జిల్లాలోని వందమంది గ్రామ, వార్డు వలంటీర్లు, ఆశ కార్యకర్తలు, హోంగార్డులు, నెహ్రూ యువకేంద్రం వలంటీర్లను ఆపదమిత్రలుగా ఎంపిక చేసి రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి స్థానిక యూత్ హాస్టల్‌లో అందజేసిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. శిక్షణ పూర్తి చేసిన వారికి ధ్రువీకరణ పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపద మిత్రలు సేవాభావంతో పనిచేయాలని సూచించారు.

200 మందికి శిక్షణ

జిల్లాలో మొత్తం 200 మందికి ఆపదమిత్ర శిక్షణ ఇవ్వనున్నామని, తొలి విడతగా భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ, నెల్లిమర్ల, బొబ్బిలి, బాడంగి, తెర్లాం మండలాలకు చెందిన వందమంది వలంటీర్లు, ఆశ కార్యకర్తలు, ఎన్‌వైకే వలంటీర్లు, హోంగార్డులకు శిక్షణ ఇచ్చామని జిల్లా పరిషత్ సీఈఓ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్ చెప్పారు. జాతీయ విపత్తుల ప్రతిస్పందన దళం , రాష్ట్ర విపత్తుల స్పందన దళం, అగ్నిమాపక దళం, రెడ్‌క్రాస్, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రానికి చెందిన శిక్షకులతో పాటు జిల్లాలోని 15 శాఖల అధికారులు ఆపదమిత్రలకు శిక్షణ ఇచ్చారని చెప్పారు. రెండో బ్యాచ్‌లో మరో వందమందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడకండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జీవీ కృష్ణారావు

పార్వతీపురం టౌన్: సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దని పాలకొండ డీఎస్పీ జీవి కృష్ణారావు హితవు పలికారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మంటపంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సమగ్ర అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులు, అపరిచితులకు బ్యాంకు ఏటీఎం, అకౌంట్‌లకు సంబంధించి పాస్‌వర్డ్, పిన్‌కోడ్ ఇవ్వరాదని హెచ్చరించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు చేస్తున్న దోపిడీలకు అమాయక ఖాతాదారులు బలవుతున్నారని, క్రెడిట్ కార్డులకు సంబంధించి ఓటీపీ, క్యూఆర్ కోడ్‌ల విషయంలో ప్రతి ఖాతాదారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మధ్య కాలంలో ఓఎల్‌ఎక్స్ మోసాలు విచ్చలవిడిగా జరుగుతుండడం విచారకరమన్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్‌ల ద్వారా వచ్చే కాల్స్‌కు సంబంధించి మీ బ్యాంకు లావాదేవీల సమాచారం ఇచ్చారో విలువుదోపిడీ ఖాయమని హెచ్చరించారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ (బొబ్బిలి) హసీబ్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులు వారి ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఎక్కడా చెప్పరాదని, అపరిచిత వ్యక్తుల వద్ద బ్యాంకు ఖాతా నంబర్లను వెల్లడించరాదన్నారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ వెంకట్ దేశాయ్, సీఐ మురళీధర్, ఎస్సై హరికృష్ణ, అధికారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

విజయనగరం: సీఎం ప్రైజ్‌మనీ కప్ క్రీడాపోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపికలో భాగంగా చీపురుపల్లి నియోజకవర్గస్థాయి ఎంపికలు చీపురుపల్లిలో శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాపాధికార సంస్థ చీఫ్ కోచ్ పి. అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. చీపురుపల్లిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ క్రీడాంశాల్లో ఎంపికలు చేపడతారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు జిల్ల జట్లకు ఎంపికై సీఎం కప్ పోటీల్లో తలపడతారన్నారు. ఈ అవకాశాన్ని ఆసక్తిగల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్పొరేషన్ ఖర్చుల వివరాల పరిశీలన



ఖర్చులపై ఆరా తీస్తున్న ప్రాంతీయ సంచాలకుడు సీతారామారావు

విజయనగరం: విజయనగరం కార్పొరేషన్‌కు సంబంధించి 2021- 22 ఆర్థిక సంవత్సరం ఖర్చుల గణాంక వివరాలను ప్రాంతీయ సంచాలకుడు (ఆడిట్) బి. సీతారామారావు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని దస్త్రాలను పరిశీలించి, అన్ని సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గణాంకాధికారి అరుణకుమారి, నగరపాలక సంస్థ గణాంక అధికారులు సీతారామూర్తి, వెంకటలక్ష్మి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల వివరాలు సేకరించండి

- టీపీఆర్‌ఓ సింహాచలం



సమావేశంలో మాట్లాడుతున్న టీపీఆర్ఓ సింహాచలం

విజయనగరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల వారీగా దివ్యాంగుల వివరాలు సేకరించాలని టీపీఆర్ఓ సింహాచలం అన్నారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో వెల్ఫేర్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే పింఛన్లు అందుకుంటున్న దివ్యాంగుల వివరాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కొండచిలువ హల్‌చల్



జాతీయ రహదారిపై వెళ్తున్న కొండచిలువ

భోగాపురం రూరల్: మండలంలోని సవరవిల్లి వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి కొండచిలువ హల్‌చల్ చేసింది. రహదారిపై అడ్డంగా వెళ్తున్న కొండ చిలువను చూసిన వాహనచోదకులు బెంబేలెత్తిపోయారు. కొండ చిలువ సుమారు 15 అడుగుల పొడవు ఉంటుందని స్థానికులు తెలిపారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లిపోవడంతో వాహనచోదకులు ఊపిరి పీల్చుకున్నారు.

చిన్నారులకు మినరల్ వాటర్



వాటర్ ప్యూరిఫైర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ కర్రోతు వెంకటరమణ

భోగాపురం రూరల్: మండలంలోని పోలిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్యూరిఫైర్ మెషీన్‌ను సర్పంచ్ కర్రోతు వెంకటరమణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్యూరిఫైర్ మెషీన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సమీప గ్రామాలకు చెందిన 190 మంది రోగులను మిమ్స్ వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయి పోరాటం స్ఫూర్తిదాయకం

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



ఆత్మరక్షణ విద్యలో నైపుణ్యాలను ప్రదర్శిస్తున్న బాలికలు

విజయనగరం: ఝాన్సీ లక్ష్మీబాయి దేశభక్తి, ధైర్య సహసాలు, పోరాటపటిమ నేటితరం మహిళలకు స్ఫూర్తి దాయకమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. స్త్రీ శక్తి దివస్‌లో భాగంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి నిర్వహించారు. ముందుగా లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయా కళాశాలల విద్యార్థినులు ప్రదర్శించిన కరాటే, తైక్వాండో, కుంగ్ ఫు, మంటల్లో విద్యార్థినులు చేసిన సాహసకృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రావణి మాట్లాడుతూ, భారత స్వాతంత్య్ర సమరంలో ఝాన్సీ లక్ష్మీబాయి బ్రిటీష్ వారికి ఎదురొడ్డి చూపిన ధైర్య సాహసాలు అసామాన్యమైనవని చెప్పారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో, బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి లోబడి, భగత్‌సింగ్ పౌరుషాన్ని పునికి పుచ్చుకొని ఎందరో మహనీయుల స్ఫూర్తితో ఏబీవీపీ పని చేయడం అభినందనీయమన్నారు.

ఆత్మరక్షణ క్రీడలు దేహ దారుఢ్యానికి, సమయస్ఫూర్తికి ఉపయోగపడతాయని తెలిపారు. మహిళల రక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దిశా చట్టాన్ని తీసుకువచ్చారని, ప్రతి విద్యార్థినీ దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆత్మరక్షణ క్రీడలో జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించిన రేణుకను అభినందించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సుబ్బరాజు, ప్రముఖ వ్యాపారి పల్లంట్ల వెంకటరాజు, ఎల్ఐసీ అడ్మిన్ ఆఫీసర్ రజని, ఆర్ఎస్ఎస్ నగర ప్రతినిధి ప్రేమ్ సుధాకర్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వంశీ, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అవంతి విద్యార్థుల ప్రాజెక్ట్



స్టేట్ మీట్‌కు ఎంపికైన ప్రాజెక్ట్

భోగాపురం రూరల్: తమ కళాశాల విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయి టెక్ - ఫెస్ట్ మీట్‌కు ఎంపిక కావడం ఆనందంగా ఉందని అవంతి పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ హెచ్ఎం దొర అన్నారు. మండలంలోని రావాడ పరిధిలో ఉన్న కళాశాలలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు డి. బాలసుబ్రహ్మణ్యం, టి. గౌతమ్ ఫ్లడ్స్ డిటెక్టర్ ప్రాజెక్ట్ తయారు చేశారన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంఆర్‌జీఆర్ పాలిటెక్నికల్ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లా పాలిటెక్నికల్ టెక్ - ఫెస్ట్‌మీట్‌లో ప్రాజెక్ట్‌ను ప్రదర్శించినట్లు చెప్పారు. ఈ పోటీలో ఉత్తమ ప్రాజెక్ట్‌గా ఎంపికై రాష్ట్రస్థాయి మీట్‌కు నిర్వాహకులు ఎంపిక చేశారన్నారు. విద్యార్థులను ఏఓ అశోక్, డైరెక్టర్ రాఘవరావు, అధ్యాపకులు అభినందించారు.

అభివృద్ధిని అడ్డుకోలేదు..

పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలసలో అభివృద్ధిని తాము అడ్డుకోవడం లేదని మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు మహంతి చిన్నంనాయుడు అన్నారు. రెల్లివలసలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిని సర్పంచ్ అడ్డుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు ఆరోపించడం సరికాదన్నారు. పార్టీలను పక్కన బెట్టి సమన్వయంతో వ్యవహరించి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. గ్రామాభివృద్ధికి తామెప్పుడు సిద్ధమేనని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎంవీజీ శంకరరావు, పతివాడ తమ్మునాయుడు, ఇజ్జరోతు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి మార్గశిర మసోత్సవాలు

విజయనగరం టౌన్: కనక మహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు ఈ నెల 24 నుంచి డిసెంబర్ 23 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు వీకే గాయత్రీశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ విశిష్ట పూజలతో పాటూ ప్రతి గురువారం అభిషేకాలు, అలంకరణలు, కుంకుమార్చనలు ఉంటాయని పేర్కొన్నారు. 29న సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవం ఘనంగా నిర్వహిస్తామన్నారు.

జగనన్న ఇళ్ల పరిశీలన

విజయనగరం రూరల్: మండలంలోని గొల్లలపేట సచివాలయ పరిధిలో జరుగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ గంటా వెంకటరావు, తదితరులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ, నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి డి.తిరుపతినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పంటల యాజమాన్యంతో అధిక దిగుబడులు



పంటకోత ప్రయోగం చేపడుతున్న వ్యవసాయధికారులు

డెంకాడ: సమగ్ర పంటల యాజమాన్యంతో పాటు ప్రకృతి వ్యవసాయం సూచనలు పాటించడం వల్ల వరి పంటలో అధిక దిగుబడులు వచ్చాయని జెడ్‌బీఎన్ఎఫ్ డీపీఎం ఆనందరావు, మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల అన్నారు. మండలంలోని సింగవరం రైతుభరోసా కేంద్రం పరిధిలోని సమగ్ర పంటల యాజమాన్యంతో పండించిన కొర్నాన రమణ పొలంలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమగ్ర పంటల యాజమాన్యం వల్ల వరి పైరుకు ఎటువంటి తెగుళ్లు ఆశించలేదన్నారు. అలాగే మంచి దిగుబడులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ బి.రామకోటి, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



దీపారాధనలో పాల్గొన్న మహిళలు

విజయనగరం టౌన్: సంతపేట జగన్నాథస్వామి ఆలయంలో గౌరమ్మ సంబరాల్లో భాగంగా మహిళలు శుక్రవారం దీపారధ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగౌరీ సేవా సంఘ గౌరవాధ్యక్షుడు భీమశెట్టి ఓంశంకర్, అధ్యక్షుడు కాంద్రేగుల శేఖర్ మాట్లాడుతూ, సంబరాల్లో భాగంగా 20వ తేదీన గవర కులస్తుల వనసమారాధ నిర్వహించనున్నట్లు చెప్పారు. సంబరాల్లో భాగంగా గౌరమ్మకు శనివారం సారె సమర్పిస్తామని చెప్పారు. గౌరమ్మ, నందెన్నలను ఆదివారం సాయంత్రం ఊరేగించి నిమజ్జనం చేస్తామని తెలిపారు. అనంతరం 2022 – 24కి సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు కాంద్రేగుల ఉదయ్‌కుమార్, ఉప కార్యదర్శి పెంటకోట రామునాయుడు, రమేష్ ఉష, కళ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారించండి

విజయనగరం అర్బన్: రహదారి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమీక్షించారు. ప్రమాదాలు జరగడానికి కారణాలు, తమ శాఖల పరంగా తీసుకున్న చర్యలను వైద్యారోగ్యశాఖ, పోలీసు, ఆర్టీసీ, ఆర్అండ్‌బీ, 108 శాఖల అధికారులు వివరించారు. అతివేగం, వాహనాల్లో లోపాలు, రహదారులు బాగులేకపోవడం, నిర్లక్ష్యం, తదితర కారణాలతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు.పంచాయితీరాజ్ రోడ్లలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే 48 ప్రదేశాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నాయని కలెక్టర్ సూర్యకుమారి తెలిపారు. సమావేశంలో జిల్లా రహదారి భద్రతా కమిటీ సభ్యులు మజ్జి అప్పారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కాలం ఒడిలో...' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని గురజాడ కేంద్ర గ్రంథాలయం చా.సో హాల్‌లో రెడ్డి శంకరరావు రచించిన 'కాలం ఒడిలో..' కవితా సంపుటిని సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో సాహితీవేత్త, రచయిత గంటేడ గౌరునాయుడు శుక్రవారం ఆవిష్కరించారు. సుంకరం గోపాలయ్య పుస్తక సమీక్ష చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన అట్టాడ అప్పలనాయుడు, ఎమ్‌వీఎస్.శర్మలు హాజరయ్యారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు పక్కి రవీంద్రనాథ్, కూరెళ్ల శ్రేయ, శ్రీనివాస్, పాయల మురళీకృష్ణ, చీకటి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిరండి

- నేడు అయోధ్యా మైదానంలో భారీ బహిరంగ సభ
- హిందూ ధర్మరక్షా సమితి రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాలరావు



హైందవ శంఖారావం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న హిందూ ధర్మరక్షా సమితి ప్రతినిధులు

విజయనగరం టౌన్:

హైందవ శంఖారావానికి ప్రతి ఒక్కరూ తరలి రావాలని హిందూ ధర్మరక్షా సమితి రాష్ట్ర కార్యదర్శి నందివాడ వేణుగోపాలరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అయోధ్యా మైదానంలో విలేకరులతో మాట్లాడుతూ, కార్యక్రమంలో భాగంగా అయోధ్యా మైదానంలో శనివారం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. హైందవ సంస్కృతి, సనాతన సంప్రదాయాల పరిరక్షణ, తదితర ఆధ్యాత్మిక అంశాలపై ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు, స్వామీజీలు ప్రసంగిస్తారన్నారు. ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి 12 వరకు అఖండహోమం, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు శోభాయాత్ర, అనంతరం ముఖ్య ప్రసంగీకులు సురేశ్వరానందయోగ మహరాజ్, రాధా మనోహర్‌దాస్, యోగి అతిదేశ్వరానంద పర్వత, కెల్ల దుర్గారావు, చేదులూరి గవరయ్య ప్రసంగిస్తారన్నారు. జిల్లాలో ఉన్న హిందువులతో పాటు శివ, అయ్యప్ప, భవానీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు రాయపాటి రామరాజు, కార్యదర్శి శఠగోపం పార్థసారధి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ.శ్యామ్‌సుందర్, సహాయ జిల్లా కార్యదర్శి ఆల్ఫా తరుణ్, టి.జోగిరాజు, ఎం.రాజేష్, నాయుడు, శివ, ప్రసాద్, శ్రీను, చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భోగాపురం: మనిషిని విజ్ఞానం వైపు మళ్లించే గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని.. వాటిని యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని లైబ్రేరియన్ వై.మహేష్ అన్నారు. 55వ గ్రంథాలయ వారోత్సవాల నేపథ్యంలో శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎం వైదా శ్రీరామ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవ ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేస్తామని లైబ్రేరియన్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

డెంకాడ: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులను జూనియర్, సీనియర్ విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించినట్లు లైబ్రేరియన్ వై. మహేష్ తెలిపారు. డ్రాయింగ్ సీనియర్ విభాగంలో స్వప్న, వాగ్దేవి.. జూనియర్ విభాగంలో దేవేంద్ర, అభిమన్యు విజేతలుగా నిలిచారు. వ్యాసరచన పోటీల్లో సీనియర్ విభాగంలో వాగ్దేవి, జోషిత.. జూనియర్ విభాగంలో రవళి, ఎం.జ్యోత్స్న ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీటీసీ సలహాదారు పదాల భానుప్రకాష్

భోగాపురం: త్వరలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న సీఎం ప్రైజ్‌మనీ వాలీబాల్ టోర్నమెంట్‌కు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వాలీబాల్ (బాలురు, బాలికలు) క్రీడాకారుల ఎంపిక శుక్రవారం నిర్వహించారు. వాలీబాల్ పోటీల నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగిడి నాగన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సలహాదారు పదాల భానుప్రకాష్ పాల్గొని క్రీడాకారుల ఎంపికలు ప్రారంభించారు. నాలుగు మండలాల నుంచి 40 మంది క్రీడాకారులు పాల్గొనగా బి.రాజా, ఎం.వెంకటరమణ, జె.సాయి, ఎస్.కిషోర్, డి.కనకరాజు, ఆర్.నవీన్‌కుమార్, కె.రమణ, డి.ఆనంద్, ఎస్.రామ్‌చంద్ర, జి.రాంబాబు, ఎం.ప్రకాశ్, పి.వర్షన్ సీఎం ప్రైజ్‌మనీ వాలీబాల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. కార్యక్రమంలో హెచ్ఎం వైదా శ్రీరామ్, మాజీ నేషనల్ వాలీబాల్ క్రీడాకారుడు రామిశెట్టి రాంబాబు, క్రీడాకారులు, వివిధ పాఠశాలల పీడీలు, తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీలతో విజ్ఞానం



పేపర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈఓ తదితరులు

నెల్లిమర్ల: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి పోటీలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు అన్నారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి పోటీలు శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి పరీక్ష పేపర్లను ఎంఈఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోటీ పరీక్షల వల్ల విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచి పెరుగుతుందన్నారు. ఈ పోటీ పరీక్షలకు మండలంలోని 14 పాఠశాలల నుంచి మొత్తం 63 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొయిద విద్యార్థులు ప్రథమ, సతివాడ మోడల్ పాఠశాల విద్యార్థులు ద్వితీయ, నెల్లిమర్ల బాలికోన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానాలు సాధించారు.

అందుబాటులో ఆధార్ సేవలు



ఆధార్ సేవలు ప్రారంభిస్తున్న సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి

భోగాపురం రూరల్: మండలంలోని సుమారు 12 సచివాలయాల పరిధిలో ఉన్న ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా ఎ. రావివలస సచివాలయంలో ఆధార్ సేవలు శుక్రవారం ప్రారంభించినట్లు సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ఆధార్ నమోదుకి గాని మార్పులు, చేర్పులకు ప్రతి ఒక్కరూ మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇకపై అటువంటి ఇబ్బందుల్లేకుండా రావివలసలోనే ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సెక్రటరీ స్వర్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వంశీ, డిజిటల్ అసిస్టెంట్ బంగార్రాజు, మహిళా పోలీస్ రీనాపాల్, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై నిర్లక్ష్యం తగదు

- డీపీఎంఓ తిరుపతిరావు



పాదరక్షలు అందజేస్తున్న డీపీఎంఓ తిరుపతిరావు

విజయనగరం ఫోర్ట్: కుష్టువ్యాధిపై నిర్లక్ష్యం తగదని డీపీఎంఓ (డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్) కె. తిరుపతిరావు అన్నారు. స్థానిక పూల్‌బాగ్ కాలనీలో లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో కుష్టురోగులకు శుక్రవారం పాదరక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శలేని, మొద్దుబారిన పాదాలు కలిగిన వారు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. స్పర్శ, నొప్పి లేని మచ్చలుంటే కుష్టువ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లెప్రా సొసైటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ మామిడి రాధిక, జిల్లా కో ఆర్డినేటర్ లెంక రమణ, మాలతి, సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరిపై పైడితల్లి ఆశీస్సులు



సభ్యులకు అమ్మవారి చిత్రపటాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు ఆకాంక్షించారు. స్థానిక లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో పైడిమాంబ కళానికేతన్ వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో ఆధ్వర్యంలో పైడితల్లి మహత్యం చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా జరుగుతున్న క్రమంలో శుక్రవారం అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి జీవితచరిత్రపై రూపుదిద్దుకుంటున్న చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా పూర్తిచేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముళ్లపూడి సుభద్రాదేవి, సామవేదుల సత్యలత, గీతారాణి, కె.కనకారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'25 నుంచి లింగ వివక్ష వ్యతిరేక ప్రచారం'

సాక్షి, అమరావతి: కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సూచన మేరకు ఈ నెల 25 నుంచి డిసెంబర్ 23 వరకు లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రభుత్వం ప్రచార కార్యక్రమాలను నిర్వహించనుంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర స్థాయి ప్రచార కార్యక్రమాల్లో భాగస్వామ్యం ఉండే పలు శాఖల అధికారులతో శుక్రవారం సెర్ప్ సీఈవో ఇంతియాజ్ సమావేశం నిర్వహించారు. దీనికి పాఠశాల విద్యా శాఖ, స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ, రాష్ట్ర ప్రచార పౌర సంబంధాల శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఏపీ మహిళా కమిషన్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ- మెప్మా, వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లీ ఏబుల్డ్ సీనియర్ సిటిజెన్ అండ్ ట్రాన్స్ జెండర్, సర్వశిక్షా అభియాన్ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. కాగా, దేశవ్యాప్తంగా 75 'జెండర్ రిసోర్స్ సెంటర్స్'ను ఈ నెల 25న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించనున్నారు.

నేటి నుంచి 'మతసామరస్య వారోత్సవాలు'

సాక్షి, అమరావతి: ఈ నెల 19 నుంచి25 వరకు మతసామరస్య ప్రచార వారోత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్య కార్యదర్శి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల మధ్య మత సామరస్యం, జాతీయ సమైక్యత విలువలను పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలనే లక్ష్యంతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్వయంప్రతిపత్తి గల మతసామరస్య జాతీయ సంస్థను 1992లో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి ఈ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నవంబర్ 19 నుండి 25 వరకు దేశ వ్యాప్తంగా మతసామరస్య ప్రచార వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. వారోత్సవాల చివరి రోజైన 25 న ఫ్లాగ్ డే ను జరపాలన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఏపీలోని అన్ని జిల్లాల్లోను శాంతి, సామరస్యం, జాతీయ సమైక్యత విలువలను ప్రజల్లో పెంపొందించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్లు, డిబేట్లు, పెయింటింగ్ పోటీలను నిర్వహించాలన్నారు. మతసామరస్య జాతీయ సంస్థ పలు పథకాలు, ప్రాజెక్టులను కొనసాగించేందుకు మరింత విస్తృత స్థాయిలో నిర్వహించేందుకు అవసరమైన నిధుల సేకరణ కార్యక్రమాన్ని కూడా ఈ వారోత్సవాల్లో చేపట్టాలన్నారు.



సులువైన పాస్‌వర్డ్‌తో సైబర్ ముప్పు

బలహీనమైన వాటితో నష్టపోతున్న ఆన్‌లైన్ యూజర్లు

- గుర్తుంచుకోవాలనే ఉద్దేశంతో సులువైన పాస్‌వర్డ్‌ల ఎంపిక
- అక్షరాలు, నంబర్లు, సింబల్స్ ఉంటేనే సెక్యూరిటీ ఎక్కువ
- సాధారణ పాస్‌వర్డ్‌ల జాబితా విడుదల చేసిన 'నార్డ్‌పాస్'
- 83 శాతం పాస్‌వర్డ్‌లను సెకనులోగా క్రాక్ చేయొచ్చని వెల్లడి

సాక్షి, అమరావతి

ఈ సాంకేతిక యుగంలో ఆన్‌లైన్ వినియోగం రోజురోజు పెరుగుతోంది. నగదు చెల్లింపులు, మనీ ట్రాన్స్‌ఫర్లు, ఈ మెయిల్స్, సామాజిక మాధ్యమాలు ఇలా ఒకటేమిటి ఎన్నో సర్వీసులు నేడు ఆన్‌లైన్ ద్వారానే జరుగుతున్నాయి. ఆన్‌లైన్ వినియోగంలో పోటీపడుతున్న యూజర్లు.. పాస్‌వర్డ్ ఎంపికలో మాత్రం వెనుకబడుతున్నారు. గుర్తు పెట్టుకోవడానికి వీలుగా అక్షరాలు, అంకెలను పాస్‌వర్డ్‌లుగా పెట్టుకుంటూ సైబర్ దాడులకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే గ్లోబల్ పాస్‌వర్డ్ మేనేజర్ 'నార్డ్‌పాస్' 2022లో ప్రపంచ దేశాల్లో ఎక్కువగా వినియోగిస్తున్న 200 అత్యంత సాధారణ పాస్‌వర్డ్‌ల జాబితాను ఇటీవల విడుదల చేసింది. ఇందులో 83 శాతం పాస్‌వర్డ్‌లను కేవలం ఒక సెకనులోపు క్రాక్ చేయొచ్చని వెల్లడించింది.

ఓపెన్ అథెంటికేషన్ ముఖ్యం

2022లో ఉపయోగించిన 200 అత్యంత సాధారణ పాస్‌వర్డ్‌లలో 73 శాతం గత సంవత్సరం మాదిరిగానే ఉన్నాయని నివేదిక స్పష్టం చేస్తోంది. అయితే ఓపెన్ అథెంటికేషన్ 2.0, టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ వంటి వెరిఫికేషన్ వ్యవస్థలు వేగంగా అభివృద్ధి చెందుతున్న కారణంగా సైబర్ నేరగాళ్లు పాస్‌వర్డ్‌లను క్రాక్ చేయడం కష్టమవుతోందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. అందుకే మునుపటి సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుతం పాస్‌వర్డ్‌ల వినియోగంలో వ్యత్యాసం లేదని వివరించింది. ఇదిలా ఉంటే స్టాటిస్టా నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా సైబర్ దాడులకు గురవుతున్న దేశాల్లో భారత్ నాల్గవ స్థానంలో ఉండటం గమనార్హం. ప్రజలు బలమైన పాస్‌వర్డ్‌లను సెట్ చేయడానికి పెద్దగా సమయాన్ని వెచ్చించకపోవడం సైబర్ నేరగాళ్లకు అవకాశాలను కల్పిస్తోంది.

తొలి స్థానంలో 'పాస్‌వర్డ్'!

'పాస్‌వర్డ్', '123456' వంటి సాధారణ పాస్‌వర్డ్‌లను భారతదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా ఉపయోగిస్తున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 'పాస్‌వర్డ్'ను ప్రపంచ వ్యాప్తంగా 4.9 మిలియన్ సార్లు, భారత్‌లో 3.4 మిలియన్ సార్లు వినియోగించారు. వీటితో పాటు '123456', పాస్‌వర్డ్@123, పాస్‌వర్డ్123, పాస్‌వర్డ్@1, పాస్‌వర్డ్1, క్యూడబ్ల్యూఈఆర్‌టీవై123, షాపింగ్, వెల్కమ్@123, ఓంసాయిరాం, సాయిబాబా, సాయిరాం, కంప్యూటర్, బ్యాంకింగ్, ఏబీసీడీఈఎఫ్‌జీహెచ్, లాగిన్ వంటి సాధారణ పాస్‌వర్డ్ ఎంపికలను గుర్తించింది. వీటిని సైబర్ నేరగాళ్లు సులభంగా చేధిస్తారని నివేదిక హెచ్చరించింది. కొత్తగా 'బిగ్‌బాస్కెట్' పదం దేశంలో అత్యధికంగా వాడుతున్న పాస్‌వర్డ్‌ల జాబితాలో నాల్గవ స్థానంలో నిలిచింది. అన్‌మోల్123, గూగుల్‌డమ్మీ, ఇండియా123 వంటి పాస్‌వర్డ్‌లు అధికంగా వాడుకలో ఉన్నాయి. దేశంలో 'ఐలవ్‌యూ' పదం పాస్‌వర్డ్‌గా 81వ స్థానంలో నిలవగా ఇతర దేశాల ప్రజలు కూడా తమ స్థానిక భాషల్లో ఇదే పదాన్ని పాస్‌వర్డ్‌గా విస్తృతంగా వాడుతున్నారు. ఇలాంటి సాధారణ పాస్‌వర్డ్‌లతో వ్యక్తులు, సంస్థలపై సైబర్ దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని 'నార్డ్‌పాస్' హెచ్చరించింది.

బలమైన పాస్‌వర్డ్ ఇలా..

బలమైన పాస్‌వర్డ్ కోసం పెద్ద, చిన్న అక్షరాల కలయికతో పాటు నంబర్లు, చిహ్నాలను కూడా జోడించాలి. ఇలా చేయడం వల్ల పాస్‌వర్డ్‌ను అంచనా వేయడం కష్టం అవుతుంది. ఫోన్ నంబర్లు, చిరునామా, పుట్టిన తేదీలు, పేర్లను పాస్‌వర్డ్‌గా పెట్టుకోకూడదు. డేటా బ్రీచెస్, సైబర్ అటాక్స్ నుంచి తప్పించుకోవడానికి 12-16 క్యారెక్టర్ల పాస్‌వర్డ్‌ను ఎంపిక చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

కోర్టు ధిక్కార వ్యాజ్యాలు పెరగడంపై హైకోర్టు ఆందోళన

కోర్టు ఆదేశాలను అమలు చేసి తగ్గిస్తామన్న ఏజీ

సాక్షి, అమరావతి: తమ ఆదేశాలను అధికారులు అమలు చేయడం లేదంటూ దాఖలవుతున్న కోర్టు ధిక్కార వ్యాజ్యాల సంఖ్య పెరిగిపోతుండటంపై హైకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. కోర్టు ధిక్కార వ్యాజ్యాల సంఖ్య ఈ ఏడాది ఇప్పటి వరకు 4,300 దాటిపోవడంపై ఒకింత విస్మయం వ్యక్తంచేసింది. ధిక్కార వ్యాజ్యాల సంఖ్య ఎలా పెరుగుతోందో... అదే విధంగా హైకోర్టు ఎదుట ప్రభుత్వ ఉన్నతాధికారుల హాజరు కూడా పెరుగుతోందని వ్యాఖ్యానించింది. దీనిపై ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ స్పందిస్తూ... కోర్టు ఆదేశాలను అమలు చేసి, ధిక్కార వ్యాజ్యాల సంఖ్యను గణనీయంగా తగ్గిస్తామని నివేదించారు. పెన్షన్ ప్రయోజనాలు పొందేందుకు తమ సర్వీసు క్రమబద్ధీకరించడానికి ముందుగా చేసిన సర్వీసును కూడా లెక్కించేలా అధికారులను ఆదేశించాలంటూ 1985-91 మధ్య ప్రభుత్వ పాఠశాలల్లో పార్ట్ టైం టీచర్లుగా పనిచేసిన పలువురు ఏపీ పరిపాలనా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ట్రిబ్యునల్ వీరికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీనిపై ప్రభుత్వం హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అక్కడ ప్రభుత్వానికి సానుకూలంగా ఉత్తర్వులు రాలేదు. అయినా తమ సర్వీసు లెక్కింపు విషయంలో అధికారులు కోర్టు ఆదేశాలను అమలు చేయడం లేదంటూ ఆ పార్ట్ టైం టీచర్లు హైకోర్టులో కోర్టు ధిక్కార వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారణ చేసిన జస్టిస్ శేషసాయి ధర్మాసనం... పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, అప్పటి కమిషనర్, విశ్రాంత అధికారి చినవీరభద్రుడు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. దీంతో వారు శుక్రవారం ధర్మాసనం ముందు హాజరయ్యారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది పీఎస్‌పీ సురేష్‌కుమార్ వాదనలు వినిపిస్తూ కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడం వల్లే ఈ వ్యాజ్యాలు దాఖలు చేయాల్సి వచ్చిందని తెలిపారు. అధికారుల తరఫున హాజరైన అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ... సర్వీసు క్రమబద్ధీకరణకు ముందు పిటిషనర్లు అందించిన సర్వీసును సైతం పరిగణనలోకి తీసుకుంటూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని తెలిపారు. వారికి ఆర్థిక ప్రయోజనాలను ఫిబ్రవరిలో చెల్లిస్తామన్నారు. ఏజీ వాదనను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం తదుపరి విచారణను 2023, ఫిబ్రవరి 17వ తేదీకి వాయిదా వేసింది. అధికారులకు తదుపరి విచారణ నుంచి మినహాయింపు ఇచ్చింది. ఈ కేసు విచారణ సమయంలోనే కోర్టు ధిక్కార వ్యాజ్యాల సంఖ్య పెరిగిపోతుండటంపై ధర్మాసనం పలు వ్యాఖ్యలు చేసింది.

• తెలంగాణ

కేసినో వ్యవహారంలో ఈడీ విచారణ

మంత్రి తలసాని పీఏ హరీశ్‌కు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: విదేశాలకు తీసుకెళ్లి కేసినోలు ఆడించిన చీకోటి ప్రవీణ్‌కుమార్ కేసుకు సంబంధించి పూర్తిస్థాయిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూపీ లాగుతోంది. ఫెమా నిబంధనల ఉల్లంఘన, మనీ లాండరింగ్, హవాలా లావాదేవీలు తదితర అంశాలు ఇందులో ముడిపడి ఉన్న నేపథ్యంలో ఈడీ అధికారులు ఈ కేసినోలో పాలుపంచుకున్న వారందరికీ నోటీసులు జారీ చేసి క్షుణ్ణంగా విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. ఇదివరకే నోటీసులు అందుకున్న టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ శుక్రవారం ఈడీ ఎదుట హాజరయ్యారు. తన బ్యాంకు లావాదేవీల పత్రాలతో వచ్చిన రమణ తాను కేసినోలో పాలు పంచుకోలేదని స్పష్టం చేసినట్లు సమాచారం. ఈడీ అధికారులు మాత్రం నేపాల్‌కు వెళ్లడానికి తీసుకున్న విమాన టికెట్ల ఆధారంగా ఆయనను ప్రశ్నించినట్లు చెబుతున్నారు. అధికారులు ప్రశ్నలు సంధిస్తున్న సమయంలో షుగర్ లెవల్స్ పడిపోవడంతో రమణను సోమాజిగూడ యశోద ఆసుపత్రికి తరలించారు.

మంత్రి తలసాని పీఏకు కూడా ..

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పీఏ హరీశ్‌ను విచారణకు హాజరు కావాలని ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసుల వ్యవహారం ఇంకా ఎక్కడి దాకా వెళ్తుందోనన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కేసినో వ్యవహారంలో మొత్తం 18 మంది రాజకీయ నేతలకు సంబంధం ఉందని అధికారులు గుర్తించినట్లు సమాచారం. వీరందరికీ నోటీసులు జారీ చేస్తారన్న ప్రచారం జరుగుతోంది.

• తెలంగాణ

టీఆర్‌ఎస్‌లో 'టికెట్' ఫీవర్!

సాక్షి, హైదరాబాద్: మునుగోడు ఉప ఎన్నిక ముగిసిన వెంటనే వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై టీఆర్‌ఎస్ ఫోకస్ చేసింది. సిట్టింగ్ ఎమ్మెల్యేలకే తిరిగి అవకాశమిస్తామని మూడు రోజుల కింద తెలంగాణభవన్‌లో జరిగిన టీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటించారు. అయితే బహుళ నాయకత్వమున్న నియోజకవర్గాల్లో ఏం చేస్తారన్నది ఆసక్తిగా మారింది. తొలి నుంచీ టీఆర్‌ఎస్‌లో ఉన్న, ఇటీవలకాలంలో చేరిన ఆశావహుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే 'కారు' ఓవర్‌లోడ్ అయిన పరిస్థితుల్లో టికెట్ దక్కే అవకాశం లేనివారి స్పందన ఎలా ఉంటుందన్నది చర్చనీయాంశంగా మారింది. అలాంటి వారిపై టీఆర్‌ఎస్ పెద్దలు ఓ కన్నేసినట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. మరోవైపు తాము పార్టీ అధినేతను నమ్ముకుని ఉన్నామని, తమకు న్యాయం చేస్తారని టికెట్ ఆశిస్తున్న ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు పేర్కొనడం గమనార్హం. 2018లోనూ ఐదుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరించిన పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లోనూ కొందరు సిట్టింగ్‌లను తప్పిస్తారనే ఆశాభావం కొందరి నేతల్లో కనిపిస్తోంది. ఇదిలా ఉంటే కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ వారసులను వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ తరఫున ఆరంగేట్రం చేయించాలనే ఆశతో ఉన్నారు. సిట్టింగ్‌లకే టికెట్లు అనే కేసీఆర్ ప్రకటన వారసుల రంగ ప్రవేశంపై ఎంత మేర ప్రభావం చూపు తుందనే చర్చ కూడా జరుగుతోంది.

అమిత్‌షాతో మర్రి శశిధర్‌రెడ్డి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మర్రి శశిధర్‌రెడ్డి త్వరలో కాషాయ కండువా కప్పుకోనున్నారు. ఆయన బీజేపీలో చేరనున్నారని కొన్ని రోజులుగా రాజకీయవర్గాల్లో ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మర్రి శశిధర్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఢిల్లీలో బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. సుమారు 40 నిమిషాలపాటు జరిగిన ఈ సమావేశంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై మర్రి శశిధర్‌రెడ్డితో అమిత్‌షా మాట్లాడినట్టు తెలిసింది. తెలంగాణలో టీఆర్‌ఎస్‌ను దీటుగా ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పనులు, విధానాలు తదితర అంశాలనూ ప్రస్తావించినట్టు సమాచారం.

మామిడిసేకరణ కేంద్రానికి భూమి పూజ



మామిడిసేకరణకేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు

మెరకముడిదాం: మామిడి సేకరణ కేంద్రం ఏర్పాటుతో మామిడి రైతులకు మేలు కలుగుతుందని జెడ్పీ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు తెలిపారు. సోమలింగాపురం గ్రామంలో సువర్ణరేఖ మామిడిరైతుల సంఘం అధ్యక్షుడు శిరువూరునారాయణమూర్తిరాజు ఆధ్వర్యంలో మామిడిపంట సేకరణ కేంద్రం నిర్మాణానికి జెడ్పీ చైర్మన్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, తాడ్డివేణుగోపాలరావు, కోట్లవిశ్వేశ్వరరావు, కోట్లమోతీలాల్‌నాయుడు, ఉద్యానవన శాఖాధికారులు పాల్గొన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థ భేష్



సరకుల నాణ్యతను పరిశీలిస్తున్న అరుణ్ కుమార్ సైగల్

విజయనగరం అర్బన్: జిల్లాలో ప్రజాపంపిణీ వ్యవస్థ భేషుగ్గా ఉందని కేంద్రప్రభుత్వ ఎఫ్అండ్ పీడీ శాఖ సెక్రటరీ హెచ్‌అరుణ్‌కుమార్ సైగల్ అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని కంటోన్మెంట్ రేషన్ డిపోను శుక్రవారం సందర్శించారు. నిత్యావసర సరుకులు లబ్ధిదారులకు అందించే తీరును తెలుసుకున్నారు. రాష్ట్రప్రభుత్వం నేరుగా ఇంటి వద్దకే సరకులను అందజేయడాన్ని అభినందించారు. రేషన్ డిపోకి వచ్చిన లబ్ధిదారుల నుంచి సూచనలు తీసుకున్నారు. నూనె, రాగులు సరఫరా చేయాలని పలువురు కోరారు. ఆయన వెంట డీఎస్ఓ మధుసూదనరావు, సీఎస్‌డీటీలు జగన్, కె.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

స్కిల్ కళాశాలకు 22 మంది

విజయనగరం అర్బన్: జిల్లా గ్రామాణాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త నిర్వహణలో శుక్రవరం స్థానిక టీటీడీసీ మహిళా ప్రాంగణంలో స్కిల్ కళాశాలలకు ఎంపికలు నిర్వహించారు. ఇంజినీరింగ్, డిప్లమో, తదితర కోర్సులు చేసిన 52 మంది అభ్యర్థులు హాజరుకాగా... అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని ఎంఎస్ఎంఈ స్కిల్ కళాశాలలకు 10 మంది, విశాఖ పట్టణం సింధియాలో ఉన్న సీఈఎంఎస్ స్కిల్ కళాశాలకు 11 మంది ఎంపికయ్యారు. వీరికి ఆరు నెలల పాటు శిక్షణ ఉంటుందని డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి తెలిపారు.

డివిజన్ వారీగా నవంబర్ నెల ఎన్ఎఫ్ఎస్ఏ కార్డులు, బియ్యం

డివిజన్	కార్డులు	బియ్యం మెట్రిక్ టన్నులు
బొబ్బిలి	1,26,391	1,827.7
చీపురుపల్లి	1,76,527	2,556.8
విజయనగరం	2,48,148	3,613.9
మొత్తం	5,51,066	7,998.5



నేటి నుంచి ఉచిత బియ్యం పంపిణీ

- 5,51,066 మంది ఎన్ఎఫ్ఎస్ఏ రేషన్ కార్డుదారులకు ప్రయోజనం
- వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు సమాచారం

విజయనగరం అర్బన్:

జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) పరిధిలోని లబ్ధిదారులకు ఉచిత బియ్యం పంపిణీకి జిల్లా పౌరసరఫరాల శాఖ రంగం సిద్ధం చేసింది. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన (పీఎంజీకేఏవై) పథకం కింద మంజూరైన బియ్యాన్ని జిల్లాలోని రేషన్ దుకాణాల నుంచి లబ్ధిదారులకు శనివారం నుంచి పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో లబ్ధిదారుకు 5 కిలోల చొప్పున పంపిణీకి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. డీలర్ దగ్గర నేరుగా జనరేట్ అయిన అర్హుల జాబితా మేరకు పంపిణీ చేయనుంది. ఇప్పటికే వరుసగా మూడునెలలు పంపిణీ జరగ్గా, నాలుగో నెల సరుకుల పంపిణీకి చర్యలు చేపట్టింది. లబ్ధిదారులు నేరుగా చౌకదుకాల వద్ద వెళ్లి బియ్యం తీసుకోవాలి. ఈ నెలాఖరులోగా శత శాతం పంపిణీయే లక్ష్యంగా యంత్రాంగం ముందుకు సాగుతోంది.

5,51,066 మందికి ప్రయోజనం

జిల్లా పరిధిలోని పీఎంజీకేఏవై పథకం కింద ఎన్ఎఫ్ఎస్ఏ పరిధిలోని రేషన్ కార్డుల లబ్ధిదారులు 5,51,066 మందికి ప్రయోజనం కలగనుంది. జిల్లాలోని 5,71,884 సాధారణ రేషన్ కార్డుల్లో 97 శాతం లబ్ధిదారులను ఎన్ఎఫ్ఎస్ఏ పరిధి రేషన్ కార్డుదారులుగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది గుర్తించింది. 27 మండలాల్లో అత్యధికంగా విజయనగరం మండలంలో 68,467 లబ్ధిదారులకు ఎన్ఎఫ్ఎస్ఏ గుర్తింపు లభించింది. తరువాత వరుసలో బొబ్బిలి మండలంలో 34,050 మంది, రాజాంలో 26,857, పూసపాటిరేగ మండలంలో 23,391 మంది ఉన్నారు. అత్యల్పంగా వంగర మండలంలో 12,038 మంది, మెంటాడలో 13,921 మంది, బాడంగి మండలంలో 14,078 మంది లబ్ధిదారులు ఉన్నారు.

ఏర్పాట్లు పూర్తిచేశాం



జిల్లాలోని ఎన్ఎఫ్ఎస్ఏ లబ్ధిదారులకు ఉచిత బియ్యం పంపిణీ ప్రక్రియ మూడు నెలలుగా చేపడుతున్నాం. నవంబర్ నెల బియ్యం పంపిణీకి రంగం సిద్ధం చేశాం. శనివారం నుంచి షెడ్యూల్ ప్రకారం పంపిణీ పూర్తి చేస్తాం. పంపిణీ వ్యవస్థపై లబ్ధిదారులకు అవగాహన కలిగిస్తున్నాం. ఎలాంటి అవకతవకలు లేకుండా పాదర్శకంగా బియ్యాన్ని పంపిణీ చేస్తున్నాం.
– కె.మధుసూదనరావు, డీఎస్ఓ

శంబర జాతర తేదీలు ఖరారు

- వచ్చే ఏడాది జనవరి 23, 24, 25 తేదీల్లో పోలమాంబ అమ్మవారి జాతర



మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతర తేదీలు ఖరారయ్యాయి. ఆలయ ఈఓ బీఎల్ నగేష్, ట్రస్టుబోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, కమిటీ సభ్యులు, గ్రామపెద్దల సమక్షంలో అమ్మవారి చదురుగుడిలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో జాతర తేదీలను ప్రకటించారు. వచ్చేఏడాది జనవరి 23వ తేదీన తొలేళ్ల ఉత్సవం, 24న సిరిమానోత్సవం, 25న అనుపోత్సవం జరగనుంది. వచ్చేనెల 19వ తేదీన పెద పోలమాంబ అమ్మవారిని గ్రామంలోకి తెచ్చేందుకు చాటింపు వేస్తారు. 26న పెద పోలమాంబ అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానిస్తారు. వారం రోజుల పా టు పెద్దమ్మవారికి భక్తులు పూజ లు చేస్తారు. వచ్చేఏడాది జనవరి 2వ తేదీన తొలేళ్ల ఉత్సవం, 3న ప్రధానోత్సవం, 4వ తేదీన పెద పోలమాంబ అమ్మవారి అనుపోత్సవం నిర్వహిస్తారు. అదేరోజు శంబర పోలమాంబ అమ్మవారిని తెచ్చేందుకు చాటింపు వేస్తారు. జనవరి 9న గ్రామంలోకి శంబర పోలమాంబ అమ్మవారిని తీసుకొస్తారు. అప్పటి నుంచి 14 రోజుల పాటు చదురు గుడిలో పోలమాంబ అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. జనవరి 31వ తేదీన మారుజాతర జరగనుంది. సమావేశంలో సర్పంచ్ సింహాచలమమ్మ, ఎంపీటీసీ సభ్యుడు పోలినాయుడు, గంజి కాశినాయుడు, రెవిన్‌నాయుడు, పూడి, కరణం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లు తొలగించొద్దు..



జేసీబీ ముందుకు కూర్చున్న మహిళలు

కొత్తవలస రూరల్: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో పూడి భాస్కరరావు అనే వ్యక్తి వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్ 63/1లో అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నట్టు దేవదాయ శాఖ అధికారులు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దీనిని తొలగించేందుకు జేసీబీను తీసుకుని శుక్రవారం వెళ్లారు. జేసీబీ ముందు మహిళలు కూర్చోవడంతో చేసేది లేక తొలగింపు ప్రయత్నాన్ని వాయిదా వేసినట్టు ఆలయ ఈఓ నాగేంద్ర తెలిపారు. దేవస్థానానికి చెందిన 170 ఎకరాల్లో ఆక్రమణలు ఉండగా, తన ఇంటినే తొలగించడం అన్యాయమని భాస్కరరావు వాపోయారు.

వ్యవసాయంలో.. నూతన ఆవిష్కరణలు స్వాగతించాలి

- పంటల మార్పిడిలో లాభదాయక విధానాలకు ప్రాధాన్యం
- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్:

మారుతున్న పరిస్థితులను బేరీజు వేసుకుంటూ వ్యవసాయ రంగంలో వచ్చే నూతన ఆవిష్కరణలను స్వాగతించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పిలుపునిచ్చారు. సంప్రదాయ పద్ధతులను గౌరవిస్తూనే సాగు విధానంలో ఆధునిక పద్ధతులను అవలంబించాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమాశంలో ఆమె పలు అంశాలపై మాట్లాడారు. లాభదాయక పంటలను సాగుచేయడం ద్వారా ఆర్థిక ప్రయోజనాలను పొందాలని సూచించారు. తక్కువ కాలంలో చేతికందే పంటల సాగుకు ప్రాధా న్యమివ్వాలని సూచించారు. వచ్చే సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని మైనర్ సాగునీటి కాలువలను అభివృద్ధి చేయాలని, పూడికలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రణాళికాయుతంగా వ్యవహరించి అన్నీ సిద్ధం చేసుకోవాలని సూచించారు.

సాగు ఖర్చు తగ్గించాలి

సమావేశంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ ఆధునిక సాగు పద్ధతులు అవలంబించేలా రైతులను ప్రోత్సహించి సాగు ఖర్చును తగ్గించేలా చూడాలన్నారు. నిర్ణీత కాలంలో పంటలు వేసేలా రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు.

పీఎంఎంఎస్‌వైతో యువతకు ఉపాధి

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పీఎంఎంఎస్‌వై) ద్వారా జిల్లాలో మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేసి, యువతకు ఉపాధి కల్పించాలని కలెక్టర్ ఎ. సూర్యకుమారి ఆదేశించారు. ఈ పథకం ద్వారా జిల్లాలో మత్స్య పరిశ్రమ వృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. పీఎంఎంఎస్‌వై పథకం అమలుపై కలెక్టర్ తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మత్స్యకారుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చేందుకు పీఎంఎంఎస్‌వై పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. 2020-21, 2021-22 సంవత్సరాలకు సంబంధించి పథకానికి జిల్లాలో 219 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. బయోఫ్లాట్ విధానంలో చేపల పెంపకం, చేప పిల్లల నిల్వ కేంద్రాలు, సముద్రాలు, నదులల్లో కేజ్ యూనిట్ల ద్వారా చేపల సాగు, ఐస్‌బాక్స్‌లతో మోటార్ సైకిళ్ల పంపిణీ, లైవ్ ఫిష్ విక్రయకేంద్రాలు, ఫిష్ కియోస్క్‌లు, చేపలబజార్ల ఏర్పాటు, తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డీడీ ఎస్.నిర్మలాకుమారి, జెడ్పీ సీఈఓ డాక్టర్ ఎం.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సహకరించండి

పేదలకు అమలు చేసే పథకాలకు బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ సూర్యకుమారి కోరారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎల్‌డీఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన స్పెషల్ డీసీసీ సమావేశంలో ఆమె మాట్లాడారు. బ్యాంకు అధికారులు సహకరిస్తేనే సంక్షేమ పథకాల అమలుసాధ్యమన్నారు. ఇళ్ల నిర్మాణాలకు, జగనన్న తోడు పథకానికి రుణాలు మంజూరు చేయాలని కోరారు. అనతంరం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముద్రించిన ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ స్కీమ్ కరపత్రాన్ని అవిష్కరించారు.

సీడ్ డ్రిల్లింగ్, జీరో టిల్లేజ్ విధానాలకు ప్రాధాన్యం

రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రానికి చెందిన ప్రిన్సిపాల్ సైంటిస్ట్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతిక అభివృద్ధిని వివరించారు. జీరో టిల్లేజ్ (దుక్కి దున్నకుండా) విధానాన్ని అనుసరించడం ద్వారా సాగు ఖర్చు తగ్గుతుందని లాభాలు చేకూరుతాయని పేర్కొన్నారు. అలాగే సీడ్ డ్రిల్లింగ్ విధానం ద్వారా తక్కువ కాలంలో వరి పంట ఫలాలను పొందవచ్చని, మనుషుల అవసరం కూడా తగ్గుతుందని చెప్పారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, వ్యవసాయ శాఖ జేడీ వీటీ రామారావు, ప్రకృతి వ్యవసాయ విభాగ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆనందరావు, పశుసంవర్ధక శాఖ జేడీ రమణ, సివిల్ సప్లైస్ ఎం.డి మీనాకుమారి, మత్స్య శాఖ డీడీ నిర్మలాకుమారి, మార్కెటింగ్ శాఖ ఎ.డి శ్యామ్‌కుమార్, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, నీటిపారుదల, విద్యుత్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సందర్భం

'బిగ్గెస్ట్ రిస్క్ ఏమిటో తెలుసా? రిస్క్ చేయకపోవడమే' అంటాడు మెటా సీయీవో మార్క్ జుకర్ బర్గ్. మెటాలో భాగమైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లు ప్రస్తుతం రకరకాల సమస్యలు, సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి క్లిష్టపరిస్థితులలో రానున్న జనవరిలో 'మెటా ఇండియా' వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించబోతోంది సంధ్యా దేవనాథన్.

ఆంధ్రా యూనివర్శిటీ నుంచి ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ వరకు ఎన్నో ప్రసిద్ధ విద్యాలయాల్లో చదువుకున్న సంధ్య నిత్య విద్యార్థి. అదే ఆమె నైపుణ్యం. నాయకత్వ బలం...

మెటా పవర్

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌ల మాతృసంస్థ 'మెటా' సంధ్యా దేవనాథన్‌ను 'మెటా ఇండియా' వైస్ ప్రెసిడెంట్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించింది.

ఆంధ్రాయూనివర్శిటీ(ఏయూ, విశాఖపట్టణం)లో కెమికల్ ఇంజనీరింగ్ చేసిన సంధ్య ఢిల్లీ యూనివర్శిటీలో ఎంబీఏ చేసింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో 'లీడర్‌షిప్' కోర్స్ చేసింది.

సిటీబ్యాంక్‌లో ఉద్యోగం చేసిన సంధ్య ఆ తరువాత స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకులో చేరి మేనేజింగ్ డైరెక్టర్ (రిటైల్ బ్యాంకింగ్ అండ్ పేమెంట్ ప్రొడక్ట్స్) స్థాయికి ఎదిగింది.

జనవరి 2016లో మెటాలో చేరిన సంధ్య ఆగస్ట్‌లో మెటా మేనేజింగ్ డైరెక్టర్(సింగపూర్),


● సంధ్యా దేవనాథన్

మెటా బిజినెస్ హెడ్ (వియత్నాం)గా పనిచేసింది. మెటాకు సంబంధించి ఆగ్నేయాసియా ఇ-కామర్స్ వ్యవహారాలను పర్యవేక్షించింది.

మెటా ప్రకటనకు ముందు వరకు ఆసియా-పసిఫిక్ ప్రాంతానికి సంబంధించి గేమింగ్-వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తోంది సంధ్య.

మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించే అవకాశం రావడం సాధారణ విషయం ఏమీ కాదు. ఇంతకీ సంధ్య బలం ఏమిటి?

వ్యాపారాన్ని ముందుకు తీసుకువెళ్లే నైపుణ్యం, సమర్థవంతులైన ఉద్యోగులతో బృందాన్ని ఏర్పాటు చేసుకొని అత్యున్నత ఫలితాలు రాబట్టడం... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి. 'ఇది నా బలం' అని ఆమె ఎప్పుడూ చెప్పలేదు. మీడియాలో పెద్దగా ఇంటర్వ్యూలు కూడా కనిపించవు. అయితే ఆమె ట్రాక్ రికార్డ్ ఆమె బలం ఏమిటో చెప్పకనే చెబుతుంది.

పెప్పర్ ఫైనాన్షియల్ సర్వీసెస్ గ్రూప్, నేషనల్ లైబ్రరీ బోర్డ్(సింగపూర్), సింగపూర్ మేనేజ్‌మెంట్ యూనివర్శిటీ, మినిస్టర్ ఆఫ్ ఇన్‌ఫర్‌మేషన్ అండ్ కమ్యూనికేషన్స్ (సింగపూర్), ఉమెన్స్ ఫోరమ్ ఫర్ ది ఎకానమీ అండ్ సొసైటీ... మొదలైన వాటిలో బోర్డ్ మెంబర్‌గా పనిచేసిన సంధ్యకు స్త్రీ సాధికారతకు సంబంధించిన కార్యక్రమాలు అంటే ఆసక్తి.

మహిళా వ్యాపారవేత్తలకు ప్రోత్సాహాన్ని ఇచ్చే మెటా ఉమెన్స్, ఏపీఏసీలో ఎగ్జిక్యూటివ్ స్పాన్సరర్‌గా విధులు నిర్వహించింది.

డిజిటల్ రంగంపై మన ఆసక్తిని గమనించిన మెటా తన టాప్ ప్రొడక్ట్స్‌ను ఇండియాలోనే లాంచ్ చేసింది.

మన దేశంలోని లీడింగ్ బ్రాండ్స్, క్రియేటర్స్, అడ్వర్‌టైజర్‌లతో కంపెనీకి ఉండే స్ట్రాటిజిక్ రిలేషన్‌ను బలోపేతం చేయడానికి బలమైన వ్యక్తి కోసం వెదికింది మెటా.

తమ భవిష్యత్ లక్ష్యాలను నెరవేర్చే శక్తి సామర్థ్యాలు సంధ్యలో ఉన్నాయి అనే బలమైన నమ్మకంతో పెద్ద బాధ్యతను అప్పగించి ఘన స్వాగతం పలికింది.

లీడర్‌షిప్ పాఠాలలో నొక్కి వక్కాణించి చెప్పే మాట...

'లీడర్‌షిప్, లెర్నింగ్ అనేవి వేరు వేరు ధ్రువాలు కాదు. ఒకదానిపై ఒకటి అనివార్యంగా ఆధారపడతాయి'



● ఆంధ్రా యూనివర్సిటీలో సంధ్యా దేవనాథన్ (సర్కిల్‌లో)

సిటీబ్యాంకులో సాధారణ ఉద్యోగిగా పనిచేసినా, మెటా లాంటి సంస్థలో బాస్‌గా కీలక విధులు నిర్వహించినా నేర్చుకోవడాన్ని మాత్రం సంధ్య ఎప్పుడూ ఆపలేదు. వ్యక్తులు మొదలు సామాజిక పరిస్థితుల వరకు ఎన్నో విషయాలు నేర్చుకొని తనను తాను తీర్చిదిద్దుకుంది. ప్రసిద్ధ విద్యాలయాల్లో ఆమె నేర్చుకున్న పాఠాలు ఎన్నో సందర్భాలలో తనకు దారి చూపాయి.

ప్రస్తుతం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లు రకరకాల సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. వాటిని అధిగమించి ఆదాయాన్ని పెంచడం చిన్న విషయమేమీ కాదు.

బ్యాంకింగ్, పేమెంట్స్, టెక్నాలజీ రంగాలలోఅంతర్జాతీయ స్థాయిలో 22 సంవత్సరాల అనుభవం ఉన్న సంధ్యా దేవనాథన్‌కు సవాళ్లు కొత్త కాదు. విజయాలు సాధించడమూ కొత్త కాదు.

బెస్టాఫ్ లక్ సంధ్య గారూ!


● సంహిత

బిజినెస్‌కు ఈజీ మ్యాప్

చాలా మంది మహిళలు తమ సొంత కాళ్లమీద నిలబడటానికి ఉద్యోగమో, వ్యాపారమో చేయాలనుకుంటారు. ఉద్యోగానికైతే కొన్ని అర్హతలు ఉండాలి వ్యాపారం చేయాలంటే.. పెట్టుబడి ఉంటే చాలనుకుంటారు. కానీ, కుటుంబం నుంచి అందుకు తగిన మద్దతు రాకపోతే .. నైపుణ్యాలు లేవని వెనకడుగువేస్తే పెట్టుబడి లేదని చతికిలపడితే.. హైదరాబాద్ నానక్‌రాంగూడలో ఉన్న కుంబజాడల సంహితను కలవచ్చు. చార్టర్డ్‌అకౌంటెంట్ అయిన సంహిత దిగువ, మధ్యతరగతి మహిళలు వ్యాపారంలో రాణించడానికి కావల్సిన అవగాహన తరగతులను ఉచితంగా ఇస్తున్నారు. వివిధ రంగాలకు చెందిన నిపుణులచేత వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నారు. అనుకున్న బిజినెస్‌కు ఈజీ మ్యాప్ డిజైన్ చేసిస్తున్నారు..

'మహిళలు ఎవ్వరైనా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు' అని చెప్పే సంహితను తనకు కలిగిన ఈ ఆసక్తి గురించి అడిగినప్పుడు ఎన్నో విషయాలు పంచుకున్నారు.

''సాధారణంగా చాలామంది చార్టర్డ్ అకౌంటెంట్ అంటే కంపెనీ అకౌంటింగ్, ఆడిటింగ్ పనులు చూస్తారు, అంతవరకే వారి డ్యూటీ అనుకుంటారు. కానీ, 'మీ బిజినెస్‌ను ఇలా ముందుకు తీసుకువెళ్లచ్చు' అని గైడెన్స్ ఇవ్వాలనుకోరు. నేను ఉద్యోగరీత్యా ముంబై, ఢిల్లీ, చెన్నై, యు.ఎస్ లలో వర్క్ చేశాను. అన్ని చోట్లా మహిళల పని సామర్థ్యాల పట్ల అవగాహన ఉంది. వివిధ రంగాల్లో నైపుణ్యం గల స్నేహితులున్నారు. వీరితో కలిసి 'మహిళలు వ్యాపార రంగంలో రాణించడం' అనే అంశాల మీద చర్చిస్తున్నప్పుడే చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారికి సరైన గైడెన్స్ ఇస్తే బాగుంటుందనే ఆలోచన చేశాను. నాలుగేళ్ల క్రితం హైదరాబాద్‌లో ప్రోస్ప్యాడ్ కన్సల్టింగ్‌ను ఏర్పాటు చేసి, నా వర్క్‌కు సంబంధించిన పనులు చూస్తున్నాను.

అవగాహనే ప్రధానంగా..

రెండేళ్ల క్రితం ఆంధ్రాలో ఒక అమ్మాయి తొక్కుడు లడ్డు 2/- రూపాయలకు ఒకటి అమ్మడం చూశాను. వాళ్లమ్మగారు ఆసుపత్రిలో ఉన్నారు. ఆమె మరొక అమ్మాయితో కలిసి ఈ చిన్న బిజినెస్ చేస్తోంది. ఆ రోజు వాళ్లిద్దరూ 150 లడ్డూలు అమ్మారు. అంత మంచి స్వీట్, తక్కువ ధరకు అమ్ముతున్నారు. వారికి ఆ స్వీట్స్‌ను ఎలా మార్కెటింగ్ చేయాలో చెప్పాలనుకున్నాను. దాంతో పాటు బ్యాంకుల నుంచి పెట్టుబడులు తెచ్చుకోవడం, ప్యాకేజీ సిస్టమ్, మార్కెటింగ్ ఐడియాలు ఇవ్వడంతో ఇప్పుడు వారి వ్యాపారం లక్షల్లో నడుస్తోంది. ఆ అమ్మాయిలిద్దరూ చదువుకున్నవారు కాదు. ఒకరు టైలరింగ్ చేసేవారు, ఇంకొక అమ్మాయి ఇంట్లోనే ఉండేది. ఇప్పుడు వారిని చూస్తే చాలా గర్వంగా అనిపిస్తుంది. అదిలాబాద్‌కు చెందిన ఒకరి బిజినెస్ దాదాపు మూతపడిపోయే దశలో ఉన్నప్పుడు మమ్మల్ని కలిశారు. ఇప్పుడు వారి వ్యాపారంలో ఏ చిన్న సందేహం వచ్చినా ఫోన్ చేసి సలహా అడుగుతుంటారు.

ప్రతి ఒక్కరికీ సొంతంగా ఎదగాలనే ఆలోచన ఉంటుంది. కానీ, సరైన అవగాహన లేక వెనకబడిపోతుంటారు. లేదంటే ఫెయిల్యూర్స్ చూస్తుంటారు. ఇలాంటప్పుడు సరైన గైడెన్స్ ఇచ్చేవారుంటే తిరిగి నిలదొక్కుకుంటారు. ఈ ఉద్దేశ్యంతోనే రెండేళ్ల నుంచి చిన్న, మధ్య తరగతి మహిళా వ్యాపారులకు అవగాహనా తరగతులను నిర్వహిస్తున్నాం. అందుకు విధి విధానాలను రూపొందించాను. మొదలుపెట్టిన యేడాదిలోనే వందకు పైగా రిజిస్ట్రేషన్స్ వచ్చాయి. ఆ తర్వాత యేడు ఆ సంఖ్య రెట్టింపు అయ్యింది.


● బిజినెస్‌కి సూచనలిస్తూ...

రిస్క్ అని వద్దనుకుంటారు..

ఏదైనా సొంతంగా వర్క్ స్టార్ట్ చేద్దామని వచ్చినవారిని 'ముందు మీ ఇంట్రస్ట్ ఏంటి?' అనే ప్రశ్నతో మొదలు పెడతాం. ఆ తర్వాత వారితో 2-3 సెషన్స్ నడుస్తాయి. ఎందుకంటే, ఏ చిన్న బిజినెస్ మొదలుపెట్టాలన్నా రెండు, మూడు లక్షల రూపాయలు ఖర్చు అవుతాయి. ఇలాంటప్పుడు వారిలో ఎన్నో సందేహాలు ఉంటాయి. కుటుంబం అంత పెట్టుబడి పెట్టలేకపోవచ్చు. పైగా 'మార్కెట్ గురించి ఏమీ తెలియకుండా పెట్టుబడి పెడితే, ఫెయిల్యూర్ వస్తే తట్టుకోలేం' అనేది ఉంటుంది. ఇవన్నీ వారితో చర్చిస్తాం. వారిలో ఉన్న స్కిల్స్‌ని పరిగణనలోకి తీసుకొని, ఆ తర్వాత బిజినెస్‌లో ప్రోత్సహిస్తాం. ఇందుకు కన్సల్టేషన్ ఫీజు ఉండదు. బిజినెస్ చేయాలనుకునేవారి ఆలోచనకు మా గైడెన్స్ ఒక సులువైన రోడ్ మ్యాప్‌లా ఉంటుంది.



నెమ్మదిగా ప్రయాణం..

ఇప్పటి వరకు మా దగ్గరకు వచ్చే వారి నుంచి ఇంకొంత మందికి తెలిసి, వారి ద్వారా మరికొంతమంది చేరుతున్నవారే ఉన్నారు. అలా ఇప్పటి వరకు 350 మంది క్లయింట్స్ ఉన్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఇది స్లో ప్రాసెస్. 'మీరెందుకు ఫ్రీ సర్వీస్ ఇస్తారు..' అనేవారూ ఉన్నారు. ఈ సందేహం నిజమే.. మార్కెట్లో మా గైడెన్స్‌తో నిలదొక్కుకున్నాక వాళ్లు ఇంకా పై స్థాయికి చేరుకోవాలనుకున్నప్పుడు ఛార్జ్ ఉంటుంది. ఈ మొత్తం మరికొందరికి గైడెన్స్ ఇవ్వడానికి సహాయపడుతుంది. మార్కెట్లో ఏ ప్రొడక్ట్‌కైనా ఎమ్ఆర్‌పీ ఉంటుంది. కానీ, మా వర్క్‌కి అలా ఉండదు. ఈ వర్క్‌కి ఎంత ఛార్జ్ చేయచ్చు అనేది కూడా తెలియదు. కొందరికి వారి బిజినెస్‌ను బట్టి ఛార్జ్ ఉంటుంది.

స్వతంత్రంగా ఎదగడం, ఆర్థికంగా నిలబడాలనే విషయంలో మహిళల ఆలోచన పెరుగుతోంది. చాలా మంది మహిళలు నా కోసం నేను ఏ కొంచెమైనా డబ్బు సంపాదించుకోగలనా అని ప్రయత్నిస్తున్నారు. సాధారణంగా మహిళల్లో మల్టీటాస్కింగ్ చేసే శక్తి ఉంటుంది కాబట్టి, వారికి కొంత ప్రోత్సాహమిస్తే చాలు అనుకున్న స్థాయికి చేరుకోగలరు. ఆ ప్రోత్సాహమే నేను ఇవ్వాలనుకున్నది'' అని వివరించారు ఈ చార్టర్డ్ అకౌంటెంట్.

– నిర్మలారెడ్డి

కిచెన్‌టిప్స్



చలికాలంలో అగ్గిపెట్టెలు తొందరగా మెత్తబడుతుంటాయి. గీసినా తొందరగా వెలగవు. ఇలాంటప్పుడు అగ్గిపెట్టెలో చిన్న చాక్‌పీస్ ముక్కను ఉంచాలి. అగ్గిపెట్టెలోని తేమను చాక్‌పీస్ పీల్చుకుని పొడిగా మార్చుతుంది. గీసిన వెంటనే అగ్గిపుల్లలు వెలుగుతాయి.



పంటినొప్పి బాధిస్తుంటే.. రెండు లవంగాలను మెత్తని పొడిలా దంచుకోవాలి. ఈ పొడిలో నాలుగు చుక్కల ఆలివ్ ఆయిల్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని దూదితో అద్ది నొప్పి ఉన్న పన్నుపైన పెట్టుకుంటే, ట్యాబ్‌లెట్ల కంటే వేగంగా నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.



నిల్వచేసే ముందు రెండు టేబుల్ స్పూన్ల బియ్యప్పిండిని కిస్‌మిస్‌లకు పట్టించాలి. తరువాత డబ్బాలో పెడితే ఉండలుగా అతుక్కోకుండా తీస్తుంటే ఒక్కోటీ విడివిడిగా వస్తాయి.

ఈ డాక్టర్‌కు నాట్యమంటే ప్రీతి



'**య**మహా నగరి... కలకత్తా పురి' నేపథ్య గానం వినిపిస్తోంది. 'చూడాలని ఉంది' చిరంజీవి సినిమా పోస్టర్ తెర మీద కనిపిస్తోంది. అదే పాటకు ఓ యువతి భరత నాట్యం ముద్రలతో అభినయిస్తోంది. ఇరవై నిమిషాలకు పైగా సాగిన ఆ నాట్య సమ్మేళనాన్ని వీక్షిస్తున్న ఆహ్వానితుల్లో మెగాస్టార్ చిరంజీవి కూడా ఉన్నారు. చిరంజీవి కూడా ఉండడం కాదు... ఆ కార్యక్రమానికి ఆయనే ప్రత్యేక అతిథి. నాట్యం పూర్తవుతుండగా ఆయన లేచి నిలబడి నాట్యకారిణిని చప్పట్లతో అభినందించారు. ఆ రోజు అక్టోబర్ 29. చిరంజీవి పాటల్లో బాగా ఆదరణ పొందిన 29 పాటలను ఎంచుకుని చేసిన ఫ్యూజన్ అది. ఆసక్తిగా ఆమె గురించి వాకబు చేశారు. ఆమె పేరు డాక్టర్ ప్రీతీరెడ్డి.

డాక్టర్ ప్రీతీరెడ్డి తన వృత్తిలో బిజీగా ఉంటూనే, సంప్రదాయ నాట్యంలో ప్రయోగాలు చేయడమనే అభిరుచికి కూడా సమయాన్ని కేటాయిస్తున్నారు. కర్నాటక రాష్ట్రం, హుబ్లీలో పుట్టిన ప్రీతి, పూనాలో పెరిగారు. హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. గ్రామాల నుంచి వచ్చే పేషెంట్‌లకు వైద్యం చేయాలంటే వారి భాష వచ్చి ఉండాలని తెలుగు నేర్చుకున్నారు. సమాజం కోసం పని చేయడానికి ఆసక్తి చూపించే ప్రీతిరెడ్డి గ్రీన్ ఇండియా మూవ్‌మెంట్‌లో చురుగ్గా ఉంటారు. అల్లోపతి డాక్టర్ అయిన ఆమె భారతీయ యోగసాధనను అధ్యయనం చేశారు. యోగసాధన దేహం, మెదడు మీద ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తుందనేది శాస్త్రీయంగా వివరిస్తూ, యోగ సాధన వల్ల ప్రయోజనాలను తెలియచేస్తుంటారు. 'డాక్టర్ ఎప్పుడూ ప్రశాంతంగా, ప్రసన్నంగా ఉండాలి, అలాగే నిత్యచైతన్యంతో ఉత్సాహంగానూ ఉండాలి. అప్పుడే పేషెంట్‌లు ఆ డాక్టర్ దగ్గర వైద్యం చేయించుకోవడానికి ఇష్టపడతారు. పేషెంట్ మనసు చూరగొనడమే డాక్టర్ అంతిమలక్ష్యం కావాలి' అంటారామె. తమ హాస్పిటళ్లలో అమ్మాయి పుడితే ఐదువేల రూపాయల డీడీని ఆ తల్లికి బహూకరిస్తారు. అమ్మాయికి సాదర స్వాగతం పలికే సమాజాన్ని ఆకాంక్షించారామె. 'ప్రతి ఒక్కరూ తమవంతుగా సమాజానికి తిరిగి ఇవ్వాలి, అప్పుడే ఆరోగ్యకరమైన, సంతోషకరమైన భారతదేశాన్ని చూడగలం' అన్నారు డాక్టర్ ప్రీతీరెడ్డి. వృత్తిని- ప్రవృత్తిని సమన్వయం చేసుకోవడం తెలిస్తే ప్రొఫెషన్ ఎప్పుడూ బరువుగా అనిపించదు. జీవితం భారంగానూ ఉండదు. నిత్య చైతన్యంతో ఉండాలంటే మనసును ఆహ్లాదపరిచే అభిరుచిని పెంపొందించుకోవాలన్నారు.



బ్యూటిప్

సహజమైన లోషన్



రెండు టేబుల్ స్పూన్ల గ్రీన్ టీలో అరటీస్పూను షియా బటర్, టీస్పూను తేనె, టీస్పూను నిమ్మరసం, టీస్పూను విటమిన్ ఈ ఆయిల్ వేసి చక్కగా కలిపితే లోషన్ రెడీ. దీనిని గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవాలి. స్నానం చేసిన తరువాత ఈ లోషన్‌ను వేజలైన్‌లా శరీరానికి రాసుకుని సున్నితంగా మర్దన చేయాలి. ఇది చర్మానికి సురక్షితమైన తేమను అందిస్తుంది. ఈ మాయిశ్చర్‌లో ఉన్న పదార్థాలన్నీ సహజసిద్ధమైనవే కాబట్టి ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు. ఈ లోషన్ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.

ఇంటిప్

స్టీల్ సింక్ సబ్బు నీళ్ల మరకతో మచ్చలు మచ్చలుగా ఉంటుంది. ఈ మచ్చలు పోయి, సింక్ మెరవాలంటే.. గిన్నెలు తోమే మెత్తటి స్క్రబ్బర్ మీద కాస్త టూత్ పేస్టు వేసి సింక్ మొత్తాన్ని గట్టిగా రుద్దాలి. తరువాత నీళ్లతో కడిగితే సింక్ తళతళా మెరుస్తుంది.



నీటి తోట

కుండీలో తామర

కొలనుల్లో తామరలు సూర్య నమస్కారాలు చేస్తాయి. దొరువుల్లో కలువలు చంద్రునికి మోహలేఖలు రాస్తాయి. కాని అవి పాత రోజులు. ఇప్పుడు ఇళ్లల్లో అలంకరణ కోసం తామరలు కొని నీటి తొట్లలో వదులుతున్నారు. అవి ఎక్కడి నుంచి వస్తాయి? కేరళలో అంజలి లాంటి స్త్రీలు కుండీల్లో, ప్లాస్టిక్ తొట్లలో తామరలను పెంచి అమ్ముతున్నారు. దాదాపు 40 రకాల తామరలు ఉన్నాయి. 300 నుంచి ఒక్కో పువ్వు 4000 రూపాయల వరకూ పలుకుతాయి. నెలకు 30 నుంచి 50 వేలు సంపాదిస్తూ ఉంది అంజలి.



కోవిడ్ వల్ల ఎవరికి ఎన్ని కష్టాలు వచ్చినా అది అంజలికి తామరలు కూడా పూయించింది. కేరళలోని పాలక్కాడ్‌కు చెందిన 28 ఏళ్ల అంజలిని చూడండి. కోవిడ్ కాలంలో భర్తకు సంపాదన పోవడంతో తామరలను నమ్ముకుంది. ముందు మిద్దె మీద పెంచింది. ఆదాయం బాగుండటంతో ఇప్పుడు 20 సెంట్ల భూమి సంపాదించి అక్కడ తామరలు పెంచుతోంది. అన్నీ కుండీల్లోనే. లేకుంటే ప్లాస్టిక్ టబ్బుల్లో. దీనిని 'నీటి తోట' అనొచ్చు. నీటి మొక్క తామర. దీనితో పాటు కలువ. అంజలి జీవితం ఇప్పుడు మూడు కలువలు ఆరు తామరలుగా సాగిపోతోంది.

'ముందు నాటు రకం తామరలు పెంచాను. అవి ఏడాదికి కాని పూలు పూయవు. ఇలా కాదని హైబ్రిడ్ తామరలను పెంచడం నేర్చాను. కొన్ని హైబ్రిడ్ తామర మొక్కలు నెలకే పూస్తాయి. వీటిని థాయ్‌లాండ్ వాళ్లు డెవలప్ చేశారు. అమిరి కెమిలియా అనే తామర రకం ఉంది. అదైతే వేసిన 15 రోజులకే పూస్తుంది. ఇప్పుడు నా తామర సాగులో దాదాపు 40 రకాలు ఉన్నాయి' అంటుంది అంజలి.

ఆమెకు పూలు పూయించడంతో పాటు ప్రచారం చేయడం కూడా వచ్చు. ఫేస్‌బుక్‌లో, ఇన్‌స్టాలో ఆ తామర మొక్కలు, పూలు ఫోటోలు పెడుతుంది. మొదట కేరళ నుంచి ఆర్డర్లు రావడం మొదలైంది. ఇప్పుడు మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి.

'తామరలు దుంపవేరు నుంచి వస్తాయి. దుంపవేర్లు కొనేవాళ్లు ఉంటారు. కాని వాటిని పెంచడం తెలియాలి. కొందరు నేరుగా మొక్కలు కొంటారు. అవి కొన్న తర్వాత పది రోజులకు మించి బతకవు. అందుకని వెంటనే వాడుకోవాల్సి ఉంటుంది. కొందరు ఒట్టి పూలే కొంటారు' అంటుంది అంజలి.

నాటు తామరలకు రెక్కలు తక్కువ ఉంటాయి. హైబ్రిడ్ తామరలకు రెక్కలు ఎక్కువ. 'మిరకిల్' అనే వెరైటీలో పువ్వుకు 700 రెక్కలు ఉంటాయి. ఇక సహస్రదళపద్మానికి డిమాండ్ జాస్తి. దీనిలో వేయి రెక్కలు ఉంటాయి. 'బుద్ధ పద్మం', 'దుర్గపద్మం' అని చాలా రకాలే ఉన్నాయి. 'పసుపు రంగు తామరలకు బాగా గిరాకీ ఉంది. ఒక్కో మొక్కకు రూ. 4000 పెట్టడానికి కూడా సిద్ధమవుతారు' అంటుంది అంజలి.



ఆమె దగ్గర పూలు, దుంపవేర్లు, మొక్కలు రకాన్ని బట్టి 300 నుంచి మొదలవుతాయి. నెలకు అన్ని రకాలూ 100 పూల వరకూ అమ్ముతుంది. అన్నీ కుదిరితే 50 వేలు కూడా సంపాదిస్తుంది. వీటితోపాటు కలువలు కూడా సాగు చేస్తుంది. వాటి మీద ఆదాయం కూడా బాగుంది.

'మొక్కలను జాగ్రత్తగా చూడాలి. తామరకు బాగా ఎండ తగలాలి. నీటి కుండీల్లో దోమలు చేరకుండా గుప్పీ చేపలను వదిలితే మంచిది' అంటుంది అంజలి. తన దగ్గర మొక్కలు కొన్నవారికి వాటిని ఎలా సంరక్షించాలో చెబుతుంది.

ఇప్పుడు శ్రీమంతులే కాదు మధ్యతరగతి వారు కూడా ఇంటి ముంగిలిలో ఒక తామరతావును లేదా పూలను అలంకరించడానికి ఇష్టపడుతున్నారు. ఈ సాగు నేర్చితే మహిళలు ఇంటి దగ్గరి నుంచే ఆదాయం గడించవచ్చు.



మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకుంటే అది శరీరానికి ఒక రోజుకు అవసరమయ్యే శక్తిని అందివ్వడమే కాకుండా ఆ రోజులో మిగతా సమయం అంతా అతిగా తినటాన్ని కూడా నియంత్రించి శరీరంలో సమతుల్యతను కాపాడుతుందన్న ఆరోగ్య నిపుణుల సలహా అందరికీ తెలిసిందే. చెప్తున్నారు. అయితే ఏది పడితే అది అనారోగ్యకరమైన తిండి తినడం కంటే కూడా బ్రేక్‌ఫాస్ట్ చేయకపోవడమే చాలా ఉత్తమం అంటున్నారు న్యూట్రిషనిస్టులు. ఒకవేళ కొన్నిసార్లు మీరు బ్రేక్‌ఫాస్ట్ చేయకుండా వెళ్లిన సందర్భాల్లో మంచి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకుంటే ఎలాంటి సమస్యా ఎదురు కాదు. ఉండదు.

మీది హెల్దీ బ్రేక్‌ఫాస్టేనా?

గుడ్లు



ఒక అధ్యయనం ప్రకారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో గుడ్లు తీసుకుంటే ఆ వెంటనే కడుపు నిండినట్లుగా అనిపిస్తుంది. ఆ రోజులోని మిగతా సమయంలో తీసుకునే ఆహారం కూడా ఎక్కువ, తక్కువ కాకుండా కావాల్సిన మేరకే తీసుకుంటాం. తద్వారా శరీరంలో కేలరీలు తగ్గుతాయి. అంతేకాకుండా రక్తంలో షుగర్, ఇన్సులిన్ స్థాయులు నియంత్రణలో ఉంటాయని వెల్లడైంది. గుడ్ల సొనలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కంటికి బలాన్నిస్తాయి. ఇవి శరీరానికి కావాల్సిన ముఖ్యమైన ప్రొటీన్లు, పోషకాలు అందజేస్తాయి.

ఓట్ మీల్



బ్రేక్‌ఫాస్ట్ తయారు చేసుకునే సమయం లేనప్పుడు ఓట్ మీల్‌కు ఓటెయ్యడం ఉత్తమం. దీనిని చాలా సులువుగా తయారు చేసుకోగలగడమే గాక చాలా ఉత్తమమైనది కూడా. ఎందుకంటే, ఓట్ మీల్స్‌లో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, ప్రొటీన్లు ఉంటాయి. ఇవి శరీరంలోని కొవ్వును అదుపు చేయడంలో తోడ్పడతాయి. రక్తపోటు, ఊబకాయం, హృద్రోగ సమస్యలు ఉన్నవారికి ఓట్ మీల్ మంచి బ్రేక్‌ఫాస్ట్. ఓట్ మీల్‌ను పాలతో కలుపుకొని తినడం లేదా ఉప్మాలా తిరగమోత వేసుకుని తినడం వల్ల ఈ సుగుణాలు అందుతాయి.

పండ్లు



మీ రోజు ఫలవంతంగా సాగాలంటే ఉదయాన్నే పొట్టను పండ్లతో నింపేస్తే సరి. పండ్లు ఆరోగ్యానికి ఎంత మంచివో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వీటిలో ఎన్నో విటమిన్స్, మినరల్స్ ఉంటాయి. కావాల్సినంత ఫైబర్, శరీరానికి అవసరమయ్యే హైడ్రేషన్ కూడా పండ్ల ద్వారా లభిస్తుంది. ఒక కప్పు ఆపిల్ ముక్కలు, లేదా సిట్రస్ జాతికి చెందిన నారింజ, సంత్ర పండ్లు లేదా బెర్రీస్ ఏవైనా సరే మంచి బ్రేక్‌ఫాస్ట్ జాబితాలో ఉంటాయి.

నట్స్, సీడ్స్



నట్స్ తినటానికి రుచిగా ఉండటమే కాదు, వాటి నుంచి శరీరానికి లభ్యమయ్యే పోషకాలు కూడా అధికంగానే ఉంటాయి. నట్స్ లో కేలరీలు చాలా ఉన్నా కొవ్వు ఏ మాత్రం రాదు. బరువు తగ్గటానికి నట్స్ చాలా ఉపయోగకరం, వీటిలో మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్ శరీరానికి అందుతాయి. రోజు ఉదయం గుప్పెడు నట్స్ తీసుకోవటం ఆరోగ్యకరం.



అలాగే ఫ్లాక్స్ సీడ్స్ అంటే అవిసె గింజలు కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఫ్లాక్స్ సీడ్స్ శరీరంలో షుగర్ లెవెల్స్‌ను నియంత్రణలో ఉంచుతూ, ఇన్సులిన్ ను అందిస్తాయి. బ్రెస్ట్ క్యాన్సర్ లాంటి ప్రాణాంతక రోగాలనుంచి రక్షణ లభిస్తుంది.

● ఒక విషయం



సాధారణంగా అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఎవరైనా టాబ్లెట్స్ వేసుకోవడం సహజమే. ఐతే మంచినీళ్లతో మాత్రలు వేసుకుంటే ఫర్వాలేదు కానీ కొందరు టాబ్లెట్లను రకరకాల పద్ధతుల్లో వేసుకుంటుంటారు. అందులో భాగంగా పండ్ల రసంతో మాత్రలు తీసుకుంటే బాగా పని చేస్తాయనే ఉద్దేశ్యంతో నారింజ లేదా నిమ్మరసంతో కలిపి మాత్రలను మింగే ప్రయత్నం చేస్తుంటారు.అయితే ఇలా చేయడం వల్ల మేలు జరగకపోగా, ప్రమాదం ఎదురుకావొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. నారింజ లేదా ఇతర సిట్రస్ పండ్లను తీసుకున్నప్పుడు, సిట్రస్ పండ్లలో ఉండే రసాయనాలు పేగులో చర్య జరిపి ఔషధం ప్రభావాన్ని తగ్గిస్తాయి. వీటి రసంతో ఔషధాన్ని తీసుకోవడం వల్ల ప్రేగు కణాలు వాటి రూపాన్ని మార్చుకుంటాయి. ఫలితంగా ఔషధంలో ఉన్న రసాయనం పనిచేయకుండా పోయే ప్రమాదం ఉంది. కనుక అలా చేయరాదని వైద్యులు చెబుతున్నారు.

అలర్జీనా? నివారణ ఇలా...

మడిసన్నాక కాసింత కళాపోషణుండాల అనే సినిమా డైలాగ్‌లా మనిషన్నాక జీవితంలో ఏదో ఒక దశలో అలర్జీ కలగక మానదు. బాధించకుండానూ ఉండదు. ఇందుకు మనం పీల్చే గాలి, తీసుకునే ఆహారం, ప్రేమతో పెంచుకునే జంతువులు, వాడే సుగంధ ద్రవ్యాలు లేదా తీసుకునే మందులు కూడా కారణం కావచ్చు. అలర్జీ అంత ప్రమాదకరం కాకపోయినా, అలసత్వం వహిస్తే ప్రాణాంతకం కూడా కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలర్జీల విజృంభణకు శీతాకాలం అనువైన సమయం. అందువల్ల మనం సాధారణంగా ఎదుర్కొనే కొన్ని రకాల అలర్జీలు, కారణాలు, నివారణలపై అవగాహన కోసం..



అలర్జీ అంటే ఏదో పెద్ద వ్యాధి అని అనుకునే వారు చాలా మంది ఉన్నారు. కానీ, అది కరెక్ట్ ఆలోచన కాదు. అలర్జీ అంటే శరీరం ఎక్కువగా రియాక్ట్ అవ్వడం అన్నమాట. అంటే, మనం తీసుకునే ఆహారం లేదా గాలి శరీరంలోకి వెళ్లినప్పుడు, మన శరీరం స్పందించాల్సిన దాని కంటే ఎక్కువగా స్పందిస్తుంది. ఈవిధంగా మోతాదు కంటే ఎక్కువగా స్పందిస్తే దాన్ని అలర్జీ లేదా హైపర్ సెన్సిటివిటీ అంటారు. దీని మూలంగా రకరకాల ఇబ్బందులు తలెత్తుతాయి.

■ ఆహారపరమైన అలర్జీ

మనం తీసుకునే కొన్ని ఆహార పదార్థాలు ఆహార సంబంధమైన అలర్జీలకు దారితీస్తాయి. సాధారణంగా ఫుడ్ అలర్జీలు గుడ్లు, పాలు, వేరుశెనగ, చేపలు, రొయ్యలు, పీతలు, సోయా, కొన్ని రకాల నట్స్ (అక్రోట్స్, బాదం, బ్రెజిల్ నట్స్), గోధుమ వంటి ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల వస్తాయి. శరీరానికి ఈ పదార్థాలు సరిపడకపోతే దురద, చర్మంపై దద్దుర్లు, వాంతులు లేదా కడుపులో అసౌకర్యం, శ్వాస సరిగా అందకపోవటం, గురక, దగ్గు, గొంతునొప్పి, పల్స్ పడిపోవడం, చర్మం నీలం రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఫుడ్ అలర్జీల నిర్ధారణకు చర్మ పరీక్షతోపాటు రక్త పరీక్షలు(ఐజీఈ యాంటీబాడీస్) కూడా చేయాల్సి ఉంటుంది.

అలర్జీ వస్తే ఏం చేయాలంటే..?

శరీరంలో అలర్జీ లక్షణాలు కనిపించిన వెంటనే అలర్జీ స్పెషలిస్ట్ డాక్టర్‌ను సంప్రదించడం ఉత్తమం. డాక్టర్ తో మీ ఫ్యామిలీ హిస్టరీ, జీవనశైలి, ఇతర జబ్బులకు వాడుతున్న మందులు తదితర వివరాలను తెలియజేస్తే, దానికి తగిన నిర్ధారణ పరీక్షలను సూచిస్తారు. ముందుగా ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్ష, ఎక్స్‌రే వంటి పరీక్షలు నిర్వహించి ఆ తరువాత మీ అలర్జీ కారకాలను గుర్తించడానికి చర్మ పరీక్షలు, ప్యాచ్ లేదా రక్త పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల నివేదికల ఆధారంగా మీరు ఏరకమైన అలర్జీలతో బాధపడుతున్నారో నిర్ధారించుకొని తగిన చికిత్సను సిఫార్సు చేస్తారు.

■ దుమ్మెత్తే అలర్జీ



దుమ్ము, ధూళి వల్ల, వాటిలోని సూక్ష్మజీవుల వల్ల వచ్చే అలర్జీని డస్ట్ అలర్జీ అంటారు. వైద్య పరిభాషలో వీటిని డస్ట్ మైట్స్ అంటారు. శ్వాస తీసుకునే క్రమంలో ఈ డస్ట్ మైట్స్ శరీరంలోకి ప్రవేశించి శ్వాసనాళాల వ్యాకోచం లేదా వాపునకు కారణమవుతాయి. దీనివల్ల తుమ్ములు, ముక్కు కారడం, కంటిలో దురద, కళ్ళలో నుంచి జిగట నీరు, ఒళ్లంతా దురద, ముక్కు దిబ్బడ వంటి లక్షణాలు కనిపిస్తాయి. మన ఇళ్లలో ఉండే తేమ, దుమ్ము, మురికి ఈ డస్ట్ మైట్స్‌కు ఆవాసాలు. కాబట్టి దుప్పట్లు, దిండు గలీబులు, టవల్స్, కార్పెట్లు, ఇతర సామగ్రిని క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవాలి. డస్ట్ అలర్జీ కారకాలను గుర్తించడానికి కొన్ని రకాల పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఈ పరీక్ష ఫలితాలను బట్టి ఏయే పదార్థాలు మనకు సరిపడటం లేదో, ఆయా పదార్థాలకు దూరంగా ఉండమని లేదా వాటికి తగిన మందులను సూచిస్తారు వైద్యులు. డస్ట్ అలర్జీతో బాధపడేవారు 80 శాతం మంది ఆస్తమా రోగులుగా మారుతున్నారు.

■ కంటి అలర్జీ

సాధారణంగా కంటి అలర్జీలు పుప్పొడి, డస్ట్‌మైట్స్, పెంపుడు జంతువుల చర్మ కణాలు వంటి వాటి వల్ల సంభవిస్తాయి. వీటివల్ల కళ్లలో దురద, వాపు, మంట, జిగట నీరు కారడం, ఎరుపెక్కడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి అంటువ్యాధులు కావు. కంటి అలర్జీలకు ప్రత్యేకమైన నిర్ధారణ పరీక్షలు ఏవీ ఉండవు. కంటి అలర్జీకి కారకాలేమిటో తెలుసుకుని వాటికి దూరంగా ఉండటమే నివారణ.

■ చర్మ సంబంధమైన అలర్జీ

స్కిన్ అలర్జీకి కారణాలనేకం. రోగనిరోధక వ్యవస్థలో లోపాలు, మందులు, అంటు వ్యాధుల మూలంగా స్కిన్ అలర్జీ రావచ్చు. పెంపుడు జంతువులు, రసాయనాలు, సబ్బులు, నూతన వస్త్రాలు, కొన్ని రకాల క్రీములు, స్ప్రేలు వంటివి చర్మ అలర్జీలకు ప్రధాన కారకాలు.ఈ రకమైన అలర్జీకి ముఖ్య కారణం రోగనిరోధక వ్యవస్థలోని లోపాలే అన్న విషయం వారికి తెలీదు. స్కిన్ అలర్జీతో బాధపడే వారిలో విపరీతమైన దురద, చర్మంపై దద్దుర్లు, పొడి చర్మం, మంట, వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలా మందిలో ఈ అలర్జీల కారకాలను పరీక్షల ద్వారా నిర్ధారించడం సాధ్యం కాదు. అయితే సాధారణ రక్త పరీక్ష (తెల్ల రక్త కణాల పరీక్ష) ద్వారా బాధితుడి లక్షణాలను కొద్దిమేరకు గుర్తించే ప్రయత్నం చేయవచ్చు.

చికిత్స ఏమిటి?

అలర్జీలకు సరైన చికిత్సను నిర్ధారణ పరీక్షల ఆధారంగానే కాకుండా బాధితుడి మెడికల్ హిస్టరీ, లక్షణాల తీవ్రతను పరిగణనలోకి తీసుకొని ఇవ్వవలసి ఉంటుంది. దీనికి శాశ్వత పరిష్కారం లేదు. దీన్ని ఏదో ఒక చికిత్సా విధానం ద్వారా అదుపులో ఉంచుకోవడం మాత్రమే సాధ్యమవుతుంది.

ఈ నాలుగే కాక కొంతమందిలో తేనెటీగలు, కందిరీగలు (ఇన్సెక్ట్ అలర్జీ), రబ్బరుతో తయారయ్యే వస్తువులు (బెలూన్, చేతి తొడుగులు, కాండమ్స్), కొన్ని రకాల మందులు (డ్రగ్ అలర్జీ), ఫంగస్ (మోల్డ్ అలర్జీ) లాంటివి కూడా కనిపిస్తుంటాయి.

చివరగా ఒక మాట. మన చర్మం లేదా శరీరం దేనికి ఎక్కువగా ప్రతిస్పందిస్తుందో జాగ్రత్తగా పరిశీలించి వాటికి దూరంగా ఉండటమే అలర్జీకి నివారణ. ●

సినిమా



● ప్రభాస్

నాలుగు సెట్లు.. నలభై కోట్లు!

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'ప్రాజెక్ట్ కె'. దీపికా పదుకోన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, దిశా పటానీ కీలక పాత్రలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ శివార్లలో జరుగుతోంది. ఈ షెడ్యూల్ కోసం దాదాపు నలభై కోట్ల రూపాయలతో నాలుగు సెట్స్‌ని రూపొందించారని సమాచారం. ప్రస్తుతం భారీ స్థాయిలో పోరాట సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని తెలిసింది. ఈ ఫైట్స్ కోసం ఇతర దేశాల నుంచి ఫైటర్స్‌ను రంగంలోకి దించారట నాగ్ అశ్విన్. అలాగే ఈ నెల 20 నుంచి ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొననున్నారు దీపికా పదుకోన్. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా మూవీ 2024లో రిలీజ్ అయ్యే అవకాశం ఉంది.



● 'కరాటే' రాజు, బాలకృష్ణ, విశ్వక్ సేన్

ఈ సినిమా చూస్తే ఆ విషయం తెలుస్తుంది - బాలకృష్ణ

''సినిమా అంటే పిచ్చి ఉండకూడదు కానీ ప్యాషన్ ఉండాలని అనుకుంటాను. పిచ్చికి, ప్యాషన్‌కు తేడాలు ఏంటని సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరిగింది. ఈ సినిమా చూస్తే ప్యాషన్ అంటే ఏంటో తెలుస్తుంది. 'దాస్ కా ధమ్కీ' ట్రైలర్ బాగుంది. సినిమా సక్సెస్ అవుతుందనే అనిపించింది'' అన్నారు బాలకృష్ణ. విశ్వక్ సేన్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న సినిమా 'దాస్ కా ధమ్కీ'. నివేదా పేతురాజ్ హీరోయిన్. వన్మయీ క్రియేషన్స్, విశ్వక్ సేన్ సినిమాస్ పతాకాలపై 'కరాటే' రాజు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ– ''విభిన్న రకాల సినిమాలు చేస్తూనే ఇటు హీరోగా, అటు దర్శక–నిర్మాతగా కూడా విశ్వక్ సేన్ సినిమాలు చేస్తున్నాడు. ఇప్పటి యువతరంలో ఇలాంటివారు అరుదు. 'దాస్ కా ధమ్కీ' థియేటర్స్‌లో చూడాల్సిన చిత్రం'' అన్నారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''చాలామంది చాలా రకాలుగా అనుకుంటుంటారు. కానీ (బాలకృష్ణ) ఎంత పవర్‌ఫుల్లో.. అంత స్వీటు ఆయన. నా దర్శకత్వంలో వస్తున్న రెండో సినిమా 'దాస్ కా ధమ్కీ'. నా దగ్గర డబ్బుల్లేనప్పుడు స్నేహితులను అడిగి నా దర్శకత్వంలో తొలి చిత్రం 'ఫలక్‌నుమా దాస్' తీశాం. 'దాస్ కా ధమ్కీ' సినిమాను బాగా ఖర్చుపెట్టి తీస్తున్నాం. ఏడాదిగా ఈ సినిమా కోసమే పని చేస్తున్నాను. ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు. 'కరాటే' రాజు మాట్లాడుతూ – ''మా ప్రొడక్షన్‌లో ఫస్ట్ 'ఫలక్‌నుమా దాస్' తీశాం. విజయం దక్కింది. ఇప్పుడు 'దాస్ కా ధమ్కీ'తో వస్తున్నాం. నాలుగు సినిమాల కష్టం ఈ ఒక్క సినిమాకే పడుతున్నాం. ఆ కష్టం స్క్రీన్‌పై కనిపిస్తుంది'' అని అన్నారు. కథారచయిత ప్రసన్నకుమార్, కొరియోగ్రాఫర్ యశ్, పాటల రచయిత పూర్ణాచారి, ఎడిటర్ అన్వర్ అలీ తదితరులు పాల్గొన్నారు.




● సమంత

మీ బహుమతికి ధన్యవాదాలు

'యశోద' సినిమాకు సక్సెస్‌ను అందించిన ప్రేక్షకులకు సమంత ధన్యవాదాలు తెలిపారు. సమంత టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'యశోద'. హరి–హరీష్ దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలైంది. ఈ సినిమా గురించి సమంత శుక్రవారం ఓ నోట్‌ను రిలీజ్ చేశారు. ''యశోద'పై మీరు (ప్రేక్షకులను ఉద్దేశిస్తూ...) చూపించిన ప్రేమ, ప్రశంసలను ఓ గొప్ప బహుమతిగా భావిస్తున్నాను. 'యశోద' సినిమా యూనిట్ పడ్డ కష్టానికి తగిన ఫలితం లభించిందనడానికి థియేటర్స్‌లో వినిపిస్తున్న మీ విజిల్స్, కనిపిస్తున్న సెలబ్రేషన్సే నిదర్శనం. నాపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన శివలెంక కృష్ణప్రసాద్‌గారికి, హరి–హరీష్, ఇంకా ఇతర యూనిట్ సభ్యులందరికీ ధన్యవాదాలు'' అని పేర్కొన్నారు సమంత. కాగా మయోసైటిస్ అనే వ్యాధితో బాధపడుతున్న సమంత 'యశోద' సినిమా పూర్తి స్థాయి ప్రమోషన్స్‌లో పాల్గొనలేకపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ వ్యాధికి సంబంధించి చికిత్స తీసుకుంటున్నారు సమంత.


నన్నయ్య రాసిన...



● నిఖిల్

ట్రైన్ వేగంగా వెళుతోంది. ట్రైన్‌లో ఉన్న కుర్రాడి దృష్టంతా చేతిలో ఉన్న పుస్తకం పైనే. ఆ పుస్తకంలో కవిత ఉందో, పాట ఉందో.. ఇంకేదైనానా? అనే విషయం తెలియాలంటే కొన్ని రోజులు ఆగాలి. నిఖిల్, అనుపమా పరమేశ్వరన్ జంటగా అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న '18 పేజెస్'లోని ఒక దృశ్యం ఇది. ప్రముఖ దర్శకుడు సుకుమార్ కథ అందించిన ఈ చిత్రానికి పల్నాటి సూర్య ప్రతాప్ దర్శకుడు. డిసెంబర్ 23న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ చిత్రంలోని 'నన్నయ్య రాసిన...' అనే పాట లిరికల్ వీడియోను ఈ నెల 22న రిలీజ్ చేయనున్నారు. ఈ విషయాన్ని ప్రకటించి, నిఖిల్ ట్రైన్‌లో బుక్ చదువుతున్న ఫొటోను విడుదల చేశారు. ఈ చిత్రానికి సంగీతం: గోపీసుందర్, కెమెరా: వసంత్, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: శరణ్ రాపర్తి (గీతా ఆర్ట్స్), అశోక్ బండ్రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్: బాబు.

వెండితెర వాజ్‌పేయి



● పంకజ్ త్రిపాఠి

భారత మాజీ ప్రధానమంత్రి, భారతీయ జనతా పార్టీ దివంగత ప్రముఖ నేత అటల్ బిహారీ వాజ్‌పేయి బయోపిక్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు రవి జాదవ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో వాజ్‌పేయిగా పంకజ్ త్రిపాఠి నటిస్తున్నట్లుగా శుక్రవారం ప్రకటించారు. ''అటల్ బిహారి వాజ్‌పేయి కేవలం రాజకీయవేత్త మాత్రమే కాదు...మంచి మానవతావాది, రచయిత, కవి కూడా. ఇలాంటి వ్యక్తి పాత్రలో నటిస్తున్నందుకు ఓ నటుడిగా నాకు సంతోషంగా ఉంది'' అని పంకజ్ త్రిపాఠి పేర్కొన్నారు. ఈ సినిమాను అటల్ బిహారి వాజ్‌పేయి 99వ జయంతి సందర్భంగా వచ్చే ఏడాది క్రిస్మస్‌కు రిలీజ్ చేయాలనుకుంటున్నారు.



● నయనతార

ఆ రోజు కనెక్ట్

'మాయ' (2015) చిత్రం తర్వాత హీరోయిన్ నయనతార, దర్శకుడు అశ్విన్ శరవణన్ కాంబినేషన్‌లో రూపొందిన లేటెస్ట్ హారర్ మూవీ 'కనెక్ట్'. ఇందులో సత్యరాజ్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషించారు. శుక్రవారం (నవంబరు 18) నయనతార బర్త్ డే. ఈ సందర్భంగా 'కనెక్ట్' ట్రైలర్‌ను విడుదల చేసి, ఈ సినిమాను డిసెంబరు 22న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. రౌడీ పిక్చర్స్ పతాకంపై నయనతార భర్త, దర్శక–నిర్మాత విఘ్నేష్ శివన్ ఈ సినిమాను నిర్మించారు. 'కనెక్ట్' రిలీజ్ అప్‌డేట్‌తో పాటు నయనతార నటించనున్న కొత్త సినిమా ప్రకటన కూడా వచ్చింది. ఇది నయనకు 81వ సినిమా. ఈ సినిమాకు దురై సెంథిల్ కుమార్ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాను కూడా విఘ్నేష్ శివనే నిర్మించనుండటం విశేషం.

రెండు దశాబ్దాల తర్వాత హిందీలో...



● జ్యోతిక

దక్షిణాదిలో సూపర్‌హిట్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్నారు జ్యోతిక. కాగా హిందీలో ఆమె నటించిన తొలి చిత్రం 'డోలీ సజా కే రఖ్‌నా' 1988లో విడుదలైంది. ఈ చిత్రం తర్వాత ఆమె 'లిటిల్ జాన్' (2001) అనే హిందీ చిత్రంలో నటించారు. మళ్లీ హిందీలో సినిమాలు చేయలేదు. ఇప్పుడు 21 ఏళ్ల తర్వాత జ్యోతిక ఓ హిందీ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. బొల్లాంట్ ఇండస్ట్రీస్ అధినేత శ్రీకాంత్ బొల్లా జీవితం ఆధారంగా ఓ బయోపిక్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో శ్రీకాంత్ బొల్లాగా రాజ్‌కుమార్ రావు నటిస్తున్నారు. తుషార్ హిద్రాని దర్శకుడు. ఈ బయోపిక్‌లో ఓ హీరోయిన్ పాత్ర కోసం జ్యోతికను సంప్రదించగా, గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని టాక్. ఈ చిత్రానికి సంబంధించిన వర్క్‌షాప్స్‌లోనూ ఆమె పాల్గొంటున్నారట. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నంలో పుట్టి, సవాళ్లను అధిగమించి అమెరికాలోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చదువుకున్న తొలి అంధుడిగా శ్రీకాంత్ బొల్లా రికార్డు సృష్టించారు. ఆ తర్వాత హైదరాబాద్ కేంద్రంగా బొల్లాంట్ ఇండస్ట్రీస్‌ను స్థాపించి 3 వేల మందికి పైగా దివ్యాంగులకు ఉపాధి కల్పించారు. మరో మూడువేల మంది దివ్యాంగుల చదువుకు సహాయం చేస్తున్నారు శ్రీకాంత్.

మీట్ క్యూట్ అంటే..?

''నీకు మీట్ క్యూట్ అంటే తెలుసా... మీట్ క్యూటా.. మీట్ క్యూట్ అంటే... పరిచయం లేని ఇద్దరు వ్యక్తుల మధ్య వచ్చే పరిస్థితులు.. మాటలు.. ఆ జ్ఞాపకాలు జీవితాంతం గుర్తుండిపోతాయి'' అంటూ నాని వాయిస్ ఓవర్‌తో మొదలైంది 'మీట్ క్యూట్' ఆంథాలజీ ట్రైలర్. సత్యరాజ్, రోహిణి, అదా శర్మ, వర్ష బొల్లమ్మ, ఆకాంక్షా సింగ్, రుహానీ శర్మ, సునైనా, సంచితా పూనాచా, అశ్విన్‌కుమార్, శివ కందుకూరి, దీక్షిత్ శెట్టి, గోవింద్ పద్మ సూర్య, రాజా ప్రధాన పాత్రలు పోషించారు. నాని సోదరి దీప్తి గంటా దర్శకత్వం వహించిన ఈ ఆంథాలజీని వాల్ పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి త్రిపిర్నేని నిర్మించారు. ఓటీటీ ప్లాట్‌ఫామ్ సోనీ లివ్‌లో ఈ ఆంథాలజీ ఈ నెల 25నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా 'మీట్ క్యూట్' ట్రైలర్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. ఈ ఆంథాలజీకి సంగీతం: విజయ్ బుల్గానిన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం.



● సత్యరాజ్, రుహానీ శర్మ

వినోదాల సిత్రాలు

లక్ష్మణ్, భ్రమరాంబిక, కిశోరి దాత్రక్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'సీతారాం సిత్రాలు'. డి. నాగ శశిధర్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, ఈ చిత్రాన్ని పార్థసారథి, డి. నాగేందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్ లోగోను సినిమాటోగ్రాఫర్ , డైరెక్టర్ కేవీ గుహన్ విడుదల చేసి, ''ఈ చిత్రం ప్రేక్షకులను అలరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''వినోద ప్రధానంగా సాగే ఈ చిత్రం కథ కథనాలు కొత్తగా ఉంటాయి'' అన్నారు నాగ శశిధర్ రెడ్డి. ఈ చిత్రానికి సంగీతం: రుద్ర కిరణ్, కెమెరా: అరుణ్ కుమార్ పర్వతనేని.



● భ్రమరాంబిక, లక్ష్మణ్

సాక్షి బిజినెస్
శనివారం
19-11-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
సెన్సెక్స్ ▽ 87 61,663	నిఫ్టీ ▽ 36 18,308	నాస్‌డాక్	11,066	▽	78
		డోజోన్స్	33,566	△	19
		ఎఫ్‌టీఎస్ఈ 100	7,384	△	37
		డాక్స్	14,433	△	167
		షాంఘై	3,097	▽	18
		నికాయ్	27,900	▽	31

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
52,953	△	59
బంగారం (99.5 స్వచ్ఛత)		
52,741	△	59
వెండి (కిలో)		
61,320	△	67

బెస్ట్ ఉద్యోగులు నాతోనే.. నాకేం వర్రీ లేదు..

- ఉద్యోగుల మూకుమ్మడి రాజీనామా వార్తలపై ట్విటర్ మస్క్ స్పందన



న్యూయార్క్: ఉద్యోగులు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నారన్న వార్తలపై ట్విటర్ చీఫ్ ఎలాన్ మస్క్ స్పందించారు. ఈ విషయంపై తానేమీ తీవ్రంగా ఆందోళన చెందడం లేదని, మెరికల్లాంటి ఉద్యోగులు కంపెనీలోనే ఉండాలని నిర్ణయించుకున్నారని ఆయన పేర్కొన్నారు. ట్విటర్‌ను కొత్తగా తీర్చిదిద్దేందుకు రేయింబవళ్లు తీవ్రంగా కష్టపడేందుకు ఇష్టపడితే ఉండొచ్చు లేకపోతే మానేయొచ్చు అంటూ ఉద్యోగులకు గురువారం సాయంత్రం వరకూ (అమెరికా కాలమానం ప్రకారం) మస్క్ డెడ్‌లైన్ విధించిన నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. కంపెనీ కార్యాలయాలను సోమవారం వరకూ మూసివేస్తున్నామని ట్విటర్ ఈమెయిల్స్ పంపడం, పెద్దయెత్తున ఉద్యోగుల రాజీనామా వార్తలు రావడం వంటి అంశాలతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ట్విటర్‌లో యూజర్ల నుండి ట్వీట్‌లు వెల్లువెత్తాయి. అయితే, ఈ పరిణామాలతో ట్విటర్ వినియోగం సరికొత్త గరిష్ట స్థాయికి పెరిగిందంటూ మస్క్ ట్వీట్ చేశారు. మరోవైపు ఉద్యోగుల రాజీనామాలతో కలవరం చెందిన మస్క్, ఆయన సలహాదారులు .. కొందరు కీలక సిబ్బందితో చర్చలు జరిపి, వారు కంపెనీని వీడకుండా ఆపే ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. అలాగే, ఇంకా ఏ నిర్ణయమూ తీసుకోని వారితో కూడా మస్క్ బృందం సమాలోచనలు జరిపినట్లు న్యూయార్క్ టైమ్స్ ఒక కథనం ప్రచురించింది. అయితే తాము మానేస్తున్నట్లు చెప్పేందుకు కాల్ చేసిన కొందరు ఉద్యోగులు .. మస్క్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతుంటే మధ్యలోనే కట్ చేసినట్లు పేర్కొంది.

రెండేళ్లలో సగం వాటా మాదే

- 2024-25 నాటికి తొలి ఈవీ
- మారుతీ సుజుకీ శ్రీవాస్తవ



షోరూం ప్రారంభోత్సవంలో శశాంక్ శ్రీవాస్తవ, వరుణ్ దేవ్, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిశోర్ తదితరులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ రెండేళ్లలో ప్యాసింజర్ వెహికల్స్ విభాగంలో 50 శాతం వాటాను అందుకోవచ్చని ధీమా వ్యక్తం చేస్తోంది. ప్రస్తుతం 42 శాతం వాటా ఉందని సంస్థ మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు. దేశంలో 3,500వ ఔట్‌లెట్‌ను శుక్రవారమిక్కడ ప్రారంభించిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 'మార్చి నాటికి కొత్తగా రెండు ఎస్‌యూవీలను పరిచయం చేస్తాం. ఎస్‌యూవీల్లో ప్రస్తుతం కంపెనీకి 14.5 శాతం వాటా ఉంది. దీనిని పెంచుకోవడం ద్వారా లక్ష్యాన్ని చేరుకుంటాం. కంపెనీ తొలి ఎలక్ట్రిక్ కారు 2024-25లో రంగ ప్రవేశం చేయనుంది. ఈవీల కంటే ముందుగా హైబ్రిడ్ కార్లకు ఆదరణ పెరుగుతుంది. చార్జింగ్ మౌలిక వసతులు ఉంటేనే వినియోగదార్లలో ఈవీల పట్ల విశ్వాసం ఉంటుంది. 2030 నాటికి ఈవీల వాటా 15-17 శాతానికి చేరుకోవచ్చని అంచనా. ఇక అమ్మకాల పరంగా హైదరాబాద్ మూడవ స్థానంలో ఉంది' అని వివరించారు. మారుతీ సుజుకీ మొత్తం విక్రయాల్లో తమ వాటా 2 శాతమని వరుణ్ మోటార్స్ ఎండీ వరుణ్ దేవ్ వెల్లడించారు.

రెండో రోజూ నేలచూపు

- సెన్సెక్స్ 87 పాయింట్లు డౌన్
- 61,663 వద్ద ముగిసిన ఇండెక్స్
- ఆటో, ఆయిల్, హెల్త్‌కేర్ డీలా
- పీఎస్‌యూ బ్యాంక్స్ జూమ్



ముంబై: వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. స్వల్ప లాభాలతో ప్రారంభమైనప్పటికీ రోజంతా నష్టాలలోనే కదిలాయి. చివరికి సెన్సెక్స్ 87 పాయింట్లు క్షీణించి 61,663 వద్ద ముగిసింది. నిఫ్టీ 36 పాయింట్లు తక్కువగా 18,308 వద్ద స్థిరపడింది. తొలుత హుషారు చూపిన మార్కెట్లు వెనువెంటనే నీరసించాయి. అమ్మకాలు ఊపందుకోవడంతో మిడ్ సెషన్‌కల్లా సెన్సెక్స్ 61,337కు, నిఫ్టీ 18,210 దిగువకు చేరాయి. ఈ వారం ఆటుపోట్ల మధ్య కదిలిన మార్కెట్లు చివరికి స్వల్ప నష్టాలతో నిలిచాయి. నికరంగా సెన్సెక్స్ 132 పాయింట్లు, నిఫ్టీ 42 పాయింట్లు కోల్పోయాయి.

ఆటో బ్లూచిప్స్ వీక్: ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్, ఫార్మా రంగాలు 1.2-0.6 శాతం మధ్య క్షీణించాయి. అయితే పీఎస్‌యూ బ్యాంక్స్ 1.5 శాతం ఎగసింది. నిఫ్టీ దిగ్గజాలలో ఎంఅండ్‌ఎం, బజాజ్ ఆటో, ఎన్‌టీపీసీ, బజాజ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్, ఐషర్, మారుతీ, సిప్లా, కోల్ ఇండియా, టాటా కన్జూమర్, ఎయిర్‌టెల్, యూపీఎల్ 2.5-1 శాతం మధ్య నష్టపోయాయి. మరోవైపు హెచ్‌సీఎల్ టెక్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌యూఎల్, ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్, కొటక్ బ్యాంక్ 1.2-0.4 శాతం మధ్య బలపడ్డాయి.

చిన్న షేర్లు: మార్కెట్లను మించుతూ మిడ్, స్మాల్ క్యాప్స్ వెనకడుగు వేశాయి. బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 0.5 శాతం డీలా పడ్డాయి. ట్రేడైన షేర్లలో 2,137 నష్టపోగా.. 1,360 లాభపడ్డాయి.

మోల్డ్‌టెక్ రెండు ప్లాంట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్యాకేజింగ్ రంగ కంపెనీ మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ కొత్తగా రెండు ప్లాంట్లను స్థాపిస్తోంది. తమిళనాడులోని చెయ్యార్, హరియాణాలోని పానిపట్ వద్ద ఇవి రానున్నాయి.

ఆదిత్య బిర్లా గ్రూప్ కోసం వీటిని నెలకొల్పుతున్నట్టు కంపెనీ శుక్రవారం ప్రకటించింది. ఒక్కో ప్లాంటుకు రూ.30 కోట్లు వెచ్చించనున్నట్టు సంస్థ సీఎండీ జె.లక్ష్మణరావు తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-11-2022	
విశాఖ	520-00
చిత్తూరు	558-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	517-00
విజయవాడ	517-00
రిటైల్ ధర (డజను)	78.00
18-11-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

సీమాంతర డేటా బదిలీ సరళతరం

- నిబంధనల ఉల్లంఘనలకు రూ. 500 కోట్ల వరకు జరిమానా
- డేటా బిల్లు కొత్త ముసాయిదా ప్రవేశపెట్టిన కేంద్రం
- టెక్ దిగ్గజాలకు ఊరట



న్యూఢిల్లీ: వ్యక్తిగత డేటాను నిర్దిష్ట దేశాలకు బదిలీ చేసేందుకు, అక్కడ నిల్వ చేయడానికి అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం కొత్త డేటా ప్రైవసీ చట్టం ముసాయిదాను ప్రవేశపెట్టింది. ఇందుకోసం భారత్‌కు వెలుపల ఏయే దేశాలు, ప్రాంతాలను ఎంచుకోవచ్చనేది నోటిఫై చేయనుంది. అలాగే సంబంధిత నిబంధనలు ఉల్లంఘిస్తే రూ. 500 కోట్ల వరకు జరిమానా విధించనుంది. శుక్రవారం ఈ మేరకు డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ (డీపీడీపీ) బిల్లు 2022 ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం ఆవిష్కరించింది. దీనిపై డిసెంబర్ 17లోగా సంబంధిత వర్గాలు తమ అభిప్రాయాలను తెలియజేయాల్సి ఉంటుంది. భారత్‌కు సంబంధించిన డేటాను దేశీయంగానే నిల్వ చేయాలంటూ గత బిల్లులో చేసిన ప్రతిపాదనలు పలు దిగ్గజ టెక్ కంపెనీల్లో ఆందోళన కలిగించిన సంగతి తెలిసిందే. తాజా మార్పులతో గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్ వంటి సంస్థలకు ఊరట లభించనుంది. పార్లమెంటు ఆమోదం పొందాక ముసాయిదా బిల్లు .. చట్టంగా మారుతుంది. వ్యక్తిగత డేటా విషయంలో ఒకవైపు వ్యక్తుల హక్కులు, బాధ్యతలను మరోవైపు డేటా సేకరించే సంస్థల బాధ్యతలను స్పష్టంగా నిర్వచిస్తూ ఈ బిల్లును రూపొందించినట్లు ముసాయిదాలో పేర్కొన్నారు. చట్టబద్ధత, పారదర్శకత తదితర ఏడు సూత్రాల ప్రాతిపదికన బిల్లును తయారు చేసినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ వివరించింది. 'పౌరుల డేటా రక్షణ, పరిశ్రమకు వ్యాపారాల నిర్వహణ సులభతరం చేయడం, దేశ భద్రత.. ప్రజా ప్రయోజనాల పరిరక్షణ లక్ష్యాలకు అనుగుణంగా బిల్లు రూపొందింది' అని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. వివాదాస్పద అంశాలు తొలగించి డేటా బిల్లును సరళతరం చేశారని న్యాయ సేవల సంస్థ జేఎస్‌ఏ పార్ట్‌నర్ రూపీందర్ మాలిక్ పేర్కొన్నారు.

ముసాయిదాలోని ముఖ్యాంశాలు..

- వ్యక్తిగత డేటాను సేకరించే ముందు వ్యక్తుల సమ్మతి తీసుకోవాలి. సదరు డేటాను షేర్ చేయడం, మార్చడం, ధ్వంసం చేయడం వంటి అంశాలకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించిన పక్షంలో డేటాను సేకరించిన వ్యక్తులు, కంపెనీలపై రూ. 500 కోట్ల వరకూ జరిమానా విధించవచ్చు. 2019లో జారీ చేసిన గత ముసాయిదాలో ఈ పెనాల్టీని రూ. 15 కోట్లు లేదా కంపెనీ గ్లోబల్ టర్నోవరులో 4% (ఏది ఎక్కువైతే అది)గా ప్రతిపాదించారు.
- అలాగే ఏదైనా పత్రం, సర్వీసు, గుర్తింపు ధ్రువీకరణ లేదా చిరునామా ధ్రువీకరణ కోసం దరఖాస్తులో తప్పుడు సమాచారం ఇచ్చే వ్యక్తులపై రూ. 10,000 జరిమానా విధించవచ్చు.
- దేశ సార్వభౌమత్వం, సమగ్రత కాపాడేందుకు రాష్ట్ర ఏజెన్సీలకు బిల్లులోని నిబంధనల నుంచి మినహాయింపునిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి అధికారాలు ఉంటాయి.
- కంపెనీలు తాము సేకరించిన డేటాను నిర్దిష్ట వ్యవధి వరకే నిల్వ చేసుకోవచ్చు.
- డేటా సేకరించే సేకరించే సంస్థలు.. నిబంధనల పాటింపు కోసం డేటా రక్షణ బోర్డును ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. యూజర్ల నుండి వచ్చే ఫిర్యాదులను కూడా ఈ బోర్డు వినాలి.
- యూజర్లు తమ సమ్మతిని తెలియజేసేందుకు, సమీక్షించుకునేందుకు, ఉపసంహరించుకునేందుకు ఆయా కంపెనీలు పారదర్శకమైన ప్లాట్‌ఫాంను అందుబాటులో ఉంచాలి.
- వ్యక్తిగత డేటాను సరిచేసుకునేందుకు, తొలగించేందుకు యూజర్లకు హక్కులు ఉంటాయి.
- తల్లిదండ్రుల సమ్మతి లేకుండా పిల్లల వ్యక్తిగత డేటాను సేకరించకూడదు. ప్రాసెస్ చేయకూడదు. పిల్లలను లక్ష్యంగా చేసుకునే ప్రకటనలు ఇవ్వకూడదు.
- భారీ కంపెనీలు తాము ప్రాసెస్ చేసే డేటా పరిమాణాన్ని బట్టి .. నిబంధనల పాటింపును మదింపు చేసేందుకు స్వతంత్ర డేటా ఆడిటర్‌ను నియమించుకోవాలి.
- డేటా ప్రొటెక్షన్ బోర్డ్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేసే ప్రతిపాదన ముసాయిదాలో ఉంది. ఇది నిబంధనల ఉల్లంఘన కేసులను విచారణ చేసి, తగు నిర్ణయాలు తీసుకుంటుంది.
- వ్యక్తిగత డేటాను స్వయంగా లేదా డేటా ప్రాసెసర్లతో ప్రాసెస్ చేసే డేటా ఫిడ్యుషియరీ సంస్థలకు వివిధ రకాల జరిమానాలుంటాయి.

పీఎస్‌బీ సీఈవోల పదవీకాలం పదేళ్లకు పెంపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) సీఈవో, ఎండీల గరిష్ట పదవీకాలాన్ని 10 సంవత్సరాలకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన నిబంధనను సవరిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రతిభావంతులను పీఎస్‌బీలు వదులుకోకుండా అట్టే పెట్టుకోవడానికి ఈ నిర్ణయం తోడ్పడనుంది. ఇప్పటివరకు గరిష్ట పదవీకాలం 60 ఏళ్ల సూపర్ యాన్యుయేషన్‌కు లోబడి 5 సంవత్సరాలుగా ఉంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్ఈ) హోల్-టైమ్ డైరెక్టర్లకు కూడా ఇదే వర్తిస్తోంది.



ఎండీలు, హోల్-టైమ్ డైరెక్టర్లకు ప్రాథమికంగా పదవీకాలం అయిదేళ్ల పాటు ఉంటుందని, రిజర్వ్ బ్యాంక్‌తో సంప్రదింపుల మేరకు దీన్ని గరిష్ఠంగా 10 ఏళ్ల వరకూ పొడిగించవచ్చని ప్రభుత్వం తాజా నోటిఫికేషన్‌లో పేర్కొంది. పదవీకాలం ముగియడానికి ముందుగానే వారిని ఏ కారణం వల్లనైనా తొలగించాల్సి వస్తే మూడు నెలల ముందు రాతపూర్వక నోటీసులు ఇవ్వాలి. లేదా మూడు నెలల జీతభత్యాలు చెల్లించాలి.

సాక్షి స్పోర్ట్స్

అర్జున్ ఖాతాలో తొలి విజయం

మెల్ట్‌వాటర్ చాంపియన్స్ టూర్ ఫైనల్స్ టోర్నమెంట్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్, తెలంగాణ ప్లేయర్ ఇరిగేశి అర్జున్ తొలి విజయం నమోదు చేశాడు. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం జరిగిన నాలుగో రౌండ్ మ్యాచ్‌లో అర్జున్ 3-1తో షఖ్రియార్ మమెదైరోవ్ (అజర్‌బైజాన్)పై గెలుపొందాడు. తొలి గేమ్‌ను 59 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్న అర్జున్, రెండో గేమ్‌లో 58 ఎత్తుల్లో నెగ్గాడు. మూడో గేమ్‌ను 37 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించిన అర్జున్ చివరిదైన నాలుగో గేమ్‌లో 33 ఎత్తుల్లో గెలిచాడు. భారత్‌కే చెందిన మరో యువ గ్రాండ్‌మాస్టర్, చెన్నై కుర్రాడు ప్రజ్ఞానంద టోర్నీలో తొలి ఓటమి చవిచూశాడు. ప్రజ్ఞానంద 1-2తో వెస్లీ సో (అమెరికా) చేతిలో పరాజయం పాలయ్యాడు. ఎనిమిది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య ఏడు రౌండ్లపాటు జరుగుతున్న ఈ టోర్నీలో నాలుగో రౌండ్ తర్వాత ప్రజ్ఞానంద నాలుగు పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో, అర్జున్ మూడు పాయింట్లతో ఏడో ర్యాంక్‌లో ఉన్నారు.



మళ్లీ ఓడిన తెలుగు టైటాన్స్



బెంగాల్ వారియర్స్ రెయిడర్ శ్రీకాంత్ జాదవ్‌ను నిలువరించే యత్నంలో తెలుగు టైటాన్స్ ఆటగాళ్లు

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. శుక్రవారం హైదరాబాద్ అంచె మ్యాచ్‌లు మొదలయ్యాయి. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 28-36తో బెంగాల్ వారియర్స్ చేతిలో ఓడిపోయింది. ఈ లీగ్‌లో ఇప్పటి వరకు 15 మ్యాచ్‌లు ఆడిన తెలుగు టైటాన్స్ ఒక్క మ్యాచ్‌లో నెగ్గి, 14 మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసింది. తొమ్మిది పాయింట్లతో టైటాన్స్ చివరిదైన 12వ స్థానంలో ఉంది. వారియర్స్‌తో మ్యాచ్‌లో టైటాన్స్ తరఫున రెయిడర్లు అభిషేక్ సింగ్ తొమ్మిది పాయింట్లతో, సిద్ధార్థ్ దేశాయ్ ఎనిమిది పాయింట్లతో, పర్వేశ్ ఐదు పాయింట్లతో రాణించారు. వారియర్స్ తరఫున మణీందర్ సింగ్ 12 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలువగా... శ్రీకాంత్ జాదవ్ ఏడు పాయింట్లు స్కోరు చేశాడు. ఇతర మ్యాచ్‌ల్లో పుణేరి పల్టన్ 41-28తో హరియాణా స్టీలర్స్‌పై, బెంగళూరు బుల్స్ 45-38తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచాయి. నేడు జరిగే మ్యాచ్‌ల్లో యూపీ యోధాస్‌తో జైపూర్ పింక్ పాంథర్స్; యు ముంబాతో తెలుగు టైటాన్స్; దబంగ్ ఢిల్లీతో పట్నా పైరేట్స్ తలపడతాయి.

ఆగని వాన.. జరగని ఆట

- భారత్, న్యూజిలాండ్ తొలి టి20 వర్షార్పణం
- రేపు రెండో మ్యాచ్





నెట్‌గా పెట్టి కాళ్లతో వాలీబాల్ ఆడారు. దీన్ని 'ఫుట్ వాలీ'గా బీసీసీఐ ట్విట్టర్‌లో వీడియో పోస్ట్ చేసింది.

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ పర్యటనలో భారత్‌కు తొలి టి20లో వర్షం ఎదురైంది. దీంతో ప్రత్యర్థుల మధ్య 'పొట్టి' సమరం రద్దయ్యింది. శుక్రవారం జరగాల్సిన మొదటి మ్యాచ్‌కు జోరువాన అడ్డుపడటంతో ఆటకు అవకాశమే లేకపోయింది. అసలు టాస్ అయినా వేయలేదు. చినుకులు ఆగితే టి20 మెరుపుల్ని కనీసం 5 ఓవర్ల చొప్పున నిర్వహించాలనుకున్న అంపైర్లు రాత్రి గం. 9.46 (న్యూజిలాండ్ కాలమానం ప్రకారం) కటాఫ్ టైమ్‌గా పెట్టుకున్నారు. అయితే వాన ఎంతకీ తగ్గకపోవడంతో వెల్లింగ్టన్ స్కై స్టేడియం పూర్తిగా చిత్తడి అయ్యింది. చేసేదేమీ లేక ఫీల్డ్ అంపైర్లు కటాఫ్ టైమ్‌కు గంట ముందుగానే రాత్రి.గం. 8.52 నిమిషాలకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. టి20 ప్రపంచకప్ సెమీఫైనలిస్టుల మధ్య తొలి మ్యాచ్ నుంచే ఆసక్తికర సమరం జరుగుతుందని ఆశిస్తే అనుకోని అతిథిగా వర్షం వచ్చి ఆటను తుడిచిపెట్టింది. ఇరుజట్ల ఆటగాళ్లు సరదాగా స్టేడియం ఇండోర్‌లో 'ఫుట్‌వాలీ' ఆడారు. మధ్యలో కుర్చీలను

మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండో టి20 ఆదివారం మౌంట్‌మాంగనుయ్‌లో జరుగనుంది.

రొనాల్డో... ఆఖరి అవకాశం

- ప్రపంచకప్ కోసం చివరిసారి బరిలోకి పోర్చుగల్ స్టార్
- గ్రూప్ 'హెచ్'లో ఘనా, ఉరుగ్వే, కొరియా జట్లతో పోరు

క్రీడాభిమానులకు ప్రత్యేకంగా పరిచయం చేయనక్కర్లేని పేరు క్రిస్టియానో రొనాల్డో. 2003 నుంచి పోర్చుగల్ జాతీయ సీనియర్ జట్టుకు ఆడుతున్న రొనాల్డో తన కెరీర్‌లో ప్రొఫెషనల్ లీగ్స్‌లో (ప్రీమియర్ లీగ్, లా లిగా, చాంపియన్స్ లీగ్, సెరియా లీగ్) అందుబాటులో ఉన్న అన్ని గొప్ప టైటిల్స్ సాధించాడు. కానీ ప్రపంచకప్ ఒక్కటే అతడిని అందని ద్రాక్షగా ఊరిస్తోంది. వరుసగా ఐదో ప్రపంచకప్‌లో ఆడుతున్న రొనాల్డో ఆఖరి ప్రయత్నంగా మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాడు. తన నాయకత్వంలో పోర్చుగల్‌ను 2016లో యూరో చాంపియన్‌గా నిలబెట్టిన రొనాల్డో 2019లో నేషన్స్ లీగ్ టైటిల్ కూడా అందించాడు. ఈసారి పోర్చుగల్ విశ్వవిజేతగా నిలిస్తే క్రిస్టియానో రొనాల్డో దిగ్గజాల సరసన చేరడంతోపాటు తన కెరీర్‌ను పరిపూర్ణం చేసుకుంటాడు.



రొనాల్డో



పోర్చుగల్

ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన: మూడో స్థానం (1966). **'ఫిఫా' ర్యాంక్:** 9. **అర్హత ఎలా:** యూరోపియన్ క్వాలిఫయింగ్ ప్లే ఆఫ్ విజేత.

ఎనిమిదోసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న పోర్చుగల్ యువ, సీనియర్ ఆటగాళ్లతో పటిష్టంగా ఉంది. రికార్డుస్థాయిలో ఐదోసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న కెప్టెన్ క్రిస్టియానో రొనాల్డో జట్టుకు వెన్నెముకలాంటి వాడు. పోర్చుగల్ తరఫున ఇప్పటి వరకు 191 మ్యాచ్‌లు ఆడిన రొనాల్డో 117 గోల్స్ సాధించి అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు. రొనాల్డోతోపాటు రాఫెల్ లియావో, బెర్నార్డో సిల్వా, రూబెన్ డయాస్ కీలక ఆటగాళ్లు.

ఘనా

ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన: క్వార్టర్ ఫైనల్ (2010). **'ఫిఫా' ర్యాంక్:** 61. **అర్హత ఎలా:** ఆఫ్రికా క్వాలిఫయింగ్ మూడో రౌండ్ విజేత.

'బ్లాక్ స్టార్స్'గా పేరున్న ఘనా నాలుగోసారి ప్రపంచకప్‌లో ఆడుతోంది. 2018 ప్రపంచకప్‌నకు అర్హత పొందలేకపోయిన ఘనా అంతకుముందు రెండు ప్రపంచకప్‌లలో గ్రూప్ దశను దాటి ముందుకెళ్లింది. ఈసారి తమ గ్రూప్‌లోని మూడు జట్లు పటిష్టమైనవి కావడంతో ఘనా సంచలన ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. డెనిస్ ఒడోయ్, లాంప్టె, కుడుస్, అబ్దుల్ రహమాన్ కీలక ఆటగాళ్లు.

ఉరుగ్వే

ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన: చాంపియన్ (1930, 1950). **'ఫిఫా' ర్యాంక్:** 14. **అర్హత ఎలా:** దక్షిణ అమెరికా క్వాలిఫయింగ్‌లో మూడో స్థానం.

నిలకడలేని ప్రదర్శనకు మారుపేరైన ఉరుగ్వే 14వసారి ప్రపంచకప్‌లో పోటీపడుతోంది. రెండుసార్లు విశ్వవిజేతగా నిలిచిన మూడు జట్లలో ఒకటైన ఉరుగ్వే ఈసారి ఎంత దూరం వెళ్తుందనేది అంచనా వేయలేము. గోల్‌కీపర్ ఫెర్నాండో ముస్లెరా, కెప్టెన్ డీగో గోడిన్, మార్టిన్ సెసెరెస్, లూయిస్ స్వారెజ్, ఎడిన్సన్ కవానిలకు 100 కంటే ఎక్కువ అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. సీనియర్లు సత్తా చాటుకుంటే ఉరుగ్వే జట్టుకు గ్రూప్ దశ దాటడం ఏమంత కష్టం కాబోదు.

దక్షిణ కొరియా

ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన: నాలుగో స్థానం (2002). **'ఫిఫా' ర్యాంక్:** 28. **అర్హత ఎలా:** ఆసియా క్వాలిఫయింగ్ మూడో రౌండ్ గ్రూప్ 'ఎ' రన్నరప్.

ప్రపంచకప్‌లో ఆసియా నుంచి అత్యధికసార్లు బరిలోకి దిగిన జట్టు దక్షిణ కొరియా. ఇప్పటి వరకు 11 సార్లు పోటీపడిన కొరియా తాము ఆతిథ్యమిచ్చిన 2002 టోర్నీలో నాలుగో స్థానంలో నిలిచింది. ఏ ఆసియా జట్టుకైనా ఇదే అత్యుత్తమ ప్రదర్శన. 1986 నుంచి ప్రతి ప్రపంచకప్‌నకు అర్హత పొందిన కొరియా 2002లో మినహా మిగతా అన్నిసార్లు గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. స్టార్ ప్లేయర్ సన్ హెయుంగ్ మిన్ ఫామ్ కొరియా విజయావకాశాలను నిర్దేశిస్తుందనడంలో సందేహం లేదు.

-సాక్షి క్రీడా విభాగం

జెట్ ఫైటర్ల ఎస్కార్ట్‌తో ఖతర్‌కు పోలాండ్ జట్టు



దోహా: పోలాండ్ ఫుట్‌బాల్ జట్టు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో ఖతర్ చేరుకుంది. రేపటి నుంచి మొదలయ్యే 'ఫిఫా' ప్రపంచకప్ టోర్నీ కోసం పోలాండ్ ఫుట్‌బాలర్లు ప్రత్యేక విమానంలో బయల్దేరారు. గత పది నెలలుగా పోలాండ్ పొరుగు దేశాలైన రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం కొనసాగుతోంది. నిత్యం మిస్సైల్స్, రాకెట్ లాంచర్ల మోత పొరుగు దేశాల్ని కూడా కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇటీవల రష్యా ప్రయోగించిన మిస్సైల్ పోలాండ్ భూభాగంలో పడింది. దీని ధాటికి ఇద్దరు పోలాండ్ పౌరులు మృతి చెందారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తమ జట్టు ప్రయాణిస్తున్న విమానానికి రక్షణగా రెండు ఎఫ్-16 జెట్ ఫైటర్లను ఎస్కార్టుగా ఖతర్ దాకా పంపింది. దీనికి సంబంధించిన వీడియోను పోలాండ్ జట్టు పోస్ట్ చేయడంతో నెట్టింట ఆ వీడియో ఆసక్తి రేపుతోంది.

బీసీసీఐ సెలక్షన్ కమిటీపై వేటు



చేతన్ శర్మ

న్యూఢిల్లీ: గత రెండు టి20 ప్రపంచకప్‌లలో టీమిండియా ఫైనల్ చేరడంలో విఫలమైంది. దీంతో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సీనియర్ సెలక్షన్ కమిటీపై వేటు వేసింది. చేతన్ శర్మ నేతృత్వంలోని కమిటీ మొత్తాన్ని రద్దు చేసింది. భారత్ ఆతిథ్యమివ్వాల్సిన గత ప్రపంచకప్‌ను యూఏఈలో నిర్వహించగా అక్కడ కోహ్లి సేన లీగ్ దశలోనే ఇంటిదారి పట్టింది. ఏడాది వ్యవధిలోనే ఆస్ట్రేలియాలో జరిగిన మెగా టోర్నీలో 'సూపర్-12' దాటిన రోహిత్ బృందం సెమీఫైనల్లో ఘోరంగా ఓడింది. ఈ రెండు టోర్నీల మధ్యలో ఆసియా కప్ ఆడిన టీమిండియా... అందులో లీగ్ దశలోనే వెనుదిరిగింది. ఈ నేపథ్యంలో బోర్డు కఠిన నిర్ణయం తీసుకోవడంతో నలుగురు సభ్యులు చేతన్ శర్మ(నార్త్‌జోన్), హర్విందర్ (సెంట్రల్), సునీల్ జోషి (సౌత్), దేబాశిష్ మొహంతి (ఈస్ట్) ఉన్న కమిటీకి ఉన్నపళంగా ఉద్వాసన పలికింది. కొత్త కమిటీ కోసం ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించింది.

సెమీస్‌లో మనిక



బ్యాంకాక్: ఏషియన్ కప్ టేబుల్ టెన్నిస్ (టీటీ) టోర్నమెంట్ మహిళల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ మనిక బత్రా సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 44వ ర్యాంకర్ మనిక 6-11, 11-6, 11-5, 11-7, 8-11, 9-11, 11-9తో ప్రపంచ 23వ ర్యాంకర్ చెన్ సు యు (చైనీస్ తైపీ)పై గెలుపొందింది. తద్వారా ఈ టోర్నీ చరిత్రలో సెమీ ఫైనల్ చేరిన తొలి భారతీయ క్రీడాకారిణిగా మనిక గుర్తింపు పొందింది.

25 స్వర్ణాలతో ముగింపు

డేగూ (కొరియా): ఆసియా ఎయిర్‌గన్ చాంపియన్‌షిప్‌లో ఆఖరి రోజు భారత షూటర్లు రెండు పసిడి పతకాలు నెగ్గి ఓవరాల్‌గా 25 బంగారు పతకాలతో ముగించారు. సీనియర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో రిథమ్-విజయ్‌వీర్ జోడీ 17-3తో రఖీమ్‌జాన్-ఇరినా (కజకిస్తాన్) జంటపై గెలిచింది. జూనియర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మను బాకర్-సామ్రాట్ జోడీ పసిడి పతకం గెలిచింది.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.